తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.TELTEL / 2013 /50370
గురువారం 17.04.2025 | సంపుటి : 11 సంచిక : 268 | పేజీలు : 12 వెల: రూ. 4/-
తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

# వక్ఫ్ సవరణ చట్టంపై నేడు మధ్యంతర ఉత్తర్వులు



## టీటీడీ ధర్మకర్తల మండలిలో హిందూయేతరులను నియమిస్తారా?

- భారత రాజ్యాంగం ఆర్టికల్ 26, 14కు విరుద్ధంగా ఉన్నాయి
- ఏళ్లనాటి ఆస్తులకు ఇప్పుడు పత్రాలు ఎక్కడి నుంచి వస్తాయి?
- వారి ఆస్తులను డినోటిఫై చేస్తే అనేక సమస్యలు తలెత్తుతాయి
- కేంద్రాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు .. నేడు మళ్లీ విచారణ
- చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం బాధకరమని వ్యాఖ్య

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్రంకొత్తగాతీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం విచారణ ప్రారంభించింది. అయితే, వక్ఫ్ చట్టంపై స్టే విధించేందుకు నిరాకరించిన ధర్మాసనం.. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చడం, వక్ఫ్ ఆస్తులపై వివాదంపై కలెక్టర్లకు అధికారాలు, కోర్టులు వక్ఫ్గా ప్రకటించిన ఆస్తులను డీ నోటిఫై చేయడం తదితర కీలక నిబంధనలపై సుప్రీంకోర్టు బుధవారం స్టే విధించింది. ఈ సందర్భంగా కేంద్రం ప్రభుత్వంతో పాటు ప్రతివాదులకు కోర్టు నోటీసులు జారీ చేస్తూ విచారణను గురువారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణ వాయిదా వేసింది.పిటిషనర్లు లేవనెత్తిన అంశాలకు సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ కన్నా, జస్టిస్ పీవీ సంజయ్కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథ్తో కూడిన ముగ్గురు మిగతా 2లో..

## సీఈసీ, ఈసీల నియామకంపై విచారణ

మే14కు వాయిదా వేసిన సుప్రీం 11లో

## నేటినుంచి భూభారతి అవగాహన సదస్సులు

నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రారంభించనున్న మంత్రి పొంగులేటి

హైదరాబాద్(జనంసాక్షి):ధరణి స్థానంలో తీసుకుని వచ్చిన తెలంగాణ భూ భారతి కార్యక్రమం గురువారం నుంచి నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న భూభారతి పైలట్ ప్రాజెక్టు రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ప్రారంభించనున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డిలోని లింగంపేట, నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని ఖాజీపురంలో మిగతా 2లో..







## గ్రీన్ఎనర్జీ పాలసీతో తెలంగాణలో భారీగా పెట్టుబడులు

రాష్ట్రంలో రూ.29 వేల కోట్లతో ఎకోరేస్ ఎనర్జీ, జిపిఆర్ఎస్ ఆర్య కంపెనీల కొత్త ప్రాజెక్టులు

- ఈ మేరకు ఉపముఖ్యంత్రి భట్టితో సంస్థ ప్రతినిధులు ఎంవోయూ
- 2035 నాటికి 40 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తియే లక్ష్యం
- కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టుల అభివృద్ధితో రాష్ట్రంలో రైతులకు ఆర్థికంగా మేలు జరగాలి
- గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్(జనంసాక్షి):ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ న్యూ ఎనర్జీ పాలసీకి ఆకర్షితులై జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం హైదరాబాద్లో తెలంగాణ ఇన్స్టిట్యూట్ రూరల్ డెవలప్మెంట్ సంస్థలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సమక్షంలో రూ. 29 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి టీజీరెడ్కోతో ఎకోరేస్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జిపిఆర్ఎస్ ఆర్య ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఎంవోయూ చేసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమం త్రి భట్టి విక్రమార్క మాట్లాడారు. న్యూ ఎనర్జీ పాలసీ తీసుకురావడం వల్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులు దావోస్ వెళ్ళినప్పుడు సన్ పెట్రో కంపెనీ 3400 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి చేయడానికి 20వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టడానికి ఎంఓయు చేసుకున్నదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదే విధంగా మెగా కంపెనీ 1500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి 7500 కోట్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చిందన్నారు. ఈ రెండు కంపెనీలు డిపిఆర్ తయారు చేసే పనిలో ఉన్నాయని మిగతా 2లో..

## సుప్రీం తదుపరి సీజేగా జస్టిజ్ బిఆర్ గవాయ్

సిఫారసు చేసిన కొలీజియం



న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి గా జస్టిస్ బీఆర్ గవాయ్ నియమితులయ్యారు. కొలీజియం సిఫారసుల మేరకు ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా మిగతా 2లో..

## భాష అనేది మతానికి సంబంధించినది కాదు

ఉర్దూ ముమ్మాటికీ దేశీయ భాషే

దానిని తిరస్కరించే అధికారం లేదు

సుప్రీం కోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ(జనంసాక్షి): సైన్బోర్డులకు ఉర్దూ భాషను వాడడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. మహారాష్ట్రలోని ఓ మున్సిపల్ కౌన్సిల్కు ఉర్దూ భాషలో రాసిన సైన్ బోర్డు ఉండడాన్ని కోర్టు అంగీకరించింది. జస్టిస్ సుధాన్షు దూలియా, మిగతా 2లో..



## బస్తర్లో మళ్లీ పేలిన తూటా

ఇద్దరు మావోయిస్టులు మృతి

చర్ల(జనంసాక్షి):ఛత్తీస్గడ్లోని బస్తర్లో మళ్ళీ తూటా పేలింది. నారాయణపూర్ కొండగావ్ జిల్లాల సరిహద్దులోని కిలామ్ – బర్గం అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే నిఘా వర్గాల సమాచారంతో .. డిఆర్జి, బస్త ర్ ఫైటర్స్ బలగాలు మంగళవారం ఆ ప్రాంతానికి బయలుదేరి వెళ్లాయి. ఈ క్రమంలో మావోయిస్టులు భద్రతా బలగాల మధ్య భారీ ఎదుర్ కాల్పులు చోటుచేసుకున్నాయి. చీకటి పడటంతో భద్రత బలగాలు అడవుల్లోనే ఉండిపోయాయి. ఎదురు కాల్పులు జరిగిన ప్రాంతంలో శోధన ఆపరేషన్ చేయగా ఇద్దరు మోస్ట్ వాంటెడ్ మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఏకే47 తుపాకీ ,ఇతర ఆయుధ సామాగ్రి ని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎదురుకాల్పుల ఘటనను బస్తర్ ఐజీ సుందర్ రాజ్ ధ్రువీకరించారు. మృతి చెందిన ఇద్దరు మావోయిస్టులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. తూర్పు బస్తర్ ప్రాంతంలో భయంకర మావోయిస్టులు ఇద్దరు ఈ ఎదురుకాల్పులో హతమైనట్లు ఆయన వెల్లడించారు. తూర్పు బస్తర్ డివిజన్ కమిటీ సభ్యుడు హల్దర్, ఏరియా కమిటీ సభ్యుడు రమే గా గుర్తించినట్లు వెల్లడించారు. వీరిద్దరిపై రూ.13 లక్షల రివార్డు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 148 మృతిచెందారు

## త్వరలో రాజకీయాల్లోకి వస్తా

నేను గాంధీ కుటుంబంలో భాగం కావడం వల్లే నన్ను లక్ష్యంగా చేసుకున్నారు: రాబర్ట్ వాద్రా

రెండో రోజు ఈడీ విచారణకు హాజరు



న్యూఢిల్లీ(జనంసాక్షి):తాను గాంధీ కుటుంబంలో భాగం కావడం వల్లే తనను లక్ష్యంగా చేసుకున్నారని వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాఆరోపించారు. అలాగే తాను త్వరలో రాజకీయాల్లోకి వస్తానని చెప్పారు. హరియాణా భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయన ఈడీ విచారణను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన స్పందించారు. ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రా వరుసగా రెండోరోజు ఈడీ విచారణకు హాజరయ్యారు. "నిత్యం ప్రజల కోసం మిగతా 2లో..

## కాంగ్రెస్ పాలనతో దేశం అవినీతమయం

వారి హయాంలోనే నేషనల్ హెరాల్డ్ కేసు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వార్త 2లో



## సర్కారు వైఖరి మార్చుకోవాలి

సుప్రీం తీర్పు ప్రభుత్వానికి గుణపాఠం కావాలి

ఇప్పటికైనా పద్దతి మారాలి : కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): కంచె గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు ఆదేశాలను భారత రాష్ట్ర సమితి స్వాగతం తెలిపింది.ఇది ప్రభుత్వానికి గుణపాఠం కావాలని అన్నారు. కంచ గచ్చిబౌలిలో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్కు వన్యప్రాణులను కాపాడాలంటూ ఆదేశాలు ఇవ్వడం గొప్ప విజయమని పేర్కొన్నారు.. వన్యప్రాణుల పట్ల, పర్యావరణ పరిరక్షణకు పాటుపడే ప్రతి ఒక్కరికి మిగతా 2లో..



## కంచగచ్చిబౌలి భూములపై విచారణ 15కు వాయిదా

సుప్రీం మార్గదర్శకాలు విస్మరించి చెట్ల నరికివేతపై ఆగ్రహం

ఆ భూముల్లోనే తాత్కాలిక జైలు నిర్మించి అధికారులను వేస్తాం

నాలుగు వారాల్లో పునరుద్ధరణపై నివేదిక సమర్పించాలని ఆదేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి):కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. చెట్ల నరికివేతపై రేవంత్ సర్కార్పై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్లు కొట్టేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి నిలదీశారు. సీఎస్ను కాపాడాలని అనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలని అన్నారు. దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక సిద్ధం చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను మే 15వ తేదీకి వాయిదా వేశారు. అప్పటి వరకు స్టేటస్ కో కొనసాగుతుందని అన్నారు. కంచ గచ్చిబౌలి భూముల అంశంపై జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం బుధవారం మిగతా 2లో..

## గచ్చిబౌలి భూములు అడవులను తలపిస్తున్నాయి

కేంద్ర సాధికారిక కమిటీ నివేదిక

## సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తాం

ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేయాలని కుట్రలు

నకిలీ వీడియోస్, ఫొటోలు అన్ని వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయి

ఈ విషయంలో భాజపా, భారాస కలిసే కుట్ర పన్నుతున్నాయి

రాష్ట్ర భాజపా నేతలు ఇచ్చిన తప్పుడు సమాచారంతోనే ప్రధాని మోదీ వ్యాఖ్యలు

స్మితా సబర్వాల్ పోస్టుపై చట్టప్రకారం ముందుకెళ్తాం: మంత్రి శ్రీధర్బాబు

హైదరాబాద్(జనంసాక్షి):కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశాలను తప్పకుండా పాటిస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. కంచ గచ్చిబౌలి భూములు మిగతా 2లో..



## చర్చల కోసం చైనానే ముందుకు రావాలి



- మాకు ఆ అవసరం లేదు
- మామీదే ఆ దేశం ఎక్కువ ఆధారపడుతోంది
- బంతి చైనా కోర్టులోనే ఉంది : వైట్హౌస్

హైదరాబాద్(జనంసాక్షి):అమెరికా– చైనా ల మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రమవుతోంది. ఇరుదేశాలు భారీగా పరస్పర సుంకాలు ప్రకటించుకున్న సంగతి తెలిసిందే. అంతేకాక.. తమ దేశంలోని అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను యూఎస్కు ఎగుమతిని కూడా చైనా నిలిపివేసింది. ఈక్రమంలో వైట్ హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలకు రావాల్సింది చైనానే అని, తమకు ఆ అవసరం లేదని ఆమె పేర్కొన్నారు. 'ఇప్పుడు బంతి చైనా కోర్టులోనే ఉంది. చైనానే మాతో వాణిజ్యఒప్పందం చేసుకోవాలి. మాకు ఆ అవసరం లేదు. బీజింగ్కు, ఇతర దేశాలకు మధ్య తేడా లేదు. కాకపోతే ఆ దేశంపై సుంకాలు ఎక్కువగా ఉన్నాయి అంతే' అని లీవిట్ పేర్కొన్నారు. తమ మార్కెట్ పైనే చైనా ఎక్కువగా ఆధారపడుతుందని ఆమె తెలి పారు. ఈసందర్భంగా చైనాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి అధ్యక్షుడు ట్రంప్ సిద్ధంగా ఉన్నారని లీవిట్ వెల్లడించారు. ట్రంప్ ఇటీవల పలు దేశాలపై పరస్పర సుంకాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటన అనంతరం యూఎస్తో వాణిజ్యఒప్పందం కుదుర్చుకునేందుకు కొన్ని దేశాలు సిద్ధమయ్యాయి. దీంతో ప్రతిఘటించని దేశాలకు టారిఫ్ల నుంచి 90 రోజుల మిగతా 2లో..

## అమెరికాతో వాణిజ్య యుద్ధానికి భయపడం:చైనా

వార్త 2లో

## టెహ్రాన్లో టెన్షన్..టెన్షన్..

మెల్లగా ఇరాన్ను చుట్టుముడుతున్న అమెరికా

మరో ఎయిర్క్రాఫ్ట్ క్యారియర్ తరలింపు

బాంబర్లు.. స్టెల్త్ ఫైటర్ల మోహరింపు

టెహ్రాన్(జనంసాక్షి):ఓవైపుఇరాన్తోఅణుచర్చలు మొదలుపెట్టిన అమెరికా.. మరోవైపు మెల్లగా టెహ్రాన్పై ఒత్తిడి పెంచే వ్యూహం అనుసరిస్తోంది. ఈక్రమంలో తన అత్యాధునిక ఆయుధాలను ఆ దేశం చుట్టూ మోహరిస్తోంది. వాస్తవానికి ఈ చర్చలు మొదలు కావడానికి ముందే అమెరికా తన రెండో ఎయిర్క్రాఫ్ట్ క్యారియర్ యూఎస్ఎస్ కార్ల్ విన్సన్ను ఈ ప్రాంతం వైపు నడిపించడం మొదలుపెట్టింది. దీంతోపాటు మిగతా 2లో..




## రేపు భారత్కు జేడీ వాన్స్

సతీమణి ఉషావాన్స్తో కలిసి రాక.. ఈ నెల 24 వరకు పర్యటన



వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్ పర్యటన ఖరారైంది. సతీమణి ఉషా వాన్స్తో కలిసి ఇటలీ, భారత్లను సందర్శించనున్నారు. ఈ నెల 18 నుంచి 24 వరకు ఈ పర్యటన కొనసాగనుంది. అమెరికా ఉపాధ్యక్ష కార్యాలయం ఈమేరకు మిగతా 2లో..

## సిట్ విచారణకు శ్రవణ్రావు



హైదరాబాద్(జనంసాక్షి):ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు శ్రవణ్రావు నాలుగోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్లో ఆయన్ను విచారించారు. గతేడాది మార్చి 29న శ్రవణ్రావు విదేశాల నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. మిగతా 2లో..

## పసిడి మోత

10 గ్రాములకు రూ.98,100కు చేరిక వార్త 9లో

## ఆదిలాబాద్ జిల్లాలో కలకలం

ఇచ్చోడ మండలం ధర్మపురిలోని ప్రభుత్వ పాఠశాలలో విషప్రయోగం

నీటిట్యాంకులో పురుగుల మందు కలిపిన దుండగులు

సిబ్బంది అప్రమత్తతతో 30 మంది విద్యార్థులకు తప్పిన పెను ముప్పు

నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



2లో

## గ్రీన్‌ఎనర్జీ పాలసీతో తెలంగాణలో భారీగా పెట్టబడులు

తెలిపారు. మరి కొద్ది రోజుల్లోనే ఈ రెండు కంపెనీలకు చెందిన కొత్త ప్రాజెక్టులు రాష్ట్రంలో మొదలవుతాయని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ వల్ల రాష్ట్రంలో 27 వేల కోట్ల పెట్టుబడులతో 5600 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయడానికి ఎకోరేన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ముందుకొచ్చి ఈరోజు రాష్ట్ర ప్రభుత్వంతో ఎం ఓ యు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి కోసం రాష్ట్రంలో వస్తున్న పెట్టుబడులతో రాష్ట్ర ప్రజల విద్యుత్ అవసరాలు అధిగమించడానికి త్వరితగతిన ముందుకెళ్లే అవకాశం ఉందన్నారు. 2023 సంవత్సరంలో 15,623 మెగావాట్ల గరిష్ట పిక్ డిమాండ్ రాగా, ఈ సంవత్సరం మార్చి 20న 17,162 మెగావాట్ల గరిష్ఠ పీక్ డిమాండ్ చేరుకున్నప్పటికీ పకడ్బందీ వ్యూహంతో ఎలాంటి ఇంట్రప్షన్ లేకుండా నాణ్యమైన విద్యుత్తును వినియోగదారులకు సరఫరా చేశామని చెప్పారు.హైదరాబాద్ మహానగరం రోజు రోజుకి అభివృద్ధి చెందడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపడుతున్న రీజినల్ రింగ్ రోడ్, మూసి పునర్జీవం, ఫ్యూచర్ సిటీ ఇలా అనేక రకాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో విద్యుత్ అవసరాలు పెరుగుతాయని కొన్ని సంస్థలు అధ్యయనం చేసి కేంద్రానికి పంపిన నివేదికల ఆధారంగా 2029-30 నాటికి 24,215 మెగావాట్ల గరిష్ట డిమాండ్, 2034- 35 నాటికి 31 809 మెగావాట్ల గరిష్ట డిమాండ్ పెరుగుతుందని అంచనా వేసుకొని దీనికి అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తికి, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీకి ప్రణాళికలు తయారు చేసుకొని ప్రభుత్వం ముందుకెళ్తున్నదని వివరించారు.2030 నాటికి 20వేల మెగావాట్లు, 2035 నాటికి మరో 20వేల మెగావాట్లు మొత్తం 40 వేల మెగావాట్లు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేసుకొని యాక్షన్ ప్లాన్ తో ముందుకుపోతున్నదని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన న్యూ ఎనర్జీ పాలసీ పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఉండటంతో చాలామంది రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయడానికి ముందుకు వస్తున్నారని వెల్లడించారు.టీజీ రెడ్కో తో ఎంఓయూ చేసుకున్న ఎకోరేన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని, క్యాలెండర్ ఫిక్స్ చేసుకొని నిర్దిష్ట గడువులోగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకురావాలని, ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి కావలసిన సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు. 15 జిల్లాల్లో కంప్రెస్డ్ బయో-గ్యాస్ ప్రాజెక్టుల అభివృద్ధి కోసంతో 2 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టడానికి ఎంఓయూ చేసుకున్న జిపిఆర్ఎస్ ఆర్య ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ముందుకు రావడం పట్ల అభినందించారు. రాష్ట్రంలో అత్యధికంగా వరి సాగు అవుతున్న నేపథ్యంలో వరి గడ్డితో తయారు చేసే కంప్రెస్డ్ బయోగ్యాస్ వల్ల రైతులకు ఆర్థికంగా ఉపయోగం జరుగాలన్నారు.

## సిట్ విచారణకు శ్రవణ్‌రావు

ఈక్రమంలో పలుమార్లు సిట్ విచారణకు హాజరయ్యారు. నేడు ఆయన ఫోన్లలోని డేటాను అధికారులు రీట్రీవ్ చేస్తున్నారు. ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారు.. దాని వల్ల జరిగిన లబ్ధిపై అధికారులు ఆరా తీస్తున్నారు. శ్రవణ్‌రావు ఇచ్చిన వివరాలను బట్టి భవిష్యత్తులో కొందరు రాజకీయ నేతలను విచారించే అవకాశం ఉంది.గతంలో శ్రవణ్‌కుమార్ సిట్ విచారణకు హాజరైనప్పుడు ఫోన్‌ను సమర్పించాలని దర్యాప్తు అధికారులు ఆదేశించారు. అనంతరం ఆయన ఫోన్ తెచ్చినప్పటికీ అందులో ఏ సమాచారమూ లేకపోవడంతో వారు అసహనం వ్యక్తం చేశారు. ఈక్రమంలో నేడు ఫోన్లలోని డేటాను అధికారులు సేకరిస్తున్నారు.

## చర్చల కోసం చైనానే ముందుకు రావాలి

విరామం కల్పించారు. అయితే, చైనా మాత్రం అందుకు విరుద్ధంగా అమెరికా వస్తువులపై సుంకాల శాతాన్ని పెంచుకుంటూ వచ్చింది. అలా చైనా వస్తువులపై ట్రంప్ 145 శాతం సుంకం విధించగా.. డ్రాగన్ కూడా అగ్రరాజ్యం వస్తువులపై 125 శాతం సుంకాలు విధించింది. దీంతో ఇరుదేశాల మధ్య ట్రేడ్ వార్ మొదలైంది. ఈక్రమంలోనే తమ దేశంలోని అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను యూఎస్‌కు ఎగుమతి చేయడాన్ని ఆపేస్తున్నట్లు డ్రాగన్ ప్రకటించింది. ఇదిలాఉండగా.. అగ్రరాజ్యానికి చైనా తాజాగా మరో షాక్ ఇచ్చింది. అమెరికా వైమానిక రంగ దిగ్గజమైన బోయింగ్ నుంచి ఎటువంటి డెలివరీలు స్వీకరించవద్దని స్వదేశీ విమానయాన సంస్థలను ఆదేశించింది. ఈ విషయాన్ని బ్లూమ్‌బెర్గ్ కథనంలో వెల్లడించింది. వైమానిక రంగంలో వినియోగించే విడిభాగాలను యూఎస్ నుంచి కొనుగోళ్లు చేయవద్దని సూచించిందని పేర్కొంది.

## అమెరికాతో వాణిజ్య యుద్ధానికి భయపడం

బీజింగ్(జనంసాక్షి):ప్రతీకార సుంకాల విధింపుతో అమెరికా, చైనాలు దూకుడుగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో చైనా మరోసారి స్పందించింది. అమెరికా వాణిజ్య యుద్ధానికి భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ట్రంప్ యంత్రాంగంతో సంప్రదింపులకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. చర్చలకు సంబంధించి బంతి చైనా చేతిలోనే ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్న నేపథ్యంలో డ్రాగన్ ఇలా స్పందించింది. "చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని అమెరికా అనుకుంటే.. తమపై చేస్తున్న ఒత్తిడిని వెంటనే ఆపాలి. బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ చేయడం మానేయాలి. గౌరవం, సమానత్వం, పరస్పర ప్రయోజనాల ఆధారంగా చైనాతో చర్చలు జరపాలి" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ పేర్కొన్నారు. "వాణిజ్య యుద్ధాన్ని మొదలుపెట్టింది అమెరికానే. ఈ విషయంలో మా వైఖరి స్పష్టంగా ఉంది. సుంకాల యుద్ధం లేదా వాణిజ్య యుద్ధంలో విజేతలు ఎవరూ ఉండరు. ఈ వాణిజ్య యుద్ధాన్ని మేము కోరుకోవడం లేదు. అదే సమయంలో ఈ పోరాటానికి భయపడే ప్రసక్తే లేదు' అని అన్నారు.

## టెహ్రాన్‌లో టెన్షన్..టెన్షన్..

క్యారియర్ స్ట్రైక్ గ్రూపులోని పటాలం మొత్తం అరేబియా సముద్రం దిశగా ప్రయాణం మొదలుపె ట్టాయి. ఇక అప్పటికే ఈ ప్రాంతంలో ఉన్న ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ యూఎస్ఎస్ హారీ ఎస్ ట్రూమన్ కూడా ఇలాంటి దాడులు హూతీలపై చేపడుతున్న విషయం తెలిసిందే.మరోవైపు అణుచర్చలు విఫలమైతే ఇరాన్ న్యూక్లియర్ స్థావరాలపై కచ్చితత్వంతో దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేరుగా హెచ్చరిస్తున్నారు. దీనికి ఇరాన్ కూడా దీటుగా స్పందిస్తూ.. ప్రస్తుతం ఉన్న యూరేనియం నిల్వలతో తాము తేలిగ్గా అణుబాంబును తయారు చేయగలమని చెబుతోంది. ఇరాన్-అమెరికాల మధ్య తొలివిడత చర్చలు ఒమన్‌లో జరిగాయి. అమెరికా ప్రతినిధిగా స్టీవ్ విట్కాఫ్ పాల్గొన్నారు. ఈ చర్చలు నిర్మాణాత్మకంగా జరిగి ఫలవంతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ కూడా చర్చలు సాఫీగా జరుగుతున్నట్లు ధ్రువీకరించడం విశేషం. ఈ పరిణామాలపై సంప్రదింపులు, సలహాల కోసం ఇరాన్ బృందం ఒకటి ఇప్పటికే రష్యాకు కూడా వెళ్లింది.

## ఈడీని రద్దు చేయాలి: అఖిలేశ్ యాదవ్

**పాట్నా(జనంసాక్షి):**కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏర్పాటు అయ్యిందని, ఇప్పుడు అదే సంస్థ నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటోందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. ఆర్థిక సంబంధిత నేరాలను దర్యాప్తు చేసేందుకు ఇతర ఏజెన్సీలు ఉన్న నేపథ్యంలో ఈడీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒడిశాలో పర్యటనలో ఉన్న అఖిలేశ్.. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌లపై ఈడీ ఛార్జిషీటు దాఖలును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నిరసనలు చేస్తుండడంపై ఇలా స్పందించారు."నేషనల్ హెరాల్డ్ కంటే ఈడీ గురించి మాట్లాడుతా. ఈడీని ఏర్పాటు చేసింది కాంగ్రెస్. కానీ, అదే సంస్థతో ఇప్పుడు ఆ పార్టీ ఇబ్బందులు పడుతోంది. ఆర్థిక నేరాలపై దర్యాప్తు చేసేందుకు ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంట్ వంటి అనేక సంస్థలు ఉన్నాయి. అందుకే ఈడీ అవసరం లేదు. దాన్ని రద్దు చేయాలి" అని అన్నారు

## వక్ఫ్‌సవరణ చట్టంపై నేడు మధ్యంతర ఉత్తర్వులు

న్యాయమూర్తుల ధర్మాసనం ఆదేశించింది. ఈ వివాదంపై దాఖలైన పలు పిటిషన్లపై రేపు మధ్యంతర తీర్పును ఇవ్వనున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్న వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరుపుతూ.. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. వక్ఫ్ బోర్డులో తరహాలో ముస్లింలను హిందూ ట్రస్ట్‌లో భాగం చేయడానికి అనుమతించడానికి సిద్ధంగా ఉన్నారా? అని కేంద్రాన్ని నిలదీసింది. వందల ఏళ్ల నాటి వక్ఫ్ ఆస్తులకు ఇప్పుడు పత్రాలు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించింది.సుదీర్ఘకాలంగా ముస్లిం కార్యక్రమాలకు వాడుతున్న (వక్ఫ్ బై యూజర్) ఆస్తులను డినోటిఫై చేస్తే అనేక సమస్యలు తలెత్తుతాయని పేర్కొంది. వక్ఫ్ బై యూజర్ ఆస్తులను రిజిస్టర్ చేయడం కష్టమని.. ఇది పలుమార్లు దుర్వినియోగమైందని ధర్మాసనం పేర్కొంది. నిజంగా ముస్లిం ధార్మిక కార్యక్రమాలకు ఉపయోగిస్తున్న ఆస్తులు ఉన్నాయని.. హిందువుల ఆస్తులను హిందువులే నిర్వహిస్తున్నారు కదా? అని ప్రశ్నించింది. పార్లమెంటుకు చట్టాలు చేసే అధికారం లేదా? హిందువుల కోసం కూడా పార్లమెంట్ చట్టాలు చేస్తుంది కదా? ఢిల్లీ హైకోర్టు కూడా వక్ఫ్ భూమిలోనే ఉందని అంటున్నారని.. చారిత్రక, పురావస్తు ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించడానికి వీలు లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. వక్ఫ్ చట్టంలోని అభ్యంతరాలను ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చిన ఆయన.. వక్ఫ్ కొత్త చట్టంలోని అనేక నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను ఉల్లంఘిస్తున్నాయని తెలిపారు. కొత్త చట్టం ప్రకారం.. కలెక్టర్‌కు ఇచ్చే అధికారాలను సిబల్ ప్రస్తావించారు. కలెక్టర్ ప్రభుత్వంలో ఒక భాగమని, ఆయన న్యాయమూర్తి పాత్ర పోషిస్తే అది రాజ్యాంగ విరుద్ధమేనన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చే నిబంధనను కోర్టుకు దృష్టికి తీసుకొచ్చారు. ముస్లింల హక్కులను కాలరాసేలా పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టారన్నారు.వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతోన్న ఆందోళనల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడం బాధకరమని, హింసాత్మక ఘటనలు తమను తీవ్రంగా బాధించాయని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ప్రతివాదులకు సుప్రీంకోర్టు నోటీసులు చేస్తూ.. రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. చట్టంపై స్టే విధించాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. జేపీసీ ద్వారా సంపూర్ణంగా అన్నివర్గాలతో చర్చలు జరిపామని చెప్పారు. వక్ఫ్ అనేది కేవలం చారిటీకి సంబంధించిదేనని.. హిందూ ధార్మిక సంస్థలను సైతం ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు.

## సుప్రీం తదుపరి సిజెగా జస్టిజ్ బిఆర్ గవాయ్

తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ పేరును ప్రతిపాదించారు. వచ్చే నెల 13న జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ కాలం ముగియనుండటంతో ఆయన స్థానంలో కొత్త ప్రధాన న్యాయమూర్తిని ప్రకటించారు. జస్టిస్ గవాయ్ మే 14న సీజేఐగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కాగా డీవై చంద్రచూడ్ పదవీ విరమణతో ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నా 2024 నవంబర్‌లో ప్రమాణస్వీకారం చేశారు. గవాయ్ పూర్తిపేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. ఆయన 1960 నవంబర్ 24న అమ్రావతిలో జన్మించారు. 1985 మార్చి 16న బార్‌లో సభ్యుడిగా చేరారు.

## నేటినుంచి భూభారతి అవగాహన సదస్సులు

భూ భారతి పైలట్ ప్రాజెక్టు ప్రారంభించనున్నారు.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మద్దూర్ మండలం ఖాజీపురంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాజెక్టు ప్రారంభించనున్నారు. అలాగే.. వికారాబాద్ జిల్లా పుదూరు గ్రామంలో జరిగే భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొననున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న భూ భారతి చట్టం అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, రెవెన్యూ అధికారులు పాల్గొననున్నారు. ఏప్రిల్ 17 నుంచి జూన్ 2 వరకు భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులు నిర్వహించనుంది ప్రభుత్వం. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఒక ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం ఇది. దీని ప్రయోజనం రాష్ట్రంలో భూ నిర్వహణను సమర్ధవంతంగా నిర్వహించడం , రైతులకు, పర్యావరణానికి అనుకూలంగా భూముల వినియోగాన్ని ప్రోత్సహించడం. ఈ కార్యక్రమం, తెలంగాణలో భూముల రిజిస్ట్రేషన్, భూమి చట్టాలు, ఆస్తి హక్కుల పునరుద్ధరణ వంటి ముఖ్యమైన అంశాలను కవర్ చేస్తుంది. భూ భారతి కార్యక్రమం ద్వారా, ప్రభుత్వమే భూముల ఖాతాలు, రికార్డులను సరికొత్తగా సృష్టించి వాటి మాలికల హక్కులను సులభంగా ప్రజలకు అందించేందుకు సహాయపడుతుంది. అంతేకాకుండా, ఇది రైతులకు భూములపై అనువైన పర్యవేక్షణను, కరెంట్ పొదుపు, పర్యావరణ పరిరక్షణ అంశాలు వంటి వాటిపై అవగాహన కూడా పెంచుతుంది.

## రేపు భారత్‌కు జేడీ వాన్స్

**- సతీమణి ఉషావాన్స్‌తో కలిసి రాక**

**- ఈ నెల 24 వరకు కొనసాగనున్న పర్యటన**

ఓ ప్రకటన విడుదల చేసింది. ఉపాధ్యక్ష పదవి చేపట్టిన అనంతరం జేడీ వాన్స్ భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. ఆయన సతీమణి ఉష తెలుగమ్మాయి అనే విషయం తెలిసిందే.ఇటలీ, భారత్ పర్యటనల్లో భాగంగా ఆయా దేశాల నేతలతో వాణిజ్య, భౌగోళిక రాజకీయ అంశాలపై జేడీ వాన్స్ చర్చలు జరుపుతారని అమెరికా ఉపాధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. భారత పర్యటనలో భాగంగా వాన్స్ కుటుంబం ఢిల్లీ, జైపుర్, ఆగ్రాలను సందర్శించనుంది. ఆయా చారిత్రక ప్రదేశాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొననుంది. అదేవిధంగా ప్రధాని నరేంద్ర మోదీతో జేడీ వాన్స్ భేటీ కానున్నారు. భారత్- అమెరికా వాణిజ్య చర్చల వేళ ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.ఉషా చిలుకూరి అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1970ల్లోనే అమెరికాకు వలస వెళ్లారు. వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. యేల్ లా స్కూల్‌లో ఉషా, జేడీ వాన్స్ తొలిసారి కలుసుకున్నారు. ఈ క్రమంలోనే ఒకరినొకరు ఇష్టపడి.. 2014లో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం. భర్త విజయంలో ఉష కీలక పాత్ర పోషించారు. అమెరికా సెకండ్ లేడీ హోదాలో తన పూర్వీకుల దేశానికి రావడం ఆమెకు ఇదే తొలిసారి.

## భాష అనేది మతానికి సంబంధించినది కాదు

కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు కీలక తీర్పు ఇచ్చింది. ఉర్దూ, మరాఠీ భాషకు రాజ్యాంగం ప్రకారం ఒకే రకమైన హోదా ఉన్నట్లు కోర్టు పేర్కొన్నది. కేవలం మరాఠీ మాత్రమే వాడాలన్న వాదనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. వర్షతై సంజయ్ బగడే అనే వ్యక్తి దాఖలు చేసిన పిటీ-షన్‌ను కోర్టు కొట్టివేసింది. పాటూరు పట్టణంలో ఆయన మాజీ కౌన్సిలర్. పాటూరు మున్సిపల్ కౌన్సిల్ నేమ్‌బోర్డును ఉర్దూలో రాయడాన్ని ఆయన కోర్టులో సవాల్ చేశారు. ఉర్దూ భాష పుట్టింది ఇండియాలోనే అని, కానీ ఆ భాష ముస్లింలకు సొంతమైందని కోర్టు పేర్కొన్నది. హిందువులకు హిందీ భాషను, ముస్లింలకు ఉర్దూ భాషను బ్రిటీ-ష్ పాలకులు అంటగట్టారని కోర్టు తెలిపింది. అయితే ఉర్దూ భాష గురించి చర్చించే సందర్భం ఇది కాదు అని, కానీ హిందీ, ఉర్దూ భాషలు మిక్స్ అయ్యాయని, హిందీ భాష ఎక్కువ శాతం సంస్కృత భాషగా.. ఉర్దూ భాష పర్షియన్ భాషగా గుర్తింపు తెచ్చుకున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. కానీ బ్రిటీష్ పాలకులు మతం ఆధారంగా రెండు భాషలను విభజించినట్లు అత్యున్నత న్యాయస్థానం పేర్కొన్నది. ఇప్పుడు హిందీ భాషను హిందువుల భాషగా, ఉర్దూ భాషను ముస్లింల భాషగా అర్థం చేసుకుంటున్నారని కోర్టు తెలిపింది. చాలా దయనీయమైన పరిస్థితి ఎదురైందని, వాస్తవానికి ఐకమత్యం నుంచి విభజన ఏర్పడిందని కోర్టు పేర్కొన్నది. ఉర్దూ భాషకు ఇండియాలో ఆనవాళ్లు ఉన్నాయని, ఒక మతానికి ఆ భాషను ఆపాదించలేమని కోర్టు తెలిపింది.

## ఆదిలాబాద్ జిల్లాలో కలకలం

**ఆదిలాబాద్(జనంసాక్షి):**ఆదిలాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. ఇచ్చోడ మండలం ధర్మపురిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విష ప్రయోగం జరిగింది. విద్యార్థులు తాగే నీటి ట్యాంక్‌లో దుండగులు పురుగుల మందు కలిపారు. మధ్యాహ్న భోజన సామగ్రిపై కూడా పురుగుల మందులు చల్లారు. బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాలకు వరుసగా మూడు రోజులు సెలవులు ఉండటంతో పాఠశాలలోని వంట గదికి సిబ్బంది తాళాలు వేసుకుని వెళ్లారు. సెలవుల అనంతరం పాఠశాలకు వచ్చిన సిబ్బంది వంట చేసేందుకు పాత్రలు కడిగే సమయంలో దుర్వాసన, నురగలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పాఠశాల హెడ్ మాస్టర్, సిబ్బంది చుట్టుపక్కల చూడగా పురుగుల మందు డబ్బా కనిపించింది. అలాగే తాగు నీటి ట్యాంక్‌లోనూ పురుగుల మందు కలిపినట్లు-గా సిబ్బంది గుర్తించారు. దీంతో అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది.. విద్యార్థులను తాగునీటి కుళాయిల వైపు వెళ్లకుండా చూశారు. వీరంతా విష ప్రయోగం నుంచి బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా, ఈ ఘటనపై పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు మండిపడుతున్నారు. అసలు స్కూల్ పిల్లలపై విష ప్రయోగం చేయాల్సిన అవసరం ఎవరికి ఉందని.. చిన్న పిల్లలు ఏం పాపం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చోడలోని ప్రభుత్వ పాఠశాల వంట గదిలోని నీటిలో పురుగుల మందు కలిపిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబ కలహాల కారణంగానే నిందితుడు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మీడియాకు వెల్లడించారు.

## త్వరలో రాజకీయాల్లోకి వస్తా

పోరాడే గాంధీ కుటుంబంలో నేను భాగం. దాంతో సహజంగానే నన్ను, మా కుటుంబాన్ని భాజపా లక్ష్యంగా చేసుకుంటుంది. సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై వారు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. మీరు (భాజపా) ఎంతగా ఇబ్బంది పెడితే.. మేం అంతగా బలపడతాం. మాకు ఎదురయ్యే ప్రతిసవాలును దాటుకొని ముందుకు వెళతాం. కానీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం దురదృష్టకరం. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపే వారిపై ఒత్తిడి తెచ్చేందుకు వాటిని దుర్వినియోగం చేస్తుండటంతో ఇక ప్రజలు ఆ సంస్థలను విశ్వసించరని నా అభిప్రాయం. అదే నేను భాజపాలో ఉండి ఉంటే.. పరిస్థితి వేరుగా ఉండేది. ప్రజలు నాతో ఉన్నారు. వారు నేను రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటున్నారు" అని వాద్రా మీడియాతో మాట్లాడారు.ఇక ఈ కేసులో హరియాణా ప్రభుత్వం తనకు క్లీన్‌చిట్ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఈడీ విచారణలో భాగంగా అడుగుతోన్న ప్రశ్నలకు 2019లోనే సమాధానం ఇచ్చానని, మళ్లీ ఇప్పుడు అవే ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారో అని వ్యాఖ్యలు చేశారు. ఈడీ ప్రకారం.. వాద్రా కంపెనీ 2008 ఫిబ్రవరిలో గుర్గావ్‌లోని షికోపూర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుగోలు చేసింది. దీని విలువ రూ.7.5 కోట్లు. ఆ తర్వాత వాద్రా కంపెనీ ఆ భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డీఎల్‌ఎఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది. డీఎల్ఎఫ్‌కు భారీ లాభంతో విక్రయించడంతో మనీలాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈడీ విచారణ జరుపుతోంది.

## కాంగ్రెస్ పాలనతో దేశం అవినీతిమయం

**న్యూఢిల్లీ,ఏప్రిల్16(జనంసాక్షి):**నెహ్రూ కుటుంబం దేశాన్ని లూటీ చేసిందని.. అంతేకానీ.. దేశానికి ఆ కుటుంబం ఏం చేయలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఆ క్రమంలో దేశాన్ని అవినీతిమయంగా మార్చిన విషయం మనం చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే నేషనల్ హెరాల్డ్ కేసు వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీతోపాటు- ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై మంత్రి జి.కిషన్ రెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలో బొగ్గు, హెలికాప్టర్, బోఫోర్స్ కుంభకోణాలు లాంటివి ఎన్నో జరిగాయన్నారు. ఆ క్రమంలో జరిగిన మరో పెద్ద కుంభకోణమే నేషనల్ హెరాల్డ్ అని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్య్ర సమరయోధులు నేషనల్ హెరాల్డ్ స్థాపిస్తే.. దానిని దొడ్డి దారిన సోనియా, రాహుల్ గాంధీలకు చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీకి తరలించారని విమర్శించారు. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ధర్నా చేయడం సిగ్గుమాలిన చర్య అని ఈ సందర్భంగా ఆయన అభివర్ణించారు. 2012లో నేషనల్ హెరాల్డ్ ఆస్తులపై దర్యాప్తు జరపాలంటూ సుబ్రమణ్య స్వామి పిటిషన్ వేశారన్నారు. అందులోభాగంగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఆయన కేసు వేశారని తెలిపారు . అయినా.. కాంగ్రెస్ పార్టీ ఎందుకు ధర్నాలు చేస్తుందని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వీరికి భయపడి కేసులు వెనక్కి తీసుకోవాలా? అని పార్టీని సూటిగా ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై దేశంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీం సైతం దర్యాప్తు జరపాలని చెప్పిందని గుర్తు చేశారు.

## కంచగచ్చిబౌలి భూములపై విచారణ 15కు వాయిదా



విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చెట్లు కొట్టివేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వ తరఫున లాయర్ స్పందిస్తూ జామాయిల్ తరహా చెట్లు-, పొదలను అనుమతి తీసుకునే తొలగించామని తెలిపారు. అందుకు చెట్ల నరికివేతపై సమర్థించుకోవద్దని జస్టిస్ బీఆర్ గవాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారో లేదో చెప్పాలన్నారు. వారంతపు సెలవుల్లో మూడు రోజుల్లో చెట్లు కొట్టాల్సిన తొందర ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. మీరు చెట్లు కొట్టడం వల్ల అక్కడ జంతువుల మీద కుక్కలు దాడి చేస్తున్నాయని.. ఆ వీడియోలను చూసి ఆందోళనకు గురయ్యామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అవసరమైతే 400 ఎకరాల్లో ఒక్క చెట్టు కూడా కొట్టకుండా ఆదేశాలివ్వాల్సి వస్తుందని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఊరుకోమని జస్టిస్ గవాయి హెచ్చరించారు. భూముల మార్టిగేజ్‌తో తమకు సంబంధం లేదని.. చెట్ల నరికివేత గురించే తాము మాట్లాడుతున్నామని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో అడవులు లేవని వాదిస్తే.. అదే ప్రాంతంలో జైలు కట్టి అందులోనే అధికారులను పెట్టాల్సి ఉంటుందని జస్టిస్ బీఆర్ గవాయి హెచ్చరించారు. చెట్లు కొట్టేసే ముందు అనుమతి ఉందా లేదా అన్నదే ముఖ్యమని తెలిపారు. అనుమతులు లేకుండా చెట్లు- కొట్టేసినందుకు సీఎస్ సహా అధికారులు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. సీఎస్‌ను కాపాడాలనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలన్నారు. పునరు ద్ధరణ ఎలా చేస్తారు? ఎంతకాలంలో చేస్తారు? జంతు జాలాన్ని ఎలా సంరక్షిస్తారో స్పష్టంగా చెప్పాలని ఆదేశించారు. దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక ఫైల్ చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందని, దాని ప్రకారం స్వయం అనుమతులుగా ప్రభుత్వం వ్యవహరించిందని అమికస్ క్యూరీ సుప్రీంకు వివరించారు. పర్యావరణాన్ని కాపాడటానికి మేము ఇక్కడ ఉన్నాం. అధికారుల అనుమతి లేకుండా ఎన్ని చెట్లను నరికివేశారో అనే ఆందోళన మాత్రమే ఉంది. చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలి. మేము బుల్డోజర్ ఉనికి, 100 ఎకరాల అడవిని తొలగించడం గురించి మాత్రమే ఆందోళన చెందుతున్నాం. మీరు నిర్మించాలనుకుంటే, మీరు అనుమతులు తీసుకొని ఉండాలి అని జస్టిస్ అన్నారు. 2004 నుంచి ఈ భూముల వ్యవహారం, కోర్టుల్లో ఉన్న పరిస్థితి, తర్వాత చుట్టుపక్కల జరిగిన అభివృద్ధి, ఐటి పార్కు, ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన వివారలను కోర్టుకు చెప్పారు. అయితే వంద ఎకరాల్లో జరిగిన నష్టాన్ని ఎలా పూడ్చాలన్న విషయం పైనే మేము దృష్టి సారించాలని అంటున్నామని జస్టిస్ గవాయ్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఏమైనా చేస్తాం.ఆ భూముల్లో ఉన్న జంతుజాలాన్ని ఎలా సంరక్షిస్తారో చెప్పాలన్నారు. ఆర్టికల్ 142 కింద పర్యావరణ పరిరక్షణ కోసం ఏమైనా చేస్తాం. పునరుద్ధరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తే, మీ అధికారులను తాత్కాలికంగా జైలుకు పంపిస్తాం అని కఠినంగానే అన్నారు. 100 ఎకరాల్లో జరిగిన నష్టం కారణంగా ప్రభావితమైన వన్యప్రాణులను రక్షించేందుకు అవసరమైన తక్షణ చర్యలను పరిశీలించి, అమలులోకి తీసుకురావాలని తెలంగాణ వన్యప్రాణి సంరక్షణాధికారిని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. పునరుద్ధరణ ఎలా చేస్తారు, ఎంత కాలంలో చేస్తారు, జంతు జలాన్ని ఎలా సంరక్షిస్తారో స్పష్టంగా చెప్పాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశించింది. నాలుగు వారాల్లో ప్రణాళిక ఫైల్ చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది ధర్మాసనం. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశాల్లో పేర్కొంది. తదుపరి విచారణను మే 15కు సుప్రీం కోర్టు వాయిదా వేసింది.

## సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తాం

ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టే చెప్పిందన్నారు. బుధవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు."నకిలీ వీడియోస్, ఫొటోలు అన్ని వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయి. భూముల విషయం కోర్టుల పరిధిలో ఉన్నందున ఏమీ మాట్లాడలేం. ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన పోస్టుపై చట్టప్రకారం ముందుకు వెళ్తాం. నెమళ్లు జనావాసాల్లోకి రావడం సర్వసాధారణం. భాజపా, భారాస కలిసే కుట్ర పన్నుతున్నట్లు భావిస్తున్నాం. రాష్ట్ర భాజపా నేతలు ఇచ్చిన తప్పుడు సమాచారంతోనే ఈ భూములపై ప్రధాని మోదీ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తున్నారు. కూలగొడితే కూలిపోయే ప్రభుత్వం కాదు మాది" అని శ్రీధర్‌బాబు అన్నారు.

## సర్కారు వైఖరి మార్చుకోవాలి

దక్కిన విజయం అంటూ పేర్కొన్నారు. గొంతులేని మూగజీవాల కోసం, చెట్ల కోసం, పర్యావరణం కోసం అండగా నిలబడిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికారిక కమిటీ ఇచ్చిన సిఫార్సులను కూడా భారత రాష్ట్ర సమితి స్వాగతిస్తున్నదని పేర్కొన్నారు. కంచ గచ్చిబౌలిని ప్రైవేట్ పార్టీకి తాకట్టు పెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వ వ్యవహారంలో ఆర్థిక అవకతవకలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసిన కేంద్ర సాధికారిక కమిటీ- మా పార్టీ వాదనను బలపరుస్తున్నదని తెలిపారు. కంచ గచ్చిబౌలి భూముల తాకట్టు- విషయంలో పదివేల కోట్ల రూపాయల అవినీతికి రేవంత్ రెడ్డి పాల్పడ్డారని చేసిన ఆరోపణలను పునరుద్ఘాటించారు. అడవుల పట్ల, వన్యప్రాణుల పట్ల రేవంత్ రెడ్డి నెంబర్ వన్ విలన్‌గా మారాడని విమర్శించారు. పర్యావరణ విధ్వంసానికి... పర్యావరణ హత్యకు పాల్పడి తప్పించుకోలేరనే కనీస సోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇకనైనా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు సీఎం రేవంత్ రెడ్డి తనను తాను మోసం చేసుకున్న విషయాన్ని అర్థం చేసుకుని పర్యావరణ విధ్వంసం ఆపాలని కోరారు.కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్వాగతించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన, చేయబోతున్న పర్యావరణ విధ్వంసం ఎంత భయంకరమైందో సుప్రీం కోర్టులో జరిగిన వాదనల వల్ల ప్రపంచానికి తేటతెల్లమైంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. బాధ్యత గల ప్రభుత్వం, కావాలనే సెలవు దినాల్లో బుల్‌డోజర్లతో విధ్వంసానికి పాల్పడటంపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ ప్రభుత్వానికి చెంపపెట్టు-. విధ్వంసం చేసిన వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని నిలదీయడం ఆహ్వానించదగ్గ పరిణామం. కంచె గచ్చిబౌలి భూములను, పర్యావరణాన్ని కబళించాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సెంట్రల్ ఎం పవర్డ్ కమిటీ- తన రిపోర్టుతో కళ్లు తెరిపించింది అని హరీశ్‌రావు తెలిపారు. అధికారం ఉంది కదా అని ఇష్టా రీతిగా వ్యవహరిస్తే సభ్య సమాజం, న్యాయ వ్యవస్థ చూ స్తూ ఊరుకోవని.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కా పాడటానికి ముందుకు వస్తాయని గతంలోనూ అనేక సార్లు నిరూపనైంది. ఈరోజు కూడా అదే జరిగిందన్నారు

## గచ్చిబౌలి భూములు అడవులను తలపిస్తున్నాయి

**కేంద్ర సాధికారిక కమిటీ నివేదిక**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తెలంగాణలో గచ్చిబౌలి భూముల విషయంలో పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా కేంద్ర సాధికారిక కమిటీ ఒక కీలక నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో పలు సూచనలు, సిఫార్సులతో పాటు పర్యావరణం, అడవుల పరిరక్షణపై గాఢమైన దృష్టిని వెల్లడించింది. గచ్చిబౌలి భూముల్లో అటవీ లక్షణాలు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ చేసిన సీఈసీ, తుది నివేదిక కోసం అటవీ సర్వే అనంతరం నాలుగు వారాల గడువు కోరింది. సీఈసీ నివేదిక ప్రకారం, హైకోర్టు ఆదేశాలు ఇచ్చేవరకు గచ్చిబౌలి భూములపై ఎలాంటి కొత్త నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టరాదు. ఇది పర్యావరణానికి గల ప్రమాదాన్ని తక్షణమే నివారించేందుకు తీసుకున్న ప్రాథమిక చర్యగా పేర్కొనవచ్చు. అటవీ లక్షణాలు ఉన్న ప్రాంతాలను గుర్తించడంలో అటవీ శాఖ, పర్యావరణ నిపుణులు, ఐటీ-, రిమోట్ సెన్సింగ్ నిపుణులతో కూడిన కమిటీని పునఃఆయోజించాలంటూ సిఫార్సు చేసింది. అలాగే, గ్రామీణ,పట్టణ భూగతుల మధ్య స్పష్టత తీసుకురావాల్సిన అవసరాన్ని సూచించింది. తెలంగాణ స్టేట్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ పర్యావరణ అంచనా నివేదికను ఉద్దేశపూర్వకంగా నివారించిందని సీఈసీ ఆరోపించింది. ఇది గచ్చిబౌలి భూముల అభివృద్ధిపై సరైన సమాచారం లేకుండా నిర్ణయాలు తీసుకున్నట్లు- భావించవచ్చు. దీనిపై దావాలకు సంబంధించి పూర్తి స్థాయి ఆడిట్ అవసరం అని కమిటీ స్పష్టం చేసింది.

# సోషల్ మీడియాలో అసత్య ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

- డిజిపి, హైడ్రా కమిషనర్, సైబర్ క్రైం డీసీపీలకు తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఎంఏ ఫహీమ్ ఫిర్యాదు



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బుధవారం తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఎంఏ ఫహీమ్ తెలంగాణ డీజిపి జితేందర్,సైబర్ క్రైం డీసీపీ కవిత, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం మధ్యాహ్నం నుండి సోషల్ మీడియాలో తనను టార్గెట్ చేస్తూ కొందరు అడ్రస్ లేని ఫేక్ లెటర్ హెడ్ పై అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోని అరెస్టు చేయాలని ఫహీమ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అమీన్ పూర్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో నకిలీ లెటర్ హెడ్, నకిలీ స్టాంపు క్రియేట్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారని డీజీపీకి వివరించారు. గత కొద్దిరోజులుగా పనిగట్టుకొని బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన (తెలుగు స్క్రైబ్) (హాక్ మీడియా) సోషల్ మీడియా అకౌంట్స్ లలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న వాళ్లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అసత్య ప్రచారం చేస్తున్న వాళ్లపై చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని ఎం.ఏ. ఫహీమ్ డీజీపీని కోరారు. ఫిర్యాదు తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు ఫహీమ్ తెలిపారు. ఈ మేరకు ఎం.ఏ.ఫహీమ్ మాట్లాడుతూ ఈ అసత్య ప్రచారం వెనుక బీఆర్ఎస్ పార్టీ హస్తం ఉందన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే నాపై దుష్ప్రచారం జరిగిందని, నేను ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ పార్టీకి చెడ్డ పేరు తెచ్చేపని ఎప్పటికి చేయలేదని, చేయబోనని తెలిపారు. నేను బెదిరించినట్లు కానీ, హైడ్రా పేరు ఉపయోగించినట్లు కానీ ఒక్క ఆధారం కూడా లేదన్నారు. దీని వెనక ఎవరున్నా పూర్తిస్థాయి దర్యాప్తు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం ఎవరు చేశారో ఇప్పుడిప్పుడే కొంత సమాచారం వస్తుందని, అవసరం వచ్చినప్పుడు వాళ్ళ పేర్లన్నీ బయట పెడతానని ఎం.ఏ. ఫహీమ్ మండిపడ్డారు.

# ఉమ్మడి కరీంనగర్‌లోని ఆధ్యాత్మిక ప్రాంతాలకు ప్రత్యేక సాయం అందించండి

- సిరిసిల్ల లేదా సిద్దిపేట జిల్లాలో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయండి
- కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, గజేంద్రసింగ్ షెకావత్‌లకు బండి సంజయ్ వినతి
- సానుకూలంగా స్పందించిన మంత్రులు
- తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం





**కరీంనగర్, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** ఎములాడ, కొండగట్టు, ఇల్లందకుంట ప్రాంతాలను ఆధ్యాత్మిక విశ్రాంతి కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక సాయం అందించాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ను కోరారు. రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి కోసం ప్రత్యేక సహాయ పథకం కింద నిధులను మంజూరు చేయాలని విజప్తి చేశారు. అట్లాగే సిరిసిల్ల లేదా సిద్దిపేట జిల్లాలో సైనిక్ స్కూల్ ను ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. బుధవారం సాయంత్రం బండి సంజయ్ కుమార్ న్యూఢిల్లీలో రాజ్ నాథ్ సింగ్, గజేంద్రసింగ్ షెకావత్ లను వేర్వేరుగా కలిసి ఈ మేరకు వినతి పత్రాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో పర్యాటకాన్ని అత్యవసరంగటా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి కోసం ప్రత్యేక సహాయ పథకం కింద ఆయా ప్రాంతాలకు నిధులను మంజూరు చేయాలని విజప్తి చేశారు. బండి సంజయ్ విజప్తిపట్ల గజేంద్రసింగ్ షెకావత్ సానుకూలంగా స్పందించారు. ఈ విషయంపై పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాజ్ నాథ్ సింగ్ ను కలిసిన సందర్భంగా సైనిక్ స్కూల్ ఏర్పాటుపై వినతి పత్రం అందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల పట్టణం లేదా సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ పట్టణంలో సైనిక్ పాఠశాల లేని విషయాన్ని గుర్తు చేశారు. స్థానిక యువత భారత సాయుధ దళాల్లో చేరాలన్న ఆసక్తి గణనీయంగా పెరిగినప్పటికీ, ఈ జిల్లాల్లో సైనిక విద్యకు అవసరమైన అవకాశాలు లేవని చెప్పారు. "సైనిక్ పాఠశాలలు శిష్టాచారంతో, ప్రేరణతో, సేవాభావంతో కూడిన యువతను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ సైనిక్ స్కూల్లో చేరిన విద్యార్థులు భవిష్యత్తులో భారత సాయుధ దళాల్లో చేరి గౌరవంగా దేశానికి సేవ చేస్తారు. సిరిసిల్ల లేదా హుస్నాబాద్‌లో ఇలాంటి పాఠశాల ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య, నాయకత్వ శిక్షణ అందే అవకాశం కలుగుతుంది. దీంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో దేశ జాతీయ ఏకతా, దేశభక్తి భావనను పెంపొందించే అవకాశాలున్నాయి"అని పేర్కొన్నారు. కేంద్రం సైనిక స్కూల్ ను మంజూరు చేస్తే భూమి, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బండి సంజయ్ వినతిపట్ల సానుకూలంగా స్పందించిన రాజ్ నాథ్ సింగ్ సిరిసిల్ల లేదా హుస్నాబాద్ పట్టణంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అవకాశాలపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# 29న పెన్షనర్ల ధర్నా



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణా ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ ఈ నెల 29న హైదరాబాద్ లోని ఇందిరా పార్కు వద్ద రాష్ట్ర స్థాయి ధర్నాకు పిలుపునిచ్చింది. ఆ మేరకు ఈరోజు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి అందుబాటులో లేనందున ఓయస్ డీకి నోటీసు అందించినట్లు రాష్ట్ర ప్ర.కా. కృష్ణమూర్తి, కోశాధికారి నాగేశ్వర్ రావు, ఉపాధ్యక్షులు నరహరి, కార్యదర్శి కృష్ణారావు ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి గత అక్టోబర్ మాసంలో మూడు దశల పోరాటానికి సిద్ధమయ్యామన్నారు. అందులో భాగంగా నవంబర్ 5,6 తేదీల్లో పెన్షన్ పేమెంట్ కార్యాలయాల ముందు, నవంబర్ 19 న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వానికి మెమొరాండంలు సమర్పించామన్నారు. అందువలన మరియు జేయేసీల ప్రాతినిధ్యం మేరకు ప్రభుత్వం ఒక డిఏ మంజూరు చేసిందన్నారు. ఆరోజు కనీసం రెండు డిఏలను పెన్షనర్లు ఆశించారు. కాని ఒక డిఏ మాత్రమే ఇచ్చి రెండవది మార్చి చివరి వరకు ఇచ్చే సూచన ప్రభుత్వం నుండి లభించినందున మరియు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని కూడా దృష్టిలో ఉంచుకుని మూడవదశ పోరాటాన్ని వాయిదా వేశామన్నారు. కాని ఏప్రిల్ మాసం గడిచిపోతున్నా ఇవ్వాల్సిన 5 డిఏలు, వేతన సవరణ కమిషన్ రిపోర్టు తెప్పించుకుని అమలు చేసే ప్రయత్నం ప్రభుత్వం చేయడం లేదన్నారు. ప్రధానంగా హెల్త్ కార్డులు పని చేయక పోవడం వలన వృద్ధాప్యంలో పెన్షనర్లు అనేక ఇబ్బంధులకు గురి అవుతున్నారన్నారు. అప్పు చేసి ఖర్చు పెట్టుకుని రీఎంబర్స్ మెంటుకు పెట్టుకుంటే సంవత్సరాల తరబడి బిల్లులు రావడం లేదన్నారు. ముఖ్యంగా గత మార్చి 2024 తరువాత ఉద్యోగ విరమణ చేసిన వారికి రావలసిన పెన్షన్ ఫండ్స్ ఏవీ రాక నానా ఇబ్బంధులు పడుతున్నారన్నారు. కనీసం తెలంగాణ రాష్ట్ర మొదటి వేతన సవరణ కమిషన్ సూచనలనైనా అమలు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో ముఖ్యంగా 20 సంవత్సరాల సర్వీసుకు పూర్తి పెన్షన్ మంజూరు చేసే ఉత్తర్వులను వెంటనే ఇవ్వాలనీ, రు. 398 వేతనంతో పనిచేసిన సర్వీసుకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇచ్చి పెన్షన్ కు వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి, ప్రజల దృష్టికి తేవడానికి ఈనెల అంటే 29.04.2025న హైదరాబాద్ లోని ఇందిరా పార్కు వద్ద జరపతలపెట్టిన ధర్నాలో ఎక్కువ మంది పెన్షనర్లు పాల్గొని జయప్రదం చేయాలనీ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం గుర్తించేలా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఏపి కృష్ణాజలాల దోపిడీ

- చేష్టలుడిగిన రాష్ట్ర ప్రభుత్వం
- మండిపడ్డ మాజీమంత్రి జగదీశ్ రెడ్డి

**సూర్యాపేట, ఏప్రిల్16 (జనంసాక్షి) :** తెలంగాణ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కృష్ణా నదీ జలాల వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్యం, చేతకానితనాన్ని తీవ్రంగా విమర్శించారు. గత రెండు నెలలుగా తమ పార్టీ చెబుతోన్న వాదనల్ని ఇప్పుడు కృష్ణా బోర్డు కూడా సమర్థించిందని తెలిపారు. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటి వరకు అక్రమంగా 65 టీ-ఎంసీల నీటిని తీసుకెళ్లిందని ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం నీళ్లను అక్రమంగా తరలిస్తుందన్న విషయం మేము ఎప్పటి నుంచో చెబుతున్నాం. కానీ, ఇప్పుడే కృష్ణా బోర్డు చెప్పడంతో మా మాటకు న్యాయం జరిగినట్లయ్యిందని అన్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ఏదో చంద్రబాబుతో లోపాయికీ ఒప్పందం చేసుకున్నట్లుగా అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి పైరవీలు నమోదు చేయకుండా మౌనంగా ఉండటం వెనుక కారణం ఇదే కావచ్చని మండిపడ్డారు. ఈ పరిస్థితుల వల్ల రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదముందని హెచ్చరించారు. తాగునీటికి కూడా ఇబ్బందులు వస్తాయని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఈ అంశంపై ఒక్క రివ్యూకూడా చేయకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ప్రజలు మళ్లీ పాత రోజులకు, దరిద్రాలకు వస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని.. ఆయన ప్రజలను ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఈ అంశంపై త్వరలోనే మాజీ సీఎం కేసీఆర్ కార్యచరణ ప్రకటిస్తారని, రాష్ట్ర ప్రభుత్వం జలవనరుల పరిరక్షణలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.

# ఉచిత బస్సు ఇచ్చామని తులం బంగారాన్ని తుస్సుమనిపించారు

- కాంగ్రెస్ వాళ్లకు బెదిరింపులు, మోసం చేయడం కొత్త కాదు
- పార్టీ మారిన ఎమ్మెల్యే సంజయ్ ని గ్రామ గ్రామాన నిలదీయాలి
- జగిత్యాలలో రజతోత్సవ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** కాంగ్రెస్ వాళ్లకు బెదిరింపులు, మోసం చేయడం కొత్త కాదని, ఉచిత బస్సు ఇచ్చామని చెబుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారాన్ని తుస్సు చేసిందని ఎమ్మెల్సీ కవిత ధ్వజమెత్తారు. తెలంగాణ ఇస్తాని చెప్పి 2004లో మోసం చేసిన కాంగ్రెస్... ఇప్పుడు మళ్లీ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. బుధవారం నాడు జగిత్యాలలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆహ్వానిస్తూ జగిత్యాల తెలంగాణ చౌరస్తా లో ఎమ్మెల్సీ కవిత వాల్ రైటింగ్ రాశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... ఉచిత బస్సు ఇచ్చామని చెబుతున్న కాంగ్రెస్ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నదని, ఉచిత బస్సు సౌకర్యాన్ని ఇచ్చి బస్సుల సంఖ్య పెంచకపోవడం వల్ల సీట్లు దొరకని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు ఇచ్చాం కానీ తులం బంగారం మాత్రం ఇవ్వమని రేవంత్ రెడ్డి అంటున్నారని, కళ్యాణ లక్ష్మీ పథకం కింద తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేశారని ఎండగట్టారు. రుణ మాఫీ, రైతు భరోసా 50 శాతం మందికి ఇంకా రానేలేదని, గ్రామ గ్రామాన కాంగ్రెస్ మోసాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ మోసపూరిత విధానాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పసుపు బోర్డును తూతూమంత్రంగా ఏర్పాటు చేశారు కానీ చట్టబద్ధత కల్పించలేదని, దాంతో పసుపు బోర్డుకు బడ్జెట్ లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. పసుపు ధరలు పడిపోతే బోర్డు నుంచి డబ్బులు ఇస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పారని, మరి పసుపు ధరలు పడిపోతే బోర్డు నుంచి రైతులకు డబ్బులు ఇచ్చారా ? అని ప్రశ్నించారు. రెండు కోట్ల ఉద్యోగాలు, బోర్డుకు చట్టబద్ధత, మనిషికి 15 లక్షలు ఏమయ్యాయని అడిగితే ఎంపీ అర్వింద్ పిచ్చి మాటలు మాట్లాడుతారని, అంతకు మించి ప్రజలకు పనికి వచ్చే మాటలు మాట్లాడిన దాఖలాలు లేవని ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నారు.. అయినా కేంద్రం బడ్జెట్ లో తెలంగాణ 8 రూపాయలు కూడా ఇవ్వలేదని, 8+8 = పెద్ద గుండు సున్నా ఇచ్చారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే సంజయ్ ని గ్రామ గ్రామాన నిలదీయాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. "జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, ఎంపీ అర్వింద్ కలిసిమెలసి ఢిల్లీతో తిరుగుతున్న వార్తను టీవీల్లో చూశాను. సంజయ్ బీజేపీలో చేరారా లేదా కాంగ్రెస్ లో చేరారా అన్న అనుమానం వచ్చింది. సంజయ్ ఒక సారి సీఎం రేవంత్ రెడ్డితో... మరొక సారి బీజేపీ వాళ్లతో కనిపిస్తారు. ఎమ్మెల్యే సంజయ్ ఏ పార్టీలో ఉన్నారో తెలియక ప్రజల్లో అయోమయం నెలకొంది. జగిత్యాలకు నిధులు తీసుకురావడంతో ఎమ్మెల్యే సంజయ్ విఫలమయ్యారు. ఆయనను గ్రామ గ్రామాన నిలదీయాలి" అని వ్యాఖ్యానించారు. తెలంగాణను కాపాడేది కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమే, గులాబీ జెండానే అని తేల్చిచెప్పారు. ఇతర పార్టీలు చెప్పే మాయమాటల గురించి ప్రజలకు చెప్పాలని, ప్రతీ గ్రామ కమిటీలో ప్రతీ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. రజతోత్సవం గుజాబీ పండగ మాత్రమే కాదు... ఇది తెలంగాణ పండగ అని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటడానికి కేసీఆర్ పార్టీ పెట్టారని , తెలంగాణ ప్రజలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని వివరించారు. బీఆర్ఎస్ పార్టీ పెట్టకముందు తెలంగాణ యాస మాట్లాడే పరిస్థితి లేకుండదని, బీఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకోవడం వల్లనే 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పాటు చేస్తామని 2004లో హామీ ఇచ్చిన కాంగ్రెస్... అరిగోస పెట్టిందని తెలిపారు. కేసీఆర్ దీక్ష చేయడంతో దిగొచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఏర్పాటును ప్రకటించిందని తెలిపారు.

# లా కమిషన్ చైర్మన్ జస్టిస్ దినేశ్ బాధ్యతల స్వీకరణ



**న్యూఢిల్లీ, ఏప్రిల్16 (జనంసాక్షి) :** 23వ లా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులయిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ మహేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు- న్యాయవాది హితేశ్ జైన్, ప్రొఫెసర్ డీపీ వర్మ.. కమిషన్‌లో సభ్యులుగా నియమితులయ్యారు. ఏప్రిల్ 15, 2025 నాడు వాళ్లు ఛార్జ్ తీసుకున్నారు. ఆగస్టు 31, 2027న వాళ్ల పదవీ కాలం పూర్తి అవుతుంది. కేంద్ర న్యాయ మంత్రిత్వా శాఖ .. దినేశ్ మహేశ్వరి నియామకంపై ట్వీట్ చేసింది.రాజస్థాన్‌లో సుమారు రెండు దశాబ్దాల పాటు- లాయర్‌గా జస్టిస్ మహేశ్వరి ప్రాక్టీసు చేశారు. ఆ తర్వాత 2004లో ఆయన రాజస్థాన్ హైకోర్టు బెంచ్‌కు పదోన్నత పొందారు. అలహాబాద్ హైకోర్టులో జడ్జిగా చేశారు. మేఘాలయా హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా, కర్నాటక హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా కూడా చేశారు. 2019 జనవరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయన పదోన్నతి పొందారు. 2023 మేలో రి-టైర్ అయ్యే వరకు ఆయన సుప్రీంకోర్టులో జడ్జిగా చేశారు. లా కమిషన్ సభ్యుడిగా నియమితులైన హితేశ్ జైన్.. పరినం లా అసోసియేట్స్‌లో మేనేజింగ్ ప్పార్టర్‌గా ఉన్నారు. ముంబై ప్రదేశ్ బీజేపీలో వైస్ ప్రెసిడెంట్‌గా చేస్తున్నారు. రెండు దశాబ్దాల నుంచి ఆయన లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. సివిల్, క్రిమినల్, కమర్షియల్, రాజ్యాంగ అంశాల్లో అనుభవం ఉన్నది. మహారాష్ట్ర తరపున ముంబై హైకోర్టులో, సుప్రీంకోర్టులో స్పెషల్ కౌన్సిల్‌గా హాజరయ్యారు. 22వ భారత లా కమిషన్‌లో ప్రొఫెసర్ వర్మ పూర్తి స్థాయి సభ్యుడిగా చేశారు. న్యాయ విద్య బోధనలో ఆయనకు నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్నది. పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, మానవ హక్కుల చట్టాల్లో ఆయన విశేష అనుభవం ఉన్నది. నేషనల్ జుడిషియల్ అకాడమీలో 2017 నుంచి 2020 వరకు అదనపు డైరెక్టర్‌గా చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో లా కమిషన్ నాన్-స్టాటు-÷-యటరీ బాడీగా పనిచేస్తుంది. దేశ చట్టాలపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తుంది. సవరించాల్సిన చట్టాలను, రద్దు చేయాల్సిన చట్టాల గురించి లా కమిషన్ తన నిర్ణయాలను వెల్లడిస్తుంటు-ంది. న్యాయం అందరికి అందే రీతిలో, న్యాయ విభాగంలో పరిపాలన సక్రమంగా సాగే రీతిలో లా కమిషన్ వ్యవహరిస్తుంది.

# వర్కింగ్ జర్నలిస్టులు ఏఐతో జాగ్రత్తగా ఉండాలి

- సోషల్ మీడియాలో వస్తున్న విషయాలపై జర్నలిస్టులు ఫ్యాక్ట్ చెక్ చేసుకోవాలి
- తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి/ వేములవాడ ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** జర్నలిస్ట్ ప్రెస్ క్లబ్ లు నిజాలను తెలిపే వేదికలుగా మారాలని,సమస్య ఉందని ప్రెస్ క్లబ్ కు వచ్చే ప్రజల సమస్యలు పరిష్కరించే వారధిగా ప్రెస్ క్లబ్ లు పని చేయాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బుధవారం వేములవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సమావేశ మందిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలిసి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తాను 25 ఏండ్లుగా ఆది శ్రీనివాస్ పేరు వింటున్నాననీ, కరీంనగర్, వేములవాడ రాజకీయాల ప్రస్తావన వస్తే ముందుగా ఆది శ్రీనివాస్ పేరు గుర్తుకు వస్తుందనీ,అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడ్డ గొప్ప వ్యక్తి ఆది శ్రీనివాస్ అని కొనియాడారు.గతంలో కంటే కమ్యూనికేషన్ వ్యవస్థ చాలా పెరిగిందనీ, 30ఏండ్లుగా ప్రింట్,ఎలక్ట్రానిక్ మెయిన్ స్ట్రీమ్ మీడియా మొదలుకొని ఈనాడు సోషల్ మీడియా విప్లవం వరకు వచ్చిందన్నారు. సోషల్ మీడియాను వ్యతిరేకించాల్సిన పని లేదనీ ఆయన స్పష్టం చేశారు. ఈనాడు మెయిన్ స్ట్రీమ్ మీడియాకు జబ్బులు అంటుకున్న విషయాన్ని ప్రజలు చర్చించుకుంటున్నారనీ, సమాచార వ్యవస్త ప్రజలకు సమాచారాన్ని వాస్తవాలను అందించాలనీ కోరారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో నీతి, నియమాలకు అనుగుణంగా పనిచేసే వ్యవస్థ ఉంటుందని వృత్తి అనుభవం ఉన్న వారు పని చేస్తూ గేటు కీపర్ వ్యవస్త వలె వార్తలు అవసరమా లేదా అనే నిర్ధారణ చేసే వ్యవస్థ ఉందనీ, కానీ సోషల్ మీడియాకు గేట్ కీపర్ వ్యవస్థ లేదన్నారు. సోషల్ మీడియాలో వస్తున్నా వార్తలను చూసి ఏమి మీడియా, ఏమి వార్తలు అంటున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా చాలదు అన్నట్లు ఇప్పుడు పెద్ద విప్లవం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వచ్చిందని, అక్కడ ఏమి జరగకపోయినా జరిగినట్లు, ఇక్కడ ఎవరు ఉన్నా లేకున్నా ఇదే వేదిక నుండి మాట్లాడినప్పుడు చూపిస్తుందనీ, భారత ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ను వినియోగిస్తూ వ్యవసాయం,ఎరువులు, ఫెస్టిసైడ్ కు సంబంధించిన వార్తలను ఇద్దరు వ్యక్తులను పెట్టి 24 భాషల్లో చదివిస్తుందనీ, ఫేస్ బుక్, వాట్సాప్ లో డబ్బులు కడితే 51వేలు వస్తాయని చెబుతారని, ప్రధాన మంత్రి నుండి మొదలుకొని కింది స్థాయి వరకు స్కీమ్ ల గురించి చెబుతున్నారనీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఏఐ తో చేసిన చిత్రాలను చూసిన జనాలు చలించిపోయారన్నారు. ఏఐ నుండి ప్రజలను రక్షించడం ఒక ఎత్తయితే జర్నలిస్టులుగా మనం వాస్తవాలను తెలుసుకోకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. మనం కూడా విషయాన్ని తెలుసుకోకుండా సోషల్ మీడియాలో వస్తున్న విషయాలను ఫార్వర్డ్ చేస్తున్నామని అలా అయితే మన మీద కూడా కేసులు తప్పవనీ మనం నిందితులమే అవుతామనీ, ఏఐ తో జర్నలిస్టులు జాగ్రత్తగా ఉండాలనీ హెచ్చరించారు. వర్కింగ్ జర్నలిస్టులకు నైపుణ్యాలను ఇవ్వడానికి ప్రెస్ క్లబ్ లు కృషి చేయాలనీ, సోషల్ మీడియాలో వస్తున్న విషయాలను ఫ్యాక్ట్ చెక్ ఎలా చేయాలో నేర్పించేందుకు ప్రెస్ అకాడమీ సిద్ధంగా ఉందన్నారు. అవసరమైతే పాక్ట్ చెక్ కొరకు వేములవాడలో రెండు రోజుల పాటు ట్రైనింగ్ ఇవ్వడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఇండ్ల స్థలాలు లేని జర్నలిస్టులు వేములవాడలో లేరు అనే మాట రాకుండా చూడాలని విప్ ఆది శ్రీనివాస్ కృషి చేయాలని ఆయన కోరారు.ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్ట్ ప్రెస్ క్లబ్ లు నిజాలను తెలిపే వేదికలుగా మారాలన్నారు.సమస్య ఉందని ప్రెస్ క్లబ్ కు వచ్చే ప్రజల సమస్యలు పరిష్కరించే వారధిగా ప్రెస్ క్లబ్ లు పని చేయాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి సూచించారు.పాత్రికేయ రంగం అంటేనే ఫోర్త్ ఎస్టేట్ అని,ప్రజా సేవలో ఉన్నవారికి ధీటుగా పాత్రికేయులు ఉన్నారన్నారు. ఒక్కొక్క పాత్రికేయుడు ఒక వెయ్యి మందితో సమానమన్నారు. అనంతరం ఐజెయు రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ మాట్లాడుతూ వేములవాడ ప్రెస్ క్లబ్ అంటేనే ఒక గొప్ప చరిత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్టపాక లక్ష్మణ్,ఉపాధ్యక్షులు ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి నూగురి మహేష్, సంయుక్త కార్యదర్శి సంపత్ కోశాధికారి నరేష్ కార్యవర్గ సభ్యులు మల్లేశం, మ్యాన శ్రీనివాస్, సాయిబాబా, నామాల శీను, గుడిసె కిషన్, హబీబ్ పాషా, జిల్లా అధ్యక్షులు దండి సంతోష్ కుమార్, జిల్లా కార్యదర్శి ముత్యం, వేములవాడ జర్నలిస్టులు, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# చరిత్ర పరిణామంలో భారతీయ ముస్లిం లెజెండ్స్

భారతీయ ముస్లింలు ఈ దేశ చరిత్ర పరిణామంలో భాగం. ప్రపంచ చరిత్ర పరిణామంలో భారతీయ ముస్లిం లెజెండ్స్ గురించిన ఈ పుస్తకం అనేక పరిశోధనల ఫలితం. దశాబ్దాల అవగాహన, అధ్యయనాలతోపాటు వర్తమాన చారిత్రక ఆవశ్యకత నుండి ఈ పుస్తకం వెలువడుతున్నది. ఇందులో ముస్లిం లెజెండ్స్ అశేష ప్రజ్ఞ, పరిపాలనా దక్షత, రాజకీయ ఉద్యమాలు, స్వాతంత్ర్య ఉద్యమంలో నిర్వహించిన పాత్ర, శాస్త్రవేత్తలుగా, క్రీడాకారులుగా, సంగీతజ్ఞులుగా, సైంటిస్టులుగా, విద్యా వేత్తలుగా, జాతీయ సమైక్యతా వాదులుగా చేసిన కృషి, త్యాగాలు వివరించారు. ఈ గ్రంథం శతాధిక ముస్లిం లెజెండ్స్ గురించి సంక్షిప్తంగా పరిచయం చేస్తుంది.

శతాబ్దాలుగా చరిత్ర పరిణామంలో బౌద్ధం, హిందు, క్రైస్తవం, ఇస్లాం, సిక్కు, మొదలైన మతాలు, సంస్కృతి ఆసియాలో పుట్టి ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తూ వచ్చాయి. చరిత్ర పరిణామాన్ని గమనించి భారత రాజ్యాంగం సెక్యులర్, సోషలిస్టు సమాజాన్ని ఆదర్శంగా తన లక్ష్యంగా ప్రకటించుకుంది. 1950 జనవరి 26వ తేదీ నుండి అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం కుల మత ప్రాంత వివక్షలు, అణచివేతలు, దోపిడీ, పీడన లేని మానవీయ సమాజంగా ఎదగడానికి దారి చూపింది. దూరదృష్టి గల రాజ్యాంగ నిర్మాతలు 565 సంస్థానాలను, బ్రిటీష్ పాలిత ప్రాంతాలను, నైజాం పాలిత ప్రాంతాలను, ఫ్రెంచ్ పాలిత ప్రాంతాలను, ముస్లిం పాలిత ప్రాంతాలను అన్నిటినీ కలిపి ఒక దేశంగా, ఒక సమగ్ర స్వరూపం రూపొందించారు. శతాబ్దాలుగా కోల్పోయిన దేశ సమగ్రతను భారత రాజ్యాంగం సమైక్య దేశంగా, సమాఖ్య దేశంగా కొనసాగడానికి పునాదులు వేశారు.


సమస్థ వర్ణ, వర్గ, కుల, లింగ, జాతి, మత, భాష, ప్రాంత అసమానతలను, వివక్షతలను, దోపిడీ పీడన, అణచివేతలను తొలగించడం భారత రాజ్యాంగం మౌలిక లక్ష్యం. స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆత్మగౌరవం అందరికి సమాన అవకాశాలు, సమాన అవకాశాలు అందుకోవడానికి ప్రత్యేక కృషి ఏర్పాట్లు భారత రాజ్యాంగం నిర్దేశించింది. హరప్పా, సింథు నాగరికత కాలంలో సామ్రాజ్యాలుగా ఏర్పడిన దశ పురావస్తు ఆధారాల్లో కనపడవు. ఎక్కడికక్కడ నగరాలు, నాగరికత, వ్యవసాయాలు, పరిశ్రమలు స్వయం పోషకంగా విస్తరించినట్లుగా తెలుస్తున్నది. గ్రామీణ స్వయం పోషక ఆర్థిక వ్యవస్థకు తొలి పునాది గణతెగల సమాజం ఎక్కడికక్కడ శతాబ్దాలుగా కొనసాగుతూ రావడంలో ఉంది. ఆదివాసీ తెగ తనకవసరమైన అన్నిటినీ తానే ప్రకృతి నుండి సేకరించుకోవడం, స్వయంగా తయారు చేసుకోవడం, జంతువులను, పక్షులను, చేపలను వేటాడడం, భూమిలో దొరికే గడ్డలు, చెట్ల పండ్లు ఫలాలు, కాయలు, ఆకులు ఆహారంగా మార్చుకోవడం జరుగుతూ వచ్చింది. ఎక్కడికక్కడ స్థానికంగా సంస్కృతి, భాష, సైన్స్ టెక్నాలజీ, పనిముట్లు, ఆయుధాలు ప్రత్యేకంగా రూపొందుతూ వచ్చాయి.

రాజ్యం యేర్పడి రాజు రాజ్యానికి రాజయ్యాక అనేక తెగలు, జనపదాలు, పల్లెలు తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. అలా రాజ్యాన్ని విస్తరించుకున్నారు. వందలాది మంది రాజులు ఎక్కడికక్కడ ఎదిగారు. రాజుల మధ్య యుద్ధాలు జరిగాయి. యుద్ధాల్లో ఆయుధాలు, వాటి ఆవశ్యకత పెరిగింది.

రాజులు ప్రజలపై పన్నులు వేసేవారు. రాజాస్థానాల్లో ఒక ప్రత్యేక సంస్కృతి, కళలు, సాహిత్యం విస్తరించింది. ప్రజల సాహిత్యం, కళలు, వారి జీవితంలో సంస్కృతిలో భాగంగా కొనసాగుతూ వచ్చాయి. ప్రజల నుండి తీసుకొని రాజాస్థానాల్లో విశ్రాంతి వర్గాలు, రాజాశ్రితులు మరింత నైపుణ్యాలతో వాటిని అభివృద్ధి పరిచారు. అలా సంగీతం, సాహిత్యం, కళలు, తత్వశాస్త్రాలు, సిద్ధాంతాలు, రాజనీతి శాస్త్రాలు, యుద్ధనీతి శాస్త్రాలు మొదలైనవి అభివృద్ధి చెందాయి. శాంతి కాలంలో రాజాస్థానాల్లో అనేక తాత్విక చర్చలు, సంగీతం, నృత్యాలు, కళల ప్రదర్శన కొనసాగుతూ వచ్చాయి. అలా తత్వశాస్త్రాలు, తర్క శాస్త్రాలు, సంగీతం, సాహిత్యం, కళలు ఎక్కడికక్కడ ప్రత్యేకంగా అభివృద్ధి చెందాయి. చరిత్రకందిన బౌద్ధ విస్తరణ కాలంలో అనేక బౌద్ధ విశ్వవిద్యాలయాలు ఏర్పడ్డాయి. వేలాదిమంది విద్యార్థులకు ఆశ్రయమిచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా యువకులు విద్యను నేర్చుకోవడం కోసం విశ్వవిద్యాలయాలలో ప్రవేశం పొందారు. అక్కడ నేర్చుకుని తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లినప్పుడు ఇక్కడి భాషను, సంస్కృతిని సైన్స్, టెక్నాలజీ, సిద్ధాంతాలను, తత్వ శాస్త్రాలను, తర్క శాస్త్రాలను, సంగీతం, నృత్యాలను కూడా తమ వెంట తీసుకొని వెళ్లారు.

హరప్పా, సింధు నాగరికత ప్రజలు, ఆర్యుల వలస ప్రస్థానాలు, వారి పశువుల పెంపకం, వారి వైదిక సాహిత్యం మనకు తెలిసిందే. ఎన్నో సంఘర్షణలు, యుద్ధాలు జరిగాయి. అవన్నీ వైదిక సాహిత్యంలో అనేక రూపాల్లో నిక్షిప్తమై కనపడుతుంటాయి. నాగజాతి నిర్మూలన కోసం యజ్ఞాలు చేస్తున్న కథతో మహాభారతం ప్రారంభమవుతుంది. ఆఫ్ఘనిస్థాన్ (గాంధార) దేశం, పాకిస్థాన్, టిబెట్, నేపాల్, బంగ్లాదేశ్ దాకా విస్తరించిన ప్రాంతమంతా భారత ఉపఖండంగా పిలువబడింది. సంస్కృతులు, నాగరికతలు అలా పరచుకొని గంగా, సింధు, బ్రహ్మపుత్ర, యమున, సరస్వతి, నర్మద, తపతి, గోదావరి, కృష్ణ, కావేరి, తుంగభద్ర తదితర నదీ లోయ ప్రాంతాల సంస్కృతులుగా విలసిల్లాయి. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలసలు సాగుతుంటాయి. తామున్న ప్రాంతంలో ఆహారం, రక్షణ కరువై వరదలు, జంతువులు మొదలైనవాటి ద్వారా వలసలు సాగుతుంటాయి. పశువులను మేపుకుంటూ, వేటాడుతూ ఆదివాసులు తెగలు తెగలుగా ముందుకు సాగారు. అలా కుక్కలను, ఏనుగులను, గుర్రాలను, ఆవులను, బర్రెలను, కోళ్ళను, మేకలను, బాతులను, గొర్రెలను, పందులను, గాడిదలను మచ్చిక చేసుకున్నారు. భారత చరిత్రలో నంద రాజులు, మౌర్య రాజులు, అటు తర్వాత శాతవాహన రాజులు ఇలా రాజ్యాలు, రాజ్య వంశాలు విస్తరించాయి. ఈ చరిత్ర మనకు తెలుసు. భారత ఉప ఖండానికి నిరంతరం వలసలు సాగుతూనే ఉన్నాయి. కుశానులు వంటి ఇతర ప్రాంతాల నుండి వచ్చినవారు కలిసిపోయి బౌద్ధాన్ని విస్తరింపజేశారు.






ఆర్యులు, ఆర్య తెగలు వర్ణ వ్యవస్థను, కుల వ్యవస్థను నిర్మించుకున్నారు. తాము విస్తరించిన చోటల్లా చాతుర్వర్ణ వ్యవస్థను పెంచుకుంటూ పోయారు. కాలక్రమంలో చాతుర్వర్ణ వ్యవస్థ కుల వ్యవస్థగా పరిణమించింది. నాలుగు వర్ణాలతో పాటు అంటరానివారంటూ ఐదో వర్ణాన్ని అస్పృశ్యులు అంటూ వెలివేశారు. ఇలా వందల వేల కులాలుగా సమాజం విడిపోయింది. సమాజ సమగ్రత కోల్పోయింది. కుల వ్యవస్థ, స్థిరీకరణతో లోహాలు, ఖనిజాలు వెలికి తీయడంలో, పరిశ్రమల అభివృద్ధిలో ప్రపంచంలో అత్యున్నత స్థాయికి ఎదిగారు. విద్య, వైద్యంలో ప్రసిద్ధి చెందారు. వనమూలికలు, ఆయుర్వేదం మహోన్నతంగా అభివృద్ధి చెందాయి. ఆధునిక పారిశ్రామిక విప్లవానికి పూర్వం సామాన్య శకం 1801 దాకా భారతదేశమే ప్రపంచానికి అనేక విధాలుగా వెలుగునిచ్చింది. శూద్ర విప్లవం ఈ దేశంలో మహోన్నతంగా వికసించింది.

గణతెగలు, సంచార జీవులు కదులుతూ కదులుతూ సాగిపోయారు. వారికి ఏ ప్రాంతం ఏమిటో కూడా తెలియదు. దానికి పేర్లు కూడా లేవు. వాళ్ళు పెట్టుకున్న పేర్లేమిటో తెలియదు. మనకు తోచిన పేర్లు మనం పెట్టుకుంటున్నాము. మనకు తెలిసిన, 1921లో తెలియవచ్చిన హరప్పా, సింధు నాగరికత మానవ అత్యున్నత నాగరికతల్లో ఒకటి. దాని వయస్సు 3,500 సంవత్సరాల నాటిది. ఆ తర్వాత వైదిక, ఆర్యుల ప్రస్థానాలు. ఆ తర్వాత కనిష్కులు, గ్రీకులు, యవనులు వంటి ఎందరో భారత ఉపఖండం మీదుగా నడిచారు. ఇక్కడే కలిసిపోయారు. 3 వేల యేళ్ళ చరిత్ర మనకు క్రమ పద్ధతిలో లభ్యమవుతున్నది. చరిత్ర శాస్త్రవేత్తలు అలా క్రమంగా పూల దండలా గుదిగుచ్చారు. ఈ మూడు వేల సంవత్సరాలలోనే అనేక భావనలు, సంస్కృతులు, మతాలు ప్రత్యేకంగా రూపుదిద్దుకున్నాయి.

పిరమిడ్‌లు, మెసపటోమియా, హరప్పా, సింధు నాగరికతల తర్వాత వైదిక సంస్కృతి కనపడుతుంది. అటు తర్వాత కొంతకాలానికి జైనం, బౌద్ధం ముందుకు వచ్చింది. చైనాలో కన్ఫ్యూజియస్ ప్రాచుర్యం పొందారు. జైనం, బౌద్ధం తర్వాత క్రైస్తవ మతం ఆవిర్భావం జరిగింది. 6వ శతాబ్దంలో ఇస్లాం ప్రారంభమైంది. అరబ్బు తెగలు ఇస్లాం ద్వారా ఒక సమిష్టి సమాజంగా రూపుదిద్దుకుంటూ వచ్చింది. భారతదేశంలోకి గతంలోని వలసల వల్లనే వీరు కూడా రాకపోకలు సాగించారు. కాలక్రమంలో దాడులు, సంఘర్షణలు సాగాయి. రాజ్యాలు కూడా ఏలారు. భారతీయ స్థానిక ప్రజలు లక్షలాదిమంది ఇస్లాంను స్వీకరించారు. ప్రపంచం లోని ముస్లింలలో భారత ఉపఖండంలో ముస్లింలే అత్యధిక జనాభా. ఇండియా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో గల ముస్లింలు 70 కోట్లుంటారు. భారతదేశంలోని వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ సృష్టించిన అసమానతల వల్ల సమానత్వం కోసం, ఆత్మగౌరవం కోసం ఇస్లాంను స్వీకరించారు.

చరిత్ర నేపథ్యంలో భారత రాజ్యాంగం మహోన్నతమైన లక్ష్యాలతో రూపుదిద్దుకున్నది. 26 జనవరి 1950 నుండి భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. భారత రాజ్యాంగం అమలులోకి రాకముందు భారతదేశంలో మనుషులందరు సమానులు కారు. వారు కులాల వారీగా, మతాల వారీగా, రకరకాల అధికార హోదాల వారీగా జీవిస్తూ వచ్చారు. భారత రాజ్యాంగం మాత్రమే అందరిని సమానంగా గుర్తించింది. అయినప్పటికి కొన్ని శక్తులు, వర్గాలు, ప్రాంతాలు తమ స్వార్థాల కోసం, అంతర్గత వలసాధిక్యత, కులాధిక్యత, ప్రాంతీయాధిక్యత, భాషాధిక్యత, వర్ణాధిక్యతతో సమాజంలో సమైక్యత, సమగ్రతకు బదులుగా సంఘర్షణలు సృష్టిస్తున్నారు. ప్రజలను కులాల పేరిట, మతాల పేరిట విడగొట్టి పరస్పర విద్వేషాలు సృష్టించి పెంచి పోషిస్తున్నారు. ఆర్ఎస్ఎస్, బిజెపి శక్తులు హిందు మతతత్వ వాదులు ముఖ్యంగా అగ్రవర్ణ, అగ్రకులాలు తమ స్వార్థాల కోసం విభేదాలను పెంచి పోషిస్తున్నారు. చరిత్రను, సంస్కృతిని, సామాజిక పరిణామాలను వక్రీకరిస్తూ ప్రచారం చేస్తున్నారు. వాళ్ళు అధికారంలోకి రావడానికి విద్వేషాలను మెట్లుగా వాడుకుంటున్నారు.

చరిత్రలో జరిగిపోయిన విషయాలను స్వాతంత్ర్యానంతరం జాతీయ సమైక్యతకు, సమగ్రతకు సహజీవనానికి అనువుగా పాఠ్యపుస్తకాలు, చరిత్ర రచన కొనసాగుతూ వచ్చింది. ఇందుకు భిన్నంగా వర్ణాధిక్యవాదులు, హిందు మతం పేరిట విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు. చరిత్రను పునర్నిర్మిస్తున్నామనే పేరిట అర్ధ సత్యాలను, అసత్యాలను పాఠ్యపుస్తకాలుగా, చరిత్రగా ప్రవేశపెడుతున్నారు. ముస్లింలు క్రైస్తవులపై తీవ్ర వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు. ఆహారపు అలవాట్లపై దాడులు చేస్తున్నారు. హిందువుల్లో మెజారిటీ అయిన బీసీలు, ఎస్సీలు, ఎస్టీలను అణచివేసే చర్యలు చేపడుతున్నారు. బీసీలకు చట్టసభల్లో రాజ్యాంగబద్ధంగా ప్రాతినిధ్యం కల్పించకుండా, విద్యా, ఉద్యోగ రంగాల్లో ఉన్న రిజర్వేషన్లను కూడా తొలగిస్తూ వస్తున్నారు. చాపకింద నీరులా సాగుతున్న ఈ క్రమాన్ని ప్రజలు గమనించడం లేదు. వారు తమ విద్వేష ప్రచారంతో ముస్లింలను దేశ ద్రోహులుగా చిత్రిస్తున్నారు. పుట్టుమచ్చ కావ్యంలో ఖాదర్ మొహియుద్దీన్ నేను పుట్టకముందే దేశద్రోహిగా ముద్ర వేయబడ్డాను అని ఆవేదనను వ్యక్తం చేశారు.


ముస్లింలపై జరుగుతున్న దాడులకు, విద్వేష ప్రచారానికి వ్యతిరేకంగా ముస్లింలు చరిత్ర అధ్యయనాన్ని వేగవంతం చేశారు. ఒక రకంగా ఆత్మరక్షణ చర్యల్లో భాగంగా చరిత్రనుండి ముస్లిం లెజెండ్స్‌ను, వారు చేసిన కృషిని, త్యాగాలను వెలికితీసి గ్రంథస్థం చేస్తున్నారు. ఇలా ముస్లింల చరిత్రను విడిగా రాయాల్సి రావడం హిందుత్వ శక్తులు ముందుకు తెచ్చిన దుస్థితి. ఇలా విడిగా రాయడం కూడా హిందూ మతతత్వ వాదుల ఆధిక్యత ఫలితమే. నిజానికి ముస్లింలు కూడా భారతీయ చరిత్రలో భాగమే. దీన్ని బలంగా నొక్కి చెప్పడం కోసం లౌకికవాదులు, ముస్లిం చరిత్రకారులు, మేధావులు, కళాకారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'భారతీయ ముస్లిం లెజెండ్స్' గ్రంథం వెలువడుతున్నది. ముస్లింలు తమ చరిత్రను తాము తెలుసుకోవడానికే కాకుండా ప్రజలందరూ ముస్లిం లెజెండ్స్ గురించి తెలుసుకోవడానికి ఈ గ్రంథం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ గ్రంథాన్ని అందరూ చదవడం అవసరం. ఈ గ్రంథం చదవడం ద్వారా జాతీయ సమైక్యత వెల్లివిరుస్తుంది. ఈ గ్రంథం పాఠ్యపుస్తకాల్లో చేర్చడం అవసరం. గ్రంథాలయాల్లో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అందుబాటులోకి తేవడం అవసరం. ఎక్కడికక్కడ ఈ గ్రంథంలోని విషయాలను సభలు, సమావేశాల ద్వారా ప్రజలకు వివరించడం అవసరం. వల్లంపట్ల నాగేశ్వరరావుగారు రాసిన "హిందూ ముస్లిం భాయీ భాయీ అని, భారతదేశం మనదేనోయి" వంటి రాసిన వందలాది పాటలను ఒక ఉద్యమంగా, గతంలో కన్నా ఎక్కువగా ప్రచారం చేయాల్సిన ఆవశ్యకత నేడు ఎంతో ఉంది. హిందూ ముస్లింల సమైక్యత గురించి దేశవ్యాప్తంగా గ్రామ గ్రామాన, వీధి వీధిన ఒక ఉద్యమంగా చరిత్రను ప్రచారం చేయడం అవసరం. అందుకు ఇలాంటి గ్రంథాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, పరిశోధనలు చేసి ఈ గ్రంథాన్ని రూపొందించిన గ్రంథకర్త కల్లూరు మహమ్మద్ ఉమర్ ఫారుక్‌ఖాన్ గారికి హృదయపూర్వక అభినందనలు.

బిఎస్ రాములు
మహామహోపాధ్యాయ,
సామాజిక తత్వవేత్త, శతాధిక గ్రంథకం
201, సులేఖ గోల్డెన్ టవర్స్,
2-2-186/53/5, రామకృష్ణనగర్
బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్-013,
ఫోన్: 8331966987



# సింగరేణి సిఎండి బలరాం కృషి ఫలించింది

కేంద్రం తొమ్మిది ఏండ్ల క్రితం సింగరేణికి నైనీ బొగ్గు బ్లాక్ ను కేటాయించినప్పటికీ అది గ్రౌండ్ కావడానికి సుదీర్ఘ కాలం పట్టింది. తెలంగాణ లో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిఎండి గా సింగరేణి కి ఐఆర్ఎస్ అధికారి ఎన్ బలరాం ను సిఎండి గా నియమించారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ను సింగరేణి ఇంచార్జ్ చేశారు. బొగ్గు శాఖ మంత్రిగా తెలంగాణ ఎంపీ జీ.కిషన్ రెడ్డి కావడం వల్ల ఆయన సహకారం, మరీ ముఖ్యంగా సిఎండి ఎన్.బలరాం నిరంతర ఫాలో అప్, ఒడిశా అధికారులు, సీఎం అక్కడి ఎమ్మెల్యే లు, ఎంపీలు మంత్రుల తో సంప్రదింపులు, స్వయంగా డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క అక్కడి కి వెళ్లి పరిస్థితి ని ఎప్పటికప్పుడు సమీక్షించడం కూడా 17 నెలల్లో నైనీ ప్రోగ్రెస్ ఊపు అందుకున్నది. ఓవర్ ఆల్ గా సిఎండి ఎన్.బలరాం నిర్విరామ కృషికి ఫలితం దక్కింది అని చెప్పక తప్పదు! మాటలు తక్కువ, పని ఎక్కువ, ఒక ప్రాక్టికల్ మనిషి సిఎండి ఎన్ బలరాం ఒక ప్రత్యేకమైన పని రాక్షసుడు. చాలా తక్కువ సమయంలో ఎక్కువ సింగరేణి కార్మికుల, అధికారుల, నల్ల నేల ప్రాంత అన్ని వర్గాల ప్రజల మన్ననలను పొందారు. ఉత్పత్తి, ఉత్పాదకత, అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి, సంస్థ విస్తరణ లక్ష్యంగా ఆయన పెట్టుకున్నారు అనేది ఆయన పని విధానాన్ని పరిశీలిస్తే స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన ఒక డౌన్ టు ఎర్త్ మనిషి మానవత్వం ఉట్టిపడే మనిషి తనం ఆయనలో అడుగడుగునా కనిపిస్తుంది. ఇప్పుడు బలరాం లాంటి అధికారుల కొరత చాలా ఉంది.






సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఒక టన్ను బొగ్గు తవ్వి తీయడానికి సగటున 12 టన్నుల ఓవర్ బర్డెన్ (పై మన్ను) తొలగిస్తుండగా ఈ గనిలో మాత్రం ఒక టన్ను బొగ్గుకు కేవలం రెండున్నర క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీస్తే సరిపోతుంది. కనుక ఈ గని సింగరేణికి లాభదాయకమైనదే అని భావిస్తున్నారు.

**10బిజీ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి**

ఈ గనిలో మేలైన జీ - 10 రకం నాణ్యమైన బొగ్గు లభిస్తోంది. ఈ గనిలో, ఓవర్ బర్డెన్ తొలగించడానికి, బొగ్గు తవ్వకానికి, బొగ్గు రవాణాకు సంబంధించి ఇప్పటికే కాంట్రాక్ట్ లను అప్పగించారు. ఇక్కడ ఉత్పత్తి చేసే బొగ్గును ప్రస్తుతం రోడ్డు మార్గం ద్వారా సమీపంలోని జరపడ రైల్వేసైడింగ్ కు రవాణా చేసి, అక్కడి నుండి వినియోగదారులకు సరఫరా చేయనున్నారు.




**13 దశాబ్దాల చరిత్రలో..**

సింగరేణి సంస్థ తన 13 దశాబ్దాల చరిత్ర లో తొలిసారిగా దేశం లోని ఇతర రాష్ట్రంలో బొగ్గు తవ్వకాన్ని ప్రారంభించింది. ఒడిశా రాష్ట్రంలోని అంగూల్ జిల్లాలో నైనీ గని ఉన్నది. ఇది అతి పెద్ద ఓపెన్ కాస్ట్ గని! ఇక్కడి ఆదివాసీల ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి సింగరేణి డిఎంఎఫ్టి నిధులను కూడా ఖర్చు చేయనున్నది.

**నైనీ బొగ్గు బ్లాక్‌లో పుష్కల నిక్షేపాలు**

ఈ గనిలో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు తవ్వితీయటానికి అవకాశం ఉంది. ఈ గని లో ఉత్పత్తి పూర్తిస్థాయికి చేరుకుంటే ఏడాదికి 10 మిలియన్ టన్నులు అనగా కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుంది. సింగరేణిలో ప్రస్తుతం ఉన్న 17 ఓపెన్ కాస్ట్ గనుల కన్నా ఇదే అతి పెద్ద గని కానున్నది. ఏడాదికి కోటి టన్నుల చొప్పున 38 సంవత్సరాల పాటు ఈ గని నుండి బొగ్గు తవ్వి తీయనున్నారు. తెలంగాణలో ప్రస్తుతం గల

**రవాణా కోసం 60 కిలోమీటర్ల రైలు మార్గం**

అయితే ఈ ప్రాంతంలోగల ఇతర బొగ్గు కంపెనీలతో కలిసి ఒక ప్రత్యేక 60 కిలోమీటర్ల రైలు మార్గాన్ని నిర్మించడం కోసం కూడా ప్రయత్నాలు ప్రారంభించారు. మరో మూడేళ్లలో ఇది కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. నైనీ బొగ్గు బ్లాకు కోసం మొత్తం 2255 ఎకరాల భూమి సేకరించారు. దీనిలో 1935 ఎకరాల అటవీ భూమి, 320 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూమి ఉంది. సంస్థ 2025బి26 ఆర్థిక సంవత్సరం లో 76 మిలియన్ టన్నుల లక్ష్యంను నిర్దేశించుకున్నది. నైని బొగ్గు ఉత్పత్తి కారణంగా సింగరేణి సంస్థ జీవిత కాలం కూడా పెరగడమే కాదు. భారీ లాభాలు, ఉపాధికి అవకాశం ఉంటుంది. ఆ మేరకు యాజమాన్యం ప్లానింగ్ కూడా చేసుకున్నది. ఇతర రాష్ట్రాలలో సింగరేణి విస్తరణ క్రెడిట్ గోస్ టు సిఎండి ఎన్ బలరాం అనక తప్పదు. ఆల్ ది బెస్ట్ బలరాం జీ. ప్రొసీడ్.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

# కంచ గచ్చిబౌలి అసలు కథ ఇది..!

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉద్యమాలతో అట్టుడుకుతుంది. వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు కలిసి రోడ్డు ఎక్కారు. వీరి ప్రధాన డిమాండ్ సేవ్ వర్సిటీ ల్యాండ్. వర్సిటీ భూములను ఎవరి నుంచి కాపాడాలి అంటే.. తెలంగాణ ప్రభుత్వం నుంచి. అంటే ఇక్కడ ల్యాండ్ గ్రాబర్ ఎవరంటే తెలంగాణ ప్రభుత్వం వారి మాట ప్రకారం. వాస్తవానికి వర్సిటీల ఏర్పాటుకు కావాల్సిన భూములను ప్రభుత్వమే ఇస్తోంది. మళ్లీ అదే ప్రభుత్వం భూములను కబ్జా చేయడం ఏంటి? అనేది అందరినీ వెంటాడుతున్న ప్రశ్న. ఈ ఆందోళనలు హైదరాబాద్‌కే పరిమితం కాలేదు సుప్రీంకోర్టు వరకు చేరాయి. గౌరవ సుప్రీంకోర్టు సైతం చాలా సానుకూలంగా అతివేగంగా స్పందించిన తీరు సైతం అనేక ప్రశ్నలకు సందిస్తోంది. ఇదే వర్సిటీలో వేధింపులకు తాళలేక విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నప్పుడు స్పందించని రాజకీయ పార్టీలు సైతం ఇప్పుడు భూముల విషయంలో గగ్గోలు పెడుతున్నాయి.

కంచ గచ్చిబౌలి భూమి గురించి మాట్లాడటం కంటే ముందు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం గురించి తెలుసుకోవడం మంచిది. 1969 తెలంగాణ ఉద్యమం తర్వాత 1973 నాటి సిక్స్ పాయింట్ ఫార్ములాలో భాగంగా నాటి ప్రధాని ఇందిరాగాంధీ చొరవతో 1974లో ఈ వర్సిటీ ఏర్పడింది. వర్సిటీని మంజూరు చేసింది, దానికి కావాల్సిన భూములను ఇచ్చింది నాడు కేంద్రం, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలే. రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నంబరు 25లోని 2,324 ఎకరాలలోని సుమారు 1700 ఎకరాల భూమిని కేటాయించడం జరిగింది. 2004లో నాటి ఉమ్మడి ఏపీ తెదేపా ప్రభుత్వం క్రీడా వసతుల అభివృద్ధికి ఐఎంజీ అకడమీస్ భారత ప్రైవేటు లిమిటెడ్ ఇందులో నుంచి 400 ఎకరాలను కేటాయించింది. ఒప్పందం ప్రకారం ఐఎంజీ సంస్థ ప్రాజెక్టును ప్రారంభించకపోవడంతో 2006లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం భూ కేటాయింపును రద్దు చేసింది. ఈ భూమిని ఏపీ యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చరల్ డిపార్ట్‌మెంట్‌కు కేటాయించింది. కేటాయింపులు రద్దు చేయడంతో ఐఎంజీ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. అంటే 2006 నుంచి సుదీర్ఘకాలం నాటి ప్రభుత్వాలు చేసిన న్యాయం పోరాటం ఫలితంగా 2024 మార్చి 7న రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు వచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఐఎంజీ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు 2024, మే 3న ఐఎంజీ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేయడంతో 400 ఎకరాల భూమి తెలంగాణ ప్రభుత్వానికి దక్కింది. న్యాయ పోరాటం ద్వారా దక్కించుకున్న భూమిని తెలంగాణ సర్కారు ఐటీ మరియు ఇతర ప్రాజెక్టుల ఏర్పాటుకు తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ(టీజీఐఐసీ)కి 2024న, జులై 1న కేటాయించింది. ఇదంతా కూడా కంచ గచ్చిబౌలిలోని అస్తబల్ పోరంబోకు సర్కారీ భూమి చరిత్ర.

ఇటీవల టీజీఐఐసీ అధికారులు ఈ 400 ఎకరాల భూమిలో అడుగు పెట్టిన తీరే అసలు వివాదానికి దారి తీసింది. తేనె తుట్టెను కదిపినట్టుగా వర్సిటీ విద్యార్థి లోకాన్ని లేపింది. సామరస్యంగా చేసుకోవాల్సిన పని జఠిలం చేసి ప్రభుత్వ పటిష్టను కూడా దెబ్బ తీసే దాక తెచ్చారు. నాలుగు గోడల మధ్య సాఫీగా జరగాల్సిన ఒప్పందాలు లేదా చర్చలు సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకు దారి తీశాయి. ఈ మొత్తం ఎపిసోడ్‌లో టీజీఐఐసీ అధికారుల వ్యవహరించిన దూకుడే పెద్ద దెబ్బ తీసిందనేది స్పష్టం అవుతుంది. ఎకాఎకిన వర్సిటీ క్యాంపస్‌లో యంత్రాలతో చెట్ల పొదలను తొలగించడం విద్యార్థులను మరింత ఆగ్రహానికి గురి చేసి రోడ్డు ఎక్కేలా చేసింది. ప్రభుత్వం చెప్తున్నట్టుగా 2024న జులై 19న హెచ్‌సీయూ రిజిస్ట్రార్ సమ్మతితో వర్సిటీ ఇంజినీర్, ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్ సమక్షంలో సర్వే చేసి హద్దుల సైతం నిర్ధారించారు. ఈ హద్దుల ప్రకారం టీజీఐఐసీ గోడ లేదా ఏదైనా కంచెను ఏర్పాటు చేసుకొని ఉంటే వర్సిటీ క్యాంపస్‌కు దీనికి సంబంధం లేకుండా ఉండేది. కానీ ఎంతో సున్నితమైన వర్సిటీ క్యాంపస్‌లో సాధారణ ప్రాంతాలలో పనులను చేసినట్టుగానే వ్యవహరించింది. వర్సిటీ క్యాంపస్ భూములు అనగానే సివిల్ సొసైటీ సైతం నోరు విప్పి ఖండించే పరిస్థితిని తెచ్చుకుంది.




2006 నుంచి ఈ 400 ఎకరాల భూ వివాదం జరుగుతున్నా ఏనాడు కూడా వర్సిటీ అధికార యంత్రాంగం నోరు విప్పలేదు. ఐఎంజీ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు, సుప్రీంకోర్టులలో సుదీర్ఘకాలం న్యాయ పోరాటం చేస్తున్నప్పుడు ఎక్కడా కూడా హెచ్‌సీయూ ఇంప్లీడ్ కాలేదు. చివరి వరకు కూడా ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు న్యాయ పోరాటం చేసి విజయం సాధించాయి. వర్సిటీ ఏర్పడి సుమారు 50 ఏళ్లు అవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ భూములకు సంబంధించి కనీసం మ్యుటేషన్(భూబదలాయింపు) చేసుకోలేదనే ఆరోపణ కూడా ఉంది. దీంతోనే 2022లో మరో కేసులోనూ హెచ్‌సీయూకి చెందిన భూమిగా నిరూపించేందుకు చట్టపరమైన పత్రం లేదని హైకోర్టు స్పష్టం చేసింది.

2003లో ఈ 400 ఎకరాల కేటాయింపు సమయంలో ఐఎంజీ సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి, హెచ్‌సీయూ మధ్య త్రైపాక్షిక ఒప్పందం కూడా జరిగింది. ఈ 400 ఎకరాల భూమికి ప్రత్యామ్నాయంగా గోపన్‌పల్లిలో 397 ఎకరాల భూమిని సైతం కేటాయించారు. ఆ భూములను సైతం వర్సిటీ యంత్రాంగం పరిరక్షించుకోలేకపోయిందనే విమర్శ కూడా ఉంది. నాటి నుంచి నేటి వరకు ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయ పోరాటం చేయకపోతే ఆ 400 ఎకరాలు ఐఎంజీ సంస్థకే దక్కేవనే విషయాన్ని మరిచిపోవద్దు. కానీ ప్రభుత్వాల న్యాయ పోరాటంతో గౌరవ హైకోర్టు, సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూమిగానే పేర్కొనడం జరిగింది.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మొక్కకు, చెట్టుకు, చీమకు, జంతువుకు, పక్షికి ఎలాంటి నష్టం జరుగకుండానే అభివృద్ధి పనులను చేస్తుందా? అనే ప్రశ్న మొదలైంది. దీనికి కారణం రాష్ట్రంలో ఉన్న ఆ పార్టీ కేంద్ర మంత్రులు, నాయకులు మాట్లాడే తీరు, వ్యవహరించే పద్ధతినే. తాము ఇక్కడ అధికారంలో లేదని మాట్లాడితే అధికారంలో ఉన్న చోట కూడా ఏం జరుగుతుందో చర్చించాల్సి వస్తోంది. భారత ఉక్కు మనిషిగా చెప్పుకునే సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని 2018లో గుజరాత్‌లోని నర్మదా నదీ తీరంలో ఏర్పాటు చేశారు. ఈ సమయంలో ఇక్కడ జరిగిన విధ్వంసం అంతాఇంతా కాదు. ఎన్ని గ్రామాలను ఖాళీ చేయించారో, మరెన్ని లక్షల మందిని నిరాశ్రయులు చేశారో చరిత్ర చెప్తుంది. వాటి గురించి ఏనాడైనా రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు, ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు మాట్లాడరే. బీజేపీ పాలిత రాష్ట్రాలలోనూ అభివృద్ధి పేరుతో చేపట్టే మానవ హక్కుల ఉల్లంఘనలు కొకొల్లలుగా ఉన్నాయి. హెచ్‌సీయూలో విద్యార్థులు వివాదస్పద భూమి కోసం ఆందోళన చేస్తుంటే రాష్ట్రంలోని బీజేపీ నేతలు పక్షులు, చీమలు, మొక్కల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది.

వర్సిటీ విద్యార్థుల రెచ్చగొట్టి విషయాన్ని పక్కదారి పట్టించడం ఎంత వరకు సరైందో ఆ పార్టీ పెద్దలే ఆలోచించుకోవాలి. దేశంలో ఐఐటీలను, ఐఐఎంలను, సెంట్రల్ వర్సిటీలను, కేంద్రీయ స్కూళ్లను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పాలకులకు ఉంది. విద్యా పరంగానే కాకుండా ఇతర అన్ని రంగాలలో ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేసింది కూడా గత పాలకులే. బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలోని ప్రభుత్వ రంగ వ్యవస్థలను విధ్వంసం చేసింది. దేశంలో అధికారంలో ఉన్నామని, రాష్ట్రంలో అధికారం కోసం ప్రజలను, విద్యార్థులను పక్కదారి పట్టించేలా రెచ్చగొట్టే విధానాన్ని మానుకోవడం మంచిది. కంచ గచ్చిబౌలి భూ వివాదానికి చెక్ పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ముగ్గురు మంత్రులు భట్టి విక్రమార్క(డిప్యూటీ సీఎం), శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కమిటీ వేశారు. కమిటీ నివేదిక మేరకు ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ విషయాన్ని పక్కన పెడితే కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ప్రజలకు చెందుతుంది. 400 ఎకరాల భూమిని న్యాయ పోరాటం ద్వారా సాధించిన ఈ ఘనత కూడా రేవంత్‌రెడ్డి సర్కార్‌కే దక్కుతుంది.

నల్లగుంట్ల వాగీష్
సామాజిక విశ్లేషకులు

# ఉద్యోగ సృష్టికర్తలుగా ఉండండి



**పటాన్‌చెరు, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన కౌటిల్యా విద్యార్థులంతా ఉద్యోగ సృష్టికర్తలుగా ఉండాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు అభిలషించారు. ప్రతిష్టాత్మక కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్ పీపీ) తృతీయ పట్టభద్రుల దినోత్సవాన్ని ఏప్రిల్ 16న (బుధవారం) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ప్రాంగణంలోని కిన్నెర్ సెమినార్ హాలులో ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ అకడమిక్ ప్రొసెషన్‌తో ప్రారంభమైన ఈ వేడుక జాతీయ గీతాలాపన, జ్యోతి ప్రజ్వలనతో శ్రీకారం చుట్టుకుంది. పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలను అందుకుంటున్న విద్యార్థులను ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అభినందించారు. జాతీయంగా, ప్రపంచ వ్యాప్తంగా ప్రజా విధాన రూపకల్పనలో వారు పోషించే కీలక పాత్రను తన స్ఫూర్తిదాయక ప్రసంగంలో ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. 'మీరు వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నప్పుడు, సమాజంలో అర్థవంతమైన మార్పును సృష్టించే జ్ఞానం, విలువలు, ఉద్దేశ్యాన్ని మీతో తీసుకెళ్లండి' అని ఆయన ఉద్బోధించారు. సాంప్రదాయ మార్గాలను మించి ఆలోచించమని గ్రాడ్యుయేట్లను ప్రోత్సహిస్తూ, 'ఉద్యోగ సృష్టికర్తలుగా ఉండండి. విధాన వ్యవస్థాపకతను అన్వేషించండి. మిమ్మల్ని మీరు సవాలు చేసుకోండి. కొన్నిసార్లు మీరు ఉపరితలంపైకి ఏమి పెరుగుతుందో చూడటానికి నీటిని కదిలించాలి. త్వరగా నేర్చుకోండి, నడవండి, పరుగెత్తండి, ఎగరండి– కానీ ఎల్లప్పుడూ మీ పాదాలను స్థిరంగా ఉంచండి' అని ఉద్బోధించారు. గీతం అధ్యక్షుడు, విశాఖపట్టణం పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ తన అధ్యక్షోపన్యాసంలో పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలు అందుకుంటున్న విద్యార్థులను అభినందించారు. ముఖ్య అతిథి రామ్మోహన్ నాయుడును శ్రీభరత్ సత్కరించగా, కేఎస్ పీపీ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వాల్ సభకు పరిచయం చేశారు. ఈ ఏడాది 30 మంది విద్యార్థులకు పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలను ప్రదానం చేశారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బంగారు పతకాలను ఇచ్చి సత్కరించారు. మాస్టర్స్ ప్రోగ్రామ్ లో అగ్రస్థానంలో నిలిచిన ఒయిషిక్ భట్టాచార్యను గీతం అధ్యక్షుడి పేరిట ఏర్పాటు చేసిన బంగారు పతకంతో సత్కరించారు. చెరుకూరి శ్రీహర్షకు యనమంద్ర మల్లికార్జునరావు బంగారు పతకాన్ని ప్రదానం చేశారు. రోహిత్ సింగ్ గౌతమ్ ఉత్తమ క్యాప్ స్టోన్ ప్రాజెక్టుకు గాను గౌరవనీయమైన డీన్ బంగారు పతకాన్ని అందుకున్నారు. డిగ్రీ ప్రదానోత్సవాన్ని కేఎస్ పీపీ డీన్, ఐక్యరాజ్య సమితిలో భారతదేశ పూర్వ శాశ్వత ప్రతినిధి ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్ నిర్వహించగా, ముఖ్య అతిథి డిగ్రీలు, సర్టిఫికెట్లను విద్యార్థులకు ప్రదానం చేశారు. గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, డిగ్రీ రికార్డులను అధికారికంగా గీతం ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజాకు అందజేశారు. గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు కేఎస్ పీపీ విద్యార్థి వైభవి అవస్థికి ప్రతిజ్ఞ ప్రతిని అందజేయగా, ఆమె విద్యార్థులతో బిగ్గరగా ప్రతిజ్ఞ చేయించారు. మాస్టర్స్ పట్టాను అందుకున్న విద్యార్థి షితిజ్ ఝూ, 2025 తరగతి సమిష్టి ప్రయాణం, వారి ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ గ్రాడ్యుయేషన్ ప్రసంగం చేశారు. అధ్యాపకులు, యాజమాన్యాల అంకితభావం, మార్గదర్శకాలకు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. చివరిగా, కేఎస్ పీపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వసుధ కట్జు వందన సమర్పణ, ఆ తరువాత జాతీయ గీతాలాపనతో ఈ పట్టాల ప్రదానోత్సవ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# విద్యార్థులకు తప్పిన పెనుముప్పు..

- తరగతి గదిలో పెచ్చులు ఊడి పడి ఒక విద్యార్థికి తీవ్ర గాయాలు
- చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలింపు
- సంఘటనపై విచారణకు ఆదేశించిన కలెక్టర్
- డీఈవో ఇంజనీర్లతో తరగతి గదుల పరిశీలన
- మూ డు తరగతి గదులు ఖాళీ చేయాలని ఇంజనీర్ల ప్రతిపాదన
- ఊపిరి పీల్చుకున్న ఉపాధ్యాయులు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** వేసవి సెలవుల కంటే ముందు విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. కాంట్రాక్టర్ నాసి రకం గదుల నిర్మాణం చేసిన కారణంగా పెచ్చులు ఊడి విద్యార్థులపై పడి ప్రాణం నష్టం లేకుండా ప్రమాదం తప్పింది. తరగతి గదిలో విద్యార్థులు ఉండగా ఘటన జరిగింది. ఉపాధ్యాయులతో సహా విద్యార్థులందరూ తీవ్రభయాందోళనకు గురి అయ్యారు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ మండలం మున్నూరు సోమారం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న శిరీషపై (6 సంవత్సరాలు) పాఠశాల పైకప్పు పెచ్చులూడి తీవ్రంగా గాయపడింది. బుధవారం విద్యార్థులంతా తరగతి గదిలో విద్యనభ్యసిస్తుండగా ఈ సంఘటన జరిగింది. విద్యార్థి శిరీషపై పెచ్చులు ఊడి పడిన కారణంగా తలపై, చెవికి, కాళ్లకు తగిలి గాయాలయ్యాయి. సకాలంలో స్పందించిన ఆ పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి విద్యార్థి శిరీషను ఒక ప్రైవేట్ హాస్పిటల్ తరలించగా, డాక్టర్ రాజశేఖర్ ఆ బాలికకు చికిత్సను అందించారు. తరగతి గదిలో 9 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా ఒక్కసారిగా పెచ్చులు ఊడిపడ్డాయి. సంఘటన జరిగిన ప్రాంతానికి అతి చేరువలో విద్యార్థులు కూర్చున్న వారిపై పెచ్చులు పడకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పెచ్చులు భారీగా ఒకేసారి ఊడి తరగతి గదిలో పడడంతో పగిలిన చిన్న పెచ్చులు విద్యార్థులకు తగిలి గాయాలయ్యాయి. నేరుగా విద్యార్థులపై పడితే ప్రమాదం ఊహించడానికి భయంకరంగా ఉందని ధరూర్ మండల విద్యాధికారి శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. ఈ విషయం తెలియగానే తాను వికారాబాద్ డి ఈ ఓ రేణుకా దేవికి సమాచారాన్ని చేరవేసినట్లు తెలియజేశారు. సమగ్ర సమాచారం అనంతరం డిఇఓ రేణుకా దేవి వికారాబాద్ జిల్లా కలెక్టర్ కు జరిగిన సంఘటనపై పూర్తి సమాచారాన్ని తెలియజేశారు. దీంతో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వెంటనే విచారణకు ఆదేశించారు. జిల్లా విద్యాధికారి రేణుక దేవి తో పాటు ఇంజనీర్ల బృందం మున్నూరు సోమవారం పాఠశాల గదులను పరిశీలించారు. ఈ పాఠశాలలో 7 తరగతి గదులు ఉండగా అందులో మూడు నాసిరకం గదులు ఉన్నట్లు ఇంజనీర్ల బృందం ధ్రువీకరించింది. తక్షణమే మూడు తరగతి గదులను ఖాళీ చేయించాలని ఇంజనీర్ల బృందం జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలియజేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ కు నివేదిక ఇవ్వడంతో మరో నాలుగు తరగతి గదులు నాణ్యంగా ఉన్న కారణంగా ఏడు తరగతుల విద్యా బోధన అందులో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు మండల విద్యాధికారి శ్రీనివాసరెడ్డి చర్యలు తీసుకున్నారు. పెచ్చులు ఊడిపడి ఆసుపత్రిలో విద్యార్థి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి ఆసుపత్రికి వచ్చి విద్యార్థిని పరామర్శించారు.

# మంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, (జనం సాక్షి) :** భూభారతి పోర్టల్ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మద్దూరు మండలంలోని ఖాజీపూర్ లో గురువారం నిర్వహించే భూ భారతి రెవెన్యూ సదస్సు కు హాజరవుతున్న రెవెన్యూ, సమాచార పౌరా సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నందున ఖాజీపూర్ లో బుధవారం మంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పర్యవేక్షించారు. గ్రామంలోని రెండు స్థలాలను చూసిన కలెక్టర్ మండల పరిషత్ పాఠశాల ఎదురుగా ఉన్న స్థలంలో భూభారతి రెవెన్యూ సదస్సుకు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి పోర్టల్ ను అందుబాటులోకి తీసుకువచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా గురువారం రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భూ భారతి సదస్సును మండలంలోని ఖాజీపూర్ లో ప్రారంభించనున్నారు. అందుకోసం ఖాజీపూర్ లో ఏర్పాట్ల ను కలెక్టర్ దగ్గరుండి పరిశీలించారు. మంత్రి చే ప్రారంభించే భూభారతి సదస్సుకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్, ఆర్డిఓ రామచందర్ నాయక్, మద్దూర్ తహాసిల్దార్ మహేష్ గౌడ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంతో కొట్లాడుతా.. నిధులు తీసుకొస్తా..

- అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా

**చేర్యాల, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** జనగామ నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం నిరంతరం ప్రభుత్వంతో కొట్లాడుతా.. ఈ ప్రాంతానికి రావాల్సిన నిధులు తీసుకవస్తానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం జాలపల్లి, తోర్నాల గ్రామలలో బిఆర్ఎస్ జెండా ఆవిష్కరించిన అనంతరం గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఆ గ్రామాలకు ఒక్కో గ్రామానికి రూ. 4లక్షల చొప్పున మంజూరు అయిన నిధులతో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ.. జనగామ, చేర్యాల ప్రాంతలకు రావలసిన వాటా కచ్చితంగా రావాలని, అవసరం అయితే సంబందింత మంత్రి దగ్గరికి వెళ్లి అడుగుతా, ఇవ్వకపోతే కొట్లాడుతా తప్ప వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. ఇటీవల ఈ ప్రాంతానికి నగేరా నుంచి అధిక నిధులు తీసుక రావడం జరిగిందన్నారు. ఈ ప్రాంత నీటి సమస్య కూడా త్వరలోనే పూర్తి అయ్యేలా కృషి చేస్తాను అని అన్నారు.



# రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవు

- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తప్పవని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆధికారులకు సూచించారు. బుధవారం పెద్దమందడి, మండలం మణిగిల్ల, జగత్పల్లి, అల్వాల, దొడగుంటపల్లి, చిన్నమందడి, వీరాయపల్లి, జంగమయ్యపల్లి గ్రామాలలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తేమశాతం వచ్చిన అందరి రైతులతో సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని గన్ని బ్యాగుల ఇబ్బందులు లేకుండా, కొలతలల్లో తేడా లేకుండా, ధాన్యం విక్రయించగా వచ్చిన మొత్తాలను సకాలంలో అన్నదాతల ఖాతాల్లో వేసేందుకు కావలసిన పత్రాల సేకరణలో నిర్లక్ష్యం వహించరాదని, ధాన్య సేకరణ విషయంలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, పెద్దమందడి సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసిలు వెంకటస్వామి, రమేష్ గౌడ్, మాజీ సర్పంచులు, రమేష్ యాదవ్, శ్రీనివాసరెడ్డి, బాల్ చంద్రయ్య, సాక వెంకటయ్య, మాజీ ఎంపీటీసీలు రామచంద్రయ్య గౌడ్, సత్యరెడ్డి, దొడగుంటపల్లి మాజీ ఎంపీటీసీ సాయి భార్గవి రాజశేఖర్, అమ్మపల్లి వెంకటేశ్వర రెడ్డి, గట్టు యాదవ్, బాలు, వెంకటయ్య, వెంకటేశ్వర్ రెడ్డి సుదర్శన్, రాకాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ఫినిటీ మాల్‌లో గేమ్ ఆన్ ప్లే జోన్ ప్రారంభం

- హాజరైన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి ఇన్ఫినిటీ మాల్ ఆవరణలో చిన్నారుల ఆటవిడుపు కోసం గేమ్ ఆన్ ప్లే జోన్‌ను ప్రముఖ దర్శకులు రాంగోపాల్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ, నిర్మాత రాక్ లైన్ వెంకటేష్ తోకలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో దర్శకులు రాంగోపాల్ వర్మ మాట్లాడుతూ పిఎసి చైర్మన్ అరికెపూడి, నిర్మాత రాక్ లైన్ వెంకటేష్ లతో కలిసి ఇన్ఫినిటీ మాల్ ఆవరణలో గేమ్ ఆన్ ప్లే జోన్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. చిన్నపిల్లలకై రకాల వినోద భరితాన్ని పంచే ఆటలతో ఏర్పాటుచేసిన గేమ్ ఆన్ ప్లే జోన్ ఏరియా ఇన్ఫినిటీ మాల్ కు విచ్చేసే చిన్నపిల్లలకు ఎంతో కలిగిస్తుందనలో సందేహం లేదన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలకు ప్రత్యేక వినోదాన్ని అందించేందుకు గేమ్ ఆన్ ప్లే జోన్ ను చందానగర్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తక్కువ ఛార్జీలతో అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండేలా గేమ్ ఆన్ ప్లే జోన్ ను కొనసాగించాల్సిందిగా ఈ సందర్భంగా నిర్వాహకులను కోరారు. అనంతరం నిర్వాహకులు అభిలాష్, శ్రావ్యలు మాట్లాడుతూ... చిన్న, పెద్ద వయస్సుతో సంబంధం లేకుండా అందరూ సందడిగా గేమ్స్ ఆడుకునేందుకు వీలుంటుందని, వర్చువల్ గేమ్స్, బౌలింగ్, సాఫ్ట్ ప్లే, క్రికెట్, హ్యూమన్ క్లా, కార్నివాల్ గేమ్స్, డాషింగ్ కార్స్ గేమ్స్ గేమ్ ఆన్ ప్లే జోన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. వీటితోపాటు పుట్టినరోజు వేడుకలు, రుచికరమైన భోజనంసైతం ఇన్ఫినిటీ చేసే వారికి అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. యాంత్రిక జీవితానికి అలవాటు పడుతున్న నగర ప్రజలు అప్పుడప్పుడు ఇన్ఫినిటీ మాల్ కు విచ్చేసి సంతోషంగా గడపడం ద్వారా మానసిక ప్రశాంతత, రిఫ్రెష్మెంట్ తప్పక లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గేమ్ ఆన్ ప్లే జోన్ నిర్వాహకులు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

# పోషణ లోపాలను అరికట్టాలి

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** పిల్లల్లో పోషణ లోపాలను అరికట్టాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లాలోని చౌటకూరు మండలం, శివంపేట గ్రామం లోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పోషణ పక్షం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ముఖ్య అతిథిగా తన కుమార్తె తో హాజరయ్యారు. వివిధ పోషకాహార పదార్థాల తో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ... గర్భిణులకు, బాలింతలకు, కిషోర్ బాలలకు పోషణ లోపం అరికట్టాలని తెలియజేశారు. గర్భస్థ శిశువు నుండే ఏలాంటి పోషకాహార లోపాలు లేకుండా చూడాలన్నారు. గర్భం దాల్చిన మొదటి రోజు నుండి రెండు సంవత్సరాల వరకు అంటే వెయ్యి రోజులు మంచి పౌష్టిక ఆహారం తీసుకొని పలు జాగ్రత్తలు తీసుకోవాలి సూచించారు. 9 నెలలు తల్లి ఖచ్చితంగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం అంటే ఖరీదైన దుకాణాల్లో దొరికే వస్తువులు కావని, మన ఇంటి ఆవరణలో ఉండే ఆకుకూరలు ,పండ్లు, కూరగాయలు, సాంప్రదాయ చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. రక్తహీనత ఉంటే డాక్టర్ సహాయంతో ఐరన్ మాత్రలు తీసుకోవాలన్నారు. ప్రసరించిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు తాగించాలని, పుట్టినరోజు నుండి బిడ్డకు ఒక సంవత్సరం వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లల్ని తక్కువ బరువు, తక్కువ ఎత్తు ఉన్న పిల్లల్ని గుర్తించి ఆ ఆ సమస్యల్ని పరిష్కరించాలన్నరూ. అంగన్వాడీలలో ఫ్రీ స్కూల్, కిట్టులు ఏర్పాటు చేయడం జరిగిందని దానిని పిల్లలకు పిల్లల తల్లిదండ్రులకు చూపించాలన్నారు. జిల్లాలో తీవ్ర పౌష్టికాహార లోపం ఉన్న వారిని గుర్తించి జిల్లాలో తీవ్ర పౌష్టికాహార లోపాన్ని జీరో స్థాయికి తీసుకురావాలన్నారు. అనంతరం పిల్లలు, గర్భిణీ స్త్రీలు, తల్లిదండ్రులు, సిబ్బందితో కలిసి పోషణ లోపం అరికట్టాలను ప్రతిజ్ఞ చేశారు. గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు చేశారు, ఆరు నెలలు పూర్తయిన పిల్లలకు అన్నప్రసరణ కార్యక్రమం జరిపించారు. సి పి డి సి ఎస్ సిబ్బంది చేసిన స్కిట్స్ అలరించాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కాంతి వల్లూరు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక వ్యక్తి వాళ్ళ నానమ్మను గాంధీ హాస్పిటల్ లో వదిలేసి వచ్చారని ...ఇది మా దృష్టికి వచ్చింది ఇలాంటి సంఘటనలు ఉంటే తమ దృష్టికి తేవాలని అధికారులకు సూచించారు. వయోవృద్ధుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ లలిత కుమారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిణి వసంత కుమారి , డీఈఓ వెంకటేశ్వర్లు , జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, ఆర్డిఓ పాండు, సి డి పి ఓ లు, సంబంధిత అధికారులు , మహిళలు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సన్నబియ్యం సరఫరాపై తప్పుడు ప్రచారం

- రేషన్ లో ప్లాస్టిక్ బియ్యం సరఫరా అనే ప్రచారం అవాస్తవం
- అసత్య ప్రచారాలు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు
- సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారంపై
- వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** రేషన్ షాపుల్లో పంపిణీ చేసే సన్న బియ్యంలో ప్లాస్టిక్ బిల్డింగ్ ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేసే సన్న బియ్యం ఫార్టీఫైఎడ్ రైస్ అనగా విటమిన్స్ తో కూడినసన్న బియ్యం పంపినీ చేస్తున్నామని తెలియ చేశారు. తెలంగాణ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో ప్రజలను ఆందోళనకు గురిచేసే దురుద్దేశంతో కొంతమంది సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. గోదావరిఖని పెద్దపల్లి జిల్లా లోని తిలక్ నగర్ లో పంపిణీ చేసే సన్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కలిశాయని ఫేస్ బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలలో కొన్ని వీడియోలు ప్రచారం చేశారని, దీని పై స్పందించి ఆ జిల్లా పౌర సరఫరాల శాఖ స్పందించి తిలక్ నగర్ ప్రాంతంలోని ఎక్కడ ఎటువంటి ప్లాస్టిక్ బియ్యం సరఫరా లేదని తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దురుద్దేశంతో సన్న బియ్యం పథకం పై తప్పుడు వీడియోలను సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేసినయెడల సంబంధిత అకౌంట్ హోల్డర్ల పై చట్టరీత్యా కటిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్, ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో సెమీ అర్బన్ జిల్లా నివేదిక కమిటీ అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు స్వామి వివేకానంద స్కూల్ అఫ్ ఎక్సలేన్సు (బాలుర )వికారాబాద్ మండలం ధన్నారం నందు గల చైల్డ్ కేర్ వసతి గృహం మరియు స్కూల్ ను తనిఖీ చేయడము జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. బుధవారము జిల్లా శిశు సంక్షేమ అధికారి జయసుధ లతో కలిసి స్వామి వివేకానంద స్కూల్ అఫ్ ఎక్సలేన్సు (బాలుర)వసతి గృహం మరియు స్కూల్ ను సందర్శించి రికార్డ్స్ ను పరిశీలించారు. దార్మెంటరి , వాష్ రూంలను పరిశీలించి, సెక్యూరిటీ , పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారా, మెనూ ప్రకారము భోజనం పెడుతున్నారా, పూర్తి వివరాలు సంబంధిత వార్డెన్ లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా మేను ప్రకారము వారికి ఆహారం అందించాలని, ప్రతినెల పిల్లలకు హెల్త్ చెకప్ చేయించాలని, అదేవిధంగా రికార్డ్స్ మెయింటెనెన్స్ చేయాలనీ సంబంధిత వార్డెన్ లకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సి డబ్ల్యు సి మెంబర్లు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
17 ఏప్రిల్ 2025

# అల్యూమినియం, ఎలక్ట్రిక్ వైర్ దొంగల ముఠా అరెస్ట్

- దొంగతనానికి గురైన రూ. 2.2 లక్షల అల్యూమినియం స్వాధీనం
- నేరానికి ఉపయోగించిన ట్రాలీ ఆటో సీజ్
- 9 సెల్‌ఫోన్లు, 9 మంది నేరస్తులు అదుపులోకి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** జిల్లాలో గత కొన్ని రోజులుగా కొత్తగా నిర్మిస్తున్నాం వెంచర్లలో అల్యూమినియం, ఎలక్ట్రిక్ వైర్ దొంగతనానికి పాల్పడుతున్న మూటను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. సదాశివపేట, సిసియస్ పోలీసుల సంయుక్త ఆపరేషన్లో 11 కేసులు గుర్తించారు. దొంగతనానికి గురైన సుమారు రూ. 2.2 లక్షల విలువగల 778 కిలోల అల్యూమినియం ,ఎలక్ట్రికల్ వైర్ స్వాధీనం చేసుకున్నారు.నేరానికి ఉపయోగించిన ట్రాలీ ఆటో సీజ్ చేసి 9-మంది నేరస్తులను, 9-సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా ఎస్పీ వివరాలు వెల్లడించారు ఈనెల 1న కే.సంతోష్ కుమార్ కూకట్ పల్లి, హైదరాబాద్ పిర్యాదు మేరకు సదాశివపేట మండలంలోని అంకెనపల్లి గ్రామంలో ఉన్న వెంచర్ లో గల ఎలక్ట్రికల్ పోల్స్ నుండి సుమారు 6000 మీటర్ ఎలక్ట్రికల్ వైర్లను గుర్తు తెలియని దొంగలు దొంగిలించినట్లు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సదాశివపేట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇదేవిధంగా సదాశివపేట మండలంలోని నందికంది, ఆత్మకూర్ గ్రామ శివారులో గల వెంచర్ల నుండి అల్యూమినియం ఎలక్ట్రికల్ వైర్ దొంగతనం చేశారని ఫిర్యాదులు రాగా కేసు నమోదు చేశారన్నారు. ఇవే కాకుండా జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ లలో నమోదైన కేసుల నమోదైనట్లు తెలిపారు.



### వివరాలలోనికి వెళితే..

నేరస్తులందరూ ఒరిస్సా, బీహార్ మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందినవారు గత కొన్ని సంవత్సరాలుగా సుభాష్ నగర్, జీడిమెట్ల, హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వీరికి మద్యం సేవించడం, గంజాయి తాగడం, వంటి చెడు అలవాట్లు ఉన్నాయి, ఇతర జల్సాలకు అలవాటుపడి, పని చేయగా వస్తున్న డబ్బులు వారి జల్సాలకు సరిపోనందున ఏదైనా దొంగతనం చేసి, తప్పుడు మార్గంలో అధిక డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు.
అందుకు ఒరిస్సాకు చెందిన హరి! ఇంతకుముందు రెండుసార్లు ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గ్యాంగ్‌తో కలిసి కరెంటు సప్లై లేని వెంచర్లలో స్తంభాలకు ఉన్న అల్యూమినియం ఎలక్ట్రిక్ వైర్ దొంగతనం చేసి స్క్రాప్ షాపులో అమ్మగా చాలా డబ్బులు వచ్చాయని, అదేవిధంగా హైదరాబాద్ సమీప ప్రాంతాలలో చాలా వెంచర్లు ఉన్నాయని, ఇక్కడ ఎవరు సెక్యూరిటీ కూడా ఉండరు మనం ఒక గ్యాంగ్‌గా ఏర్పడి, రాత్రి సమయాలలో దగ్గర ఉన్న ట్రాలీ ఆటోలో వెళ్ళి వెంచర్ల నుండి అల్యూమినియం ఎలక్ట్రికల్ వైర్ దొంగతనం చేసి, అమ్మగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసుకుందాం అని చెప్పగా పై నేరస్తులు దానికి అంగీకరించి, పైన తెలిపిన నేరాలకు పాల్పడినట్లు తెలిపారు. నేరస్తులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సదాశివపేట్ సిసిఎస్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి టెక్నికల్ సాక్షాదారాల సహాయంతో నేరస్తులను గుర్తించడం జరిగిందన్నారు., ఈనెల 16 బుధవారం తెల్లవారుజామున మద్దిపాడు చౌరస్తాలో నేరస్థులను పట్టుకొని, దొంగతనానికి గురైన సుమారు రూ.2.2 లక్షల విలువ గల 778 కిలోల అల్యూమినియం ఎలక్ట్రికల్ వైర్ ను, నేరానికి వినియోగించిన ట్రాలీ ఆటో మరియు వైర్ కట్ చేయడానికి ఉపయోగించిన కట్టర్స్ లను నేరస్తుల నుండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు మిగతా నేరస్తులను త్వరలో అరెస్ట్ చేసి, రిమాండ్ కు పంపడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సంగారెడ్డి డియస్పీ సత్తయ్య గౌడ్, సదాశివపేట ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ వి.శివకుమార్ ఇన్స్పెక్టర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ పి. రాము నాయుడు, కె. శ్రీకాంత్ ఎస్ఐ, సిసిఎస్ సంగారెడ్డి, యం. నగేష్ ఇన్వెస్టిగేషన్ అధికారి, ఎస్ఐ సదాశివపేట, భారత్ కుమార్ రెడ్డి, ఎస్ఐ కొండాపూర్, రామకృష్ణ, హెచ్ సీ, కానిస్టేబుల్ గణపతి రావు, వెంకటేశం, అమానుల్లా, మల్లేష్ పిసి, శివకుమార్ హెచ్ జి, సిద్దార్థ్ పిసి, భాస్కర్, బి రమేష్, హెచ్ జి వీరేశం, సిసిఎస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రెక్య, కానిస్టేబుళ్లు మతిన్, శశి, అన్వర్, సలీం, ప్రశాంత్, ఉదయ్ కిరణ్, మోహన్, సతీష్, ఆసిఫ్ లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వ బృందం



**నంగునూరు, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** నంగునూర్ మండలంలోని నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వ బృందం పరిశీలించింది.జాతీయ ఆయిల్ సీడ్ డైరెక్టర్ పొన్ను స్వామి, ఉద్యాన సంయుక్త సంచాలకులు సరోజినీ దేవి మండలంలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.పామ్ ఆయిల్ పంట సాగు,అంతర పంటల సాగు పట్ల కేంద్ర ప్రభుత్వ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఆయిల్ పామ్ టన్ను ధర రూపాయలు 21000/- ఉందని తెలిపారు.ఆయిల్ పామ్ సాగు చేసి ఆదాయం పెంచుకోవాలని రైతులకు సూచించారు.జూన్ మొదటి వారంలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ని అందుబాటులోకి తేస్తామని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సువర్ణ, జిల్లా ఆయిల్ పెడ్ మేనేజర్ భాస్కర్ ,మండల ఉద్యాన శాఖ అదికారి బాలాజీ, మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల స్థాయి పెంపుకు ఏఐ ఆధారిత బోధన దోహదం

- డిఇఓ శ్రీనివాసరెడ్డి



**సిద్దిపేట, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** విద్యలో వెనుకబడిన విద్యార్థుల స్థాయి పెంపుకు ఏఐ ఆధారిత ఎఫ్ఎల్ఎన్ బోధన ఎంతగానో దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం చిన్నకోడూరు మండలంలోని రామంచ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను సందర్శించి కంప్యూటర్ ల్యాబ్ లో విద్యార్థులు చేస్తున్న ఏఐ టూల్స్ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులచే తెలుగు,ఇంగ్లీష్, గణితం విషయాలపై అసెస్మెంట్లు ప్రాక్టీసులను చేయించారు. ఈ కార్యక్రమంతో విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచి కంప్యూటర్ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. బోధన సైతం సులభతరం అవుతుందని, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారానికి రెండు రోజులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో నెట్ వర్క్ సమస్య లేకుండా వచ్చే విద్యా సంవత్సరం నుండి నెట్ కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. యుడైస్ క్రాస్ చెక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనంతోపాటు ఆవరణలో నాటిన పండ్ల మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్తు యాదవరెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు సత్తవ్వ, అబ్దుల్లా షరీఫ్ ఉపాధ్యాయులు భాస్కర్, వై.వి.సురేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
భూ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి భూభారతి

## ప్రజా ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యత



**బిజినేపల్లి, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** ప్రజా ప్రభుత్వం లో విద్య కు ప్రాధాన్యత ఇస్తున్నదని నాగర్కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల రాజేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు కూచికూల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రీన్ బోర్డ్స్ పంపిణీ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలకు గత నెలలో నూతన డైట్ ప్లాన్‌ను ప్రారంభించడానికి రావడం జరిగిందని అక్కడ ఉన్న విద్యార్థులు సర్ మాకు, గ్రీన్ బోర్డ్‌లు లేవని చెప్పడంతో వెంటనే స్పందించి కూచుకుళ్ల ఫౌండేషన్ తరుపున విద్యార్థులకి గ్రీన్ బోర్డ్స్ అందించడం జరిగిందన్నారు. పరీక్షలలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. అదేవిధంగా విద్యార్థులు జనరేటర్ కావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో త్వరలోనే అది కూడా మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ సుమతి మాట్లాడుతూ పేద విద్యార్థుల పట్ల మీకున్న మక్కువకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కథలప్ప మండల పార్టీ అధ్యక్షులు మిద్దె రాములు, మృత్ రెడ్డి, తిరుపతయ్య, వెంకటస్వామి, సైదులు, ఆవంతి శంకర్, పండ్లపాషా, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఖలీల్, ముక్తార్, బాల్రాజ్, బంగారి పర్వతాలు, మాన్య నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాలు నందు ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ పథకం క్రింద అర్హులైన వారికే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని, పూర్తి పారదర్శకంగా ఎంపిక ఉండాలన్నారు. ఇండ్ల నిర్మాణ పనులు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని ఎంపీడీవోలకు ఆదేశించారు. గ్రామ స్థాయిలో అధికారులు ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులతో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పర్యవేక్షణకు ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు.ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో స్థలాలను గుర్తించి బేస్‌మెంట్ నిర్మాణం నిర్ధారించాలని ఆదేశించారు. ప్రతి వారం నిర్మాణ పురోగతిపై నివేదికను సమర్పించాలని పేర్కొన్నారు.జాబితాలో కేవలం అర్హులే ఉండేలా పునఃపరిశీలన చేయడంతో పాటు, నిరాకరణ శాతంపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు.మున్సిపల్ కమిషనర్లకు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అన్నారు.ఎంపిక చేసిన గ్రామంలో ఒక ఇల్లు నిర్మించి,తక్కువ ఖర్చుతో ఇళ్ల నిర్మాణ విధానాన్ని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించడానికి లబ్ధిదారులు ఆలస్యం చేయకూడదని, వీలైనంత త్వరగా పనులు మొదలు పెట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం అందిస్తున్న నిధులు, సౌకర్యాలు పూర్తిగా వినియోగించుకుని నిర్మాణాలు నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అన్నారు.



### రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణపై సమీక్ష

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అమలుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజు యువ వికాసం క్రింద జిల్లాలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ క్రిస్టియన్ మైనారిటీ ల నుండి వచ్చిన దరఖాస్తుల పరిశీలన తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలు ప్రభుత్వ సూచనల ప్రకారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ,నర్సింగ రావు,డిపిఓ నాగేంద్రం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ బాబు,మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** వేసవి కాలంలో జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండ ప్రణాళిక బద్దంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ లో మండలాల వారీగా త్రాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పరిధిలో త్రాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా ప్రజలకు స్వచ్ఛమైన త్రాగు నీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. త్రాగునీటి మొత్తం డిమాండ్, సరఫరా సమతుల్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని, నీటి కొరత ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. నీటి సరఫరాకు అవసరమైన అత్యంత ప్రాధాన్యత గల పనులను చేపట్టే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. జిల్లాలో త్రాగునీటి సరఫరా ప్రభావితం కాకుండా బల్క్ వాటర్ సప్లై, ఓహెచ్ఎస్ఆర్, సింగిల్ ఫేజ్ చేతిపంపులు, ప్రైవేట్ బోర్ వెల్స్, ట్యాంకర్లు వంటి అన్ని మార్గాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా నీటి కొరత ఏర్పడినట్లయితే తక్షణమే స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టి నిరంతరం త్రాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి మోటార్ల రిపేర్లు, పైప్‌లైన్లలో లీకేజీలు ఉంటే వెంటనే సరిచేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు,ఏఈలు నీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఇంచార్జ్ డిపిఓ నాగేంద్రం,మిషన్ భగీరథ ఈఈ ఏంట్రా శ్రీధర్ రెడ్డి,గ్రిడ్ ఈఈ పరమేశ్వరి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



## భూ భారతి చట్టంపై ఈ నెల 30వరకు అవగాహన సదస్సు

- కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు సూచించారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో భూ భారతి చట్టం పై అదనపు కలెక్టర్ మాధురి (రెవెన్యూ)ఆర్డీవోలు, తాహసిల్దార్లతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టంలో నోటీసు విధానాన్ని అమలు పక్కగా ఉందన్నారు. కొనుగోలు, అమ్మకం దారునికి, మ్యుటేషన్ సందర్భంలో నోటీసు విధానాన్ని అమలు చేయాలన్నారు.నోటీసు అమలు చేశాక అభ్యంతరాలు ఉంటే పలువురి వాదనలు విని పోర్టల్ లో అప్లోడ్ చేసి పరిష్కరించాలన్నారు. భూ భారతి లో హక్కుల రికార్డ్ లలో తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు గాను ముందుగా భూముల సర్వే, మ్యాప్ తయారీ, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, మొదలగునవి భూ భారతిలో కీలక అంశాలని వెల్లడించారు. ఈ చట్టంపై ఈ నెల 30 వరకు మండలాల్లో అవగాహన సదస్సులను సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆయా సదస్సులలో ప్రజలకు ఈ చట్టంపై నిశితంగా అవగాహన కల్పించాలన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన లిభూ భారతిలి ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, రైతు సంఘాల నాయకులు, సభ్యులను కూడా ఈ సదస్సులో భాగస్వామ్యం చేయాలని, చట్టంలో ఉన్న ప్రాధాన్యత అంశాల వివరాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా కరపత్రంపై ముద్రించాలన్నారు. ఆర్ఓఆర్ తప్పుల సవరణ సెక్షన్-4, 5, 7 ల గురించి, అలాగే ఏ సమస్యకి ఎలా అప్పీల్ చేసుకోవాలి అనే అంశం మీద క్షుణ్ణంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ సదస్సులో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్, డిఆర్ఓ పద్మజారాణి, రెవెన్యూ శాఖ అధికారులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** మద్దూర్ మండల కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రం లో సౌకర్యాలు పరిశీలించారు.ధాన్యం కొనుగోలు ప్రారంభమైనప్పటి నుంచి ఇంత వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారని నిర్వాహకులను ఆమె అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం లో తేమ కొలిచే యంత్రంతో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు.కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్, తహసిల్దార్, రెవెన్యూ, సింగిల్ విండో అధికారులు పాల్గొన్నారు.

# భూ భారతి - 2025 చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి - 2025 చట్టంపై రెవెన్యూ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 'భూ భారతి' భూమి హక్కుల రికార్డు - 2025 చట్టంపై తహసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దార్లు, ఆర్ ఐ లు, ఇతర రెవెన్యూ సిబ్బందితో పాటు ఇతర అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు అందరికీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూభారతి చట్టంలోని ముఖ్యంశాలను వివరించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డిఆర్డిఓ ఉమాదేవి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఉన్న ధరణి స్థానంలో భూభారతి భూమి హక్కుల రికార్డు - 2025 చట్టాన్ని కొత్తగా తీసుకువచ్చిందని తెలిపారు. ఈ చట్టంపై రెవెన్యూ అధికారులు ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు.




### రైతులకు అవగాహన కార్యక్రమాలు

భూ భారతి చట్టం- 2025పై రైతులకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఏప్రిల్, 17 నుండి మండలాల వారీగా రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి చట్టం పై అవగాహన, అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. రైతులతో అవగాహన కార్యక్రమాల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు.

### ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులను గుర్తించాలి

వనపర్తి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి పైలెట్ గ్రామాలు కాకుండా మండలాల వారీగా అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలతో సమావేశం నిర్వహించి నిజమైన అర్హులను గుర్తించే బాధ్యతను అప్పగించాలన్నారు.

### తాగునీటి ఇబ్బందులు రానివ్వద్దు

వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. స్థానికంగా ఉండే నీటి వనరులను సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవోలకు సూచించారు. స్థానిక నీటి వనరులకు సంబంధించి ఏమైనా మరమ్మత్తులు చేసేది ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలలో వాటర్ ట్యాంకర్లను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా తహసిల్దార్లకు, డిప్యూటీ తహసిల్దార్లకు, ఆర్ ఐ లకు భూభారతి చట్టంపై అవగాహన గురించి పరీక్షను నిర్వహించారు.ఈ సమావేశంలో తహసిల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ ఐ లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 150 వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేస్తాం

**హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**భీమదేవరపల్లి, ఏప్రిల్ 16(జనం సాక్షి)**



: హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 150 వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. బుధవారం నాడు భీమదేవర పల్లి మండలంలో ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద జరుగుతున్న జాతీయ రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం నాయకులు చెప్యాల ప్రకాష అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్తూపం, గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా కలెక్టర్ ప్రావీణ్య అంబేద్కర్ విగ్రహం మూల మీద పెట్టాలని అధికారులకు ఆదేశించారు. రోడ్డు వెడల్పు అనుకూలంగా సత్వరమే పనులు చేపట్టి డ్రైనేజీ నిర్మాణం కూడా చేపట్టాలని ఆమె అధికారులు ఆదేశించారు. ఇప్పటివరకు మూడు మండలాల్లో 50 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి త్వరలో మిగతా 100 కూడా ప్రారంభిస్తామని ఆమె తెలిపారు. ఆర్డిఓ రమేష్ రాథోడ్, డిపిఆర్ఓ, వివిధ శాఖ అధికారులు ఉన్నారు.

# అకాల వర్షాలతో అన్నదాతకు అపార నష్టం

**పలు పంటలను పరిశీలించిన ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు**

**చిట్యాల ఏప్రిల్ 16 (జనంసాక్షి)**



మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు పంటలకు నష్టం వాటిల్లింది. ఆరుగాలం శ్రమంచి పండించిన పంట వర్షం లో తడిచి ముద్దయింది. కురిసిన అకాల వర్షాలకు పెద్ద మొత్తంలో చేతికి వచ్చిన పంట నీటిపాలైంది. మొక్కజొన్న ,అరటి,వరి, మామిడి తోటలకు భారీ నష్టం వాటిల్లింది. సుమారు రెండు గంటల పాటు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పెద్ద ఎత్తున నష్టాలు జరిగింది . మరోవైపు ఇళ్లపై కప్పులు కొట్టుకుపోవడంతో పేద ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. కాగా మండలంలోని కైలాపూర్ శివారులో గల రామచంద్రపురం రైతులకు చెందిన అరటి తోటలు గత రాత్రి ఒక్కసారిగా ఈదురు గాలులు, వడగళ్ల వాన వలన నష్టపోయిన అరటి తోటలను భూపాలపల్లి డివిజన్ ఉద్యానశాఖ అధికారి సునీల్ కుమార్, చిట్యాల మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డితో కలిసి నష్టం జరిగిన పలు పంటలను పరిశీలించి ప్రాధమికంగా అంచనా వేసి, నివేదిక ఉన్నతాధికారులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు అధైర్య అప్పడొద్దని పలు సలహాలు సూచనలు చేశారు. వారి వెంట రైతులు క్యాతం రమేష్, సూర సుధాకర్,గాజె అశోక్ ,క్యాతం భద్రయ్య, మధుకర్, సతీష్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులు ఎలాంటి పొరపాట్లు జరగకూడదు

**భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**భూపాలపల్లి, ఏప్రిల్ 16 (జనం సాక్షి):**



ఇండ్లు లేని నిరుపేదలకు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు విచారణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని జిల్లా రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల విచారణ ప్రక్రియపై గృహ నిర్మాణ శాఖ, డిఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇవ్వనున్న ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారుల విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇండ్లు కేటాయింపులో ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా నిరుపేదల లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని 145 గ్రామ పంచాయతీల పరిధిలో 33089 దరఖాస్తులు, మంథని నియోజకవర్గ పరిధిలోని 84 గ్రామ పంచాయతీల పరిధిలో 18634 మొత్తం 51723 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ఇందిరమ్మ కమిటీలకు లబ్ధిదారుల ఎంపికలో పాటించాల్సిన మార్గదర్శకలపై ప్రభుత్వ ఉత్తర్వులు పాటించాలని సూచించారు. ఈ నెల 21వ తేదీ వరకు ప్రాథమిక విచారణ పూర్తి చేయాలని అట్టి జాభితాను తిరిగి గెజిటెడ్ అధికారి ద్వారా సూపర్ చెక్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్డీఓ నరేష్, గృహనిర్మాణ శాఖ పిడి లోకిలాల్, భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అన్ని మండలాల ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్‌లో ప్లాస్టిక్ బియ్యం సరఫరా అవాస్తవం

**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 16(జనంసాక్షి) :**



**అసత్య ప్రచారాలు చేసే వారిపై క్రిమినల్ కేసుల నమోదు**

**జిల్లా పౌర సరఫరాల అధికారి సయ్యద్ షా ఫైజల్ హుస్సేని**

రేషన్ షాపుల్లో పంపిణీ చేసే సన్న బియ్యం లో ప్లాస్టిక్ బిల్డింగ్ ఉన్నాయం టూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైజల్ హుస్సేని బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో ప్రజలను ఆందోళనకు గురిచేసి సమాజంలో అశాంతి సృష్టించాలనే దురుద్దేశంతో కొంతమంది సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని జిల్లా పౌర సరఫరాల అధికారి తెలిపారు. ప్రజలను భయాందోళనలకు గురి చేస్తూ సమాజంలో అశాంతిని సృష్టించాలని దురుద్దేశంతో తప్పుడు వీడియోలను సామాజిక మాద్యాలలో ప్రచారం చేసిన యెడల సంబంధిత అకౌంట్ హోల్డర్ల పై చట్టరీత్యా చర్యలు తీసుకోవటం జరుగుతుంది. సన్న బియ్యం పథకంపై ప్రజలలో ఆందోళన సృష్టించేలా తప్పుడు ప్రచారాలు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సంపన్నుల ఆస్తులను జాతీయం చేయాలి

**యువతను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నిరంతరం ఉద్యమించాలి**

**ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి లెనిన్ బాబు**

**హైదరాబాద్ (జనంసాక్షి) :**




దేశంలోని వనరులను యధేచ్ఛగా దోచుకుంటున్న సంపన్నులు ముకేష్ అంబానీ, ఆదానీ ఇతర బడా వ్యాపారస్తుల ఆస్తులను జాతీయం చేయాలని,యువతను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నిరంతరం ఉద్యమించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ కార్యదర్శి లెనిన్ బాబు పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కన్వెన్షన్ హిమాయత్ నగర్ లోని సత్యనారాయణ రెడ్డి భవన్ లో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి లెనిన్ బాబు మాట్లాడుతూ కార్పొరేట్ సంపన్నులు దేశాన్ని అన్ని రకాలుగా దోచుకుని తమ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకుంటున్నారని, కానీ దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి లో మాత్రం వారి పాత్ర సూన్యమని వారు ఆరోపించారు. ఆర్థిక స్థిరత్వం అంటే దేశ అభివృద్ధి అని, కానీ కార్పొరేట్ శక్తుల నినాదం మాత్రం తమ వ్యాపార సామ్రాజ్యాల ఎదుగుదలే ప్రధాన ధ్యేయమని వారు ఉద్ఘాటించారు. కార్పొరేట్ శక్తుల విధానాల కారణంగా ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి బహుళజాతి కంపెనీలకు రెడ్ కార్పెట్ వేసిన పాలకుల తీరు సిగ్గుచేటని, దీని మూలంగానే భారతదేశ యువతకు ఉపాధి అవకాశాలు దక్కడం లేదని వారు వాపోయారు. దేశంలో రోజురోజుకూ నిరుద్యోగం పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గ మని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర సంయుక్తంగా మాట్లాడుతూ భారతదేశంలోనే యువత ఎక్కువ ఉందని చెప్పారు. ప్రపంచంలో 186 కోట్లమంది యువజనులు ఉంటే అందులో 28 శాతం భారతీయులేనన్నారు.

నవ యువకులతో నవనవలాడుతున్న యువజన దేశం భారత్ అన్నారు. ఈ సమావేశంలో ఏఐఎ వైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు,లింగం రవి,బిజ్జ శ్రీనివాసులు, యుగంధర్,పేరబోయిన మహేందర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్. బాలకృష్ణ, సల్మాన్ బేగ్,షేక్ మహమూద్,శివ కుమార్,మధు, బోనగిరి మహేందర్, మస్క సుధీర్, మోగిలి లక్ష్మణ్, మహేష్, మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, మానస్ కుమార్,మార్కపూరి సూర్య, రాజేష్, మధు, ప్రవీణ్, అశోక్, రాజ్ కుమార్,వెంకటేష్ లతో పాటు 100మంది పాల్గొన్నారు.

# యువకులు విద్యతో పాటు క్రీడలలో రాణించాలి

**బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి**

**విజేత పెంటాకలాన్..**

**రన్నర్ జట్టు పెగడాపల్లి**

**బోధన్, ఏప్రిల్ 16 ( జనంసాక్షి ) :**



యువకులు విద్యార్థులతో పాటు క్రీడలలో రాణించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బోధన్ మండలం పెగడాపల్లి గ్రామంలో ప్రీమియర్ లీగ్ సీజన్ -2 టోర్నమెంటును నిర్వహించారు. ఈ సందర్భంగా ముగింపు వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే యువకులను ఉద్దేశించి మాట్లాడారు. యువకులు విద్యతో పాటు క్రీడలలో రాణించాలని, క్రీడలలో గెలుపు ఓటములు సహజమే అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువకులకు పెద్దపీట వేయడంతో ఇప్పటికే వేలాది ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. కాగా యువకులు రానున్న ఎన్నికలలో మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. గుజరాత్ లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని కేవలం పెన్షన్ మాత్రమే అందిస్తున్నారన్నారు. కాగా సబర్మతి నది లాగానే రానున్న కాలంలో మూసీనదిని ప్రక్షాళన చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. అనంతరం విజేతలకు ప్రైజ్ మనీతో పాటు ట్రోఫీలని అందించారు. మొదటి విజేతకు గాధారి నవతేజ రెడ్డి స్పాన్సర్ చేసిన 25 వేల 555 రూపాయల చెక్కును, రన్నర్ ప్రైజ్ స్పాన్సర్ ఎస్ కె అహ్మద్ అందించిన 12 వేల 222 రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ ఆంతిరెడ్డి రాజిరెడ్డి, టీపిసిసి డెలిగేట్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంగాశంకర్, బోధన్ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, సహకార సంఘం చైర్మన్ రాజారెడ్డి, విడిసి చైర్మన్ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మంద నాగరాజు, పోతరెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు మోహన్, గణేష్, రాజు, సావేందర్, నరేష్, మనోజ్, భరత్, మేడిరవి, కృష్ణ, విజయ్, ముజీబ్, దేవరాజ్, అనిల్ రెడ్డి, సన్నిత్ రెడ్డి, యోగేష్, ప్రసాద్, శేఖర్, నూర్ సతీష్, బీరుగొండ, రఫిక్, మహేష్, బన్ను, వికాస్ రెడ్డి, లింగారెడ్డి, ఎస్టిడి రాజు, ఫయాజ్, శీను, రాజు, అశోక్, హైదర్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# పక్కనోళ్ళ నీటిని మీరే వాడేస్తే.. వాళ్ళ పరిస్థితి ఏంటి?

**హైదరాబాద్ (జనంసాక్షి) :**

**మోటార్లను వాడుతున్న వారిపై ఎండీ అశోక్ రెడ్డి ఆగ్రహం**

**పలు హాస్టల్ లు, నివాసాల నుంచి మోటార్లు సీజ్ చేసిన అధికారులు**

జలమండలి సరఫరా చేసే నీటిని అక్రమంగా మోటార్లతో తోడుతున్న వారిపై జలమండలి చేపట్టిన డ్రైవ్ పై ఎండీ అశోక్ రెడ్డి దృష్టి సారించారు. మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్ ప్రారంభించిన రెండో రోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించారు. జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ 6, ఎస్ ఆర్ నగర్ లోని మధురానగర్ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఎస్ఆర్ నగర్, మధురానగర్ లో ముఖ్యంగా హాస్టళ్లు, వాణిజ్య సముదాయాలు ఉన్న ప్రాంతంలో లో-ప్రెషర్ తలెత్తుతున్న ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. కొందమంది వినియోగదారుల ఇండ్లలో అక్రమంగా మోటార్లు వినియోగిస్తూ పట్టుబడగా వారి మోటార్లను సీజ్ చేసి పెనాల్టీ విధించారు. ఈ నేపథ్యంలో ఎండీ అశోక్ రెడ్డి ఓ హాస్టల్ ప్రాంగణంలోకి వెళ్ళగా.. ఆ యజమాని తన నల్లాకు వ్యవసాయానికి వినియోగించే 2 హెచ్ పి మోటర్ తో నీటిని తోడడంతో యజమానిపై ఆగ్రహం వెలిబుచ్చారు. పది ఇళ్లకు సరిపడా నీటిని నువ్వు ఒక్కడే వాడితే మిగతా వాళ్ళకి ఏమైపోవాలి ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి తప్పు చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే ఆ హాస్టల్ కు నెలవరకు నీటిని నిలిపివేసి, ట్యాంకర్ సైతం బుక్ చెయ్యకుండా బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఇదే ప్రాంతంలో మరో భవనానికి సైతం వ్యవసాయ మోటార్ వాడుతూ పట్టుపడగా కనెక్షన్ తొలగించి, నెలవరకు ట్యాంకర్ కూడా సరఫరా నిలిపివేయమని ఎండీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి సివిఓ గ్యానేందర్ రెడ్డి, సిఐ లక్ష్మారెడ్డి, జీఎం హరి శంకర్, డీజీఎంలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అదనపు తూకం వేయరాదు

**కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్**

**సైదాపూర్, ఏప్రిల్ 16 (జనంసాక్షి)**



:సైదాపూర్ మండలం సోమారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరి ధాన్యాన్ని తేమ శాతాన్ని చూసి ధాన్యాన్ని తూకం వేయాలన్నారు. రైతులకు రుణమాఫీ రైతు భరోసా ఉచిత కరెంటు క్వింటాల్కు 500 రూపాయలు బోనస్ గా దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. రైతులు వడ్లను దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. సోమారం గ్రామానికి మొదటిసారి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం పట్ల గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణ ప్రతి బిడ్డ సన్న బియ్యం తింటున్నారు




**భీమదేవరపల్లి, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :**

**ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం**

**నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లు 3500 మంజూరయ్యాయి : మంత్రి**

హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కేంద్రంలో బుధవారం సిరిగిరి మమతా రాజు ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజా చేశారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి ద్వారా 60 శాతం సబ్సిడీతో మొదటిసారి జిల్లాలో సంచార చేపల విక్రయ వాహనాన్ని,ఐకేపీ కేంద్రం ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పోన్నం ప్రభాకర్,కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించారు. అనంతరం భీమదేవరపల్లి మండలానికి సంబంధించిన 16 కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పోన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసుకున్నాం , ఇందిరా మహిళా శక్తి ద్వారా చేపల వాహనాన్ని ప్రారంభించుకున్నాం. పోయిన సారి సన్న వడ్లకు పేమెంట్ పూర్తి అయింది. సన్న వడ్లు కు ఈసారి కూడా 500 బోనస్ ఇస్తున్నామన్నారు.

బయట అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మాలి. ఉగాది నుండి దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించాం. భీమదేవరపల్లిలో సన్న బియ్యం బోజనాలు చేద్దాం అనుకున్నా. తెలంగాణ ప్రతి బిడ్డ సన్న బియ్యం తింటున్నారు. నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య,ఆర్డిఓ రమేష్ రాథోడ్,నయాబ్ తాసిల్దార్ సూర్యం, ఆర్ ఐలు శ్రీధర్,రాజు, మండల అధ్యక్షులు చిట్టెంపెల్లి ఐలయ్య, కొత్తకొండ దేవస్థానం చైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా,ఏపిఎం దేవానంద్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ కొలుగూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం లబ్ధిదారులతో సహపంక్తి భోజనం చేసిన మంత్రి జూపల్లి



**ఆర్మూర్, ఏప్రిల్ 16 ( జనం సాక్షి):**

ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారుడు లక్కారం తవ్వన్న, ఆయన ఉమ్మడి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావు సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారుడి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ అడిగారు.ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని, మీ లాంటి ఉమ్మడి కుటుంబాలను చూడటం, మీతో కలిసి భోజనం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి కుటుంబాల వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని,ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పేద,సామాన్య ప్రజల కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందని అన్నారు.గతంలో రేషన్ దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండగా వాటిని చాలామంది లబ్ధిదారులు తినేందుకు విముఖత చూపుతూ ఇతరులకు విక్రయించే వారని,

సన్న బియ్యం మార్కెట్‌లో కొనుక్కుని తినేవారన్నారు. ప్రభుత్వంపై భారం పడుతున్నా పేద సామాన్య ప్రజలు కడుపునిండా తినేందుకు

సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు,ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ రెడ్డి,బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి,ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ అహ్మద్, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, మాజీ కౌన్సిలర్లు రవి గౌడ్, ఆకుల రాము, కాశీరాం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆర్డీవో రాజా గౌడ్, ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 17 ఏప్రిల్ 2025

# రాజకీయానికి అడ్డాలుగా హెూటళ్ళు




పెబ్బేరు, ఏప్రిల్ 16 (జనం సాక్షి) : పెబ్బేరు పుర, మండల స్థాయి పరిధిలోని ప్రధాన రాజకీయాలకు హెూటల్లు అడ్డాలుగా మారాయి. రాజకీయాలు, ఇసుక మట్టి,,రేషన్ మాఫియా తదితర వాటికి అడ్డాలుగా చెప్పబడుతున్నాయి. పురపాలక కార్యాలయ పరిధిలోని టీ వరల్డ్, సిక్స్ పీఎం సమూసా చాయ్, అభిరుచి, మానస, రాగి పాలు తదితర వాటిల్లో రాజకీయాలు కొత్త పోకడం సాగిస్తున్నాయి. పార్టీలు ఒకటే అయినప్పటికీ వర్గాలుగా విడిపోయి ప్రధాన నాయకుల్లో ఐక్యతలో తేడాలు కనిపిస్తున్నాయి. ఇటీవల చోటు చేసుకుంటున్న రాజకీయాలు కొందరిలో అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. స్థానిక ఎన్నికలు ఆలస్యం కావడంతో కొంతమంది నాయకులు తనదైన శైలిలో రాజకీయాలను చాప కింద నీరులా వ్యవహరిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాల్సిన నాయకులే వర్గాలుగా విడిపోతూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని ప్రచారం నెలకొంది. వనపర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే తూడి మేగా రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు జెండా ఒకటే అయినప్పటికీ ఎజెండాలు వేర్వేరుగా ఉండడంతో వారిని నమ్ముకున్న నాయకులు ముందు ,వెనకకి అన్నచందంగా వాస్తవ పరిస్థితి కనిపిస్తుంది. నాయకులు పదవులు, పనులు,ప్రాబల్యం కోసమా తెలవదు కానీ వర్గాలుగా విడిపోతూ ఎవరికివారు వికసిస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాలలో వేదికల వద్ద అప్పటికప్పుడు కనిపిస్తున్న అది నిజం కాదని మరుసటి రోజు చాయ్ హెూటల్లో దర్శనమిస్తున్నారు. ఈ పోకడ ఇలాగే కొనసాగిస్తే రానున్న స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ నష్టపోవాల్సి వస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికైనా ఒంటెద్దు పోకడ నష్టాన్ని కలిగిస్తుందని ఐక్యంగా కలిసి ఉంటే బలం చేకూరుతుందని పార్టీని అభిమానించే కార్యకర్తలు బహిరంగంగా పేర్కొంటున్నారు.

### రిజర్వేషన్లపై సందిగ్ధత..?

గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కొనసాగిన రిజర్వేషన్లు ఈ ఏడాది మారే అవకాశం ఉందని ప్రభుత్వం ప్రకటించింది. కులగణన, ఎస్సీ వర్గీకరణ జరగడంతో కులాల ప్రాధాన్యత బట్టి రిజర్వేషన్లు ప్రకటిస్తారని తెలుస్తుంది. స్థానిక సంస్థలు ఎంపిటిసి సర్పంచ్, ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. అదే బాటలో మున్సిపల్ ఎన్నికలు కూడా నిర్వహిస్తారని తెలుస్తుంది. ఏది ఏమైనా రానున్న కొద్ది రోజుల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించడం తథ్యం అని విశ్లేషకులు భావిస్తున్నారు.

# వరిధాన్యం ఇక్కడ..కొనుగోలు కేంద్రాలు ఎక్కడ..?



శివ్వంపేట, ఏప్రిల్ 16 (జనంసాక్షి) : భూగర్భజల బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతాంగానికి కంటిమీద కునుకు లేకుండా పోసే కొద్దిపాటి నీరును మడిమడికి మళ్లించి, ఆరుగాలం ఎండలో కష్టపడి, పంట ఎండిపోకుండా కాపాడుకొని, పంట పండిస్తే, ధాన్యాన్ని కొనే నాథుడు లేక అన్నదాతలు ఆగమాగం అవుతున్నారు. ప్రభుత్వం గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని గొప్పలు చెబుతున్నప్పటికీ అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. సరైన సమయంలో పంట చేతికి వచ్చాక ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత కూడా ఐకెపి గానీ, సొసైటీ గాని ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు పండించిన ధాన్యాన్ని, ప్రైవేట్ దళారులకు అమ్ముకుంటున్నారు. శివంపేట మండల వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాలలో గత 20 రోజులుగా వరి కోతలు జరుగుతున్నాయి. వరి కోతలు అయిపోవడానికి వస్తున్న తారుణంలో ధాన్యం ఆరబెట్టిన రైతులు, కల్లాల వద్ద ఎక్కడ కాలి జాగా దొరికితే అక్కడ వారి యొక్క ధాన్యాన్ని ఆరబెట్టి ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే కొనుగోలు కేంద్రాలలో వారి యొక్క ధాన్యాన్ని విక్రయించడానికి వేలాది మంది రైతులు ఎదురుచూస్తున్నారు. గ్రామాలలో రైతులందరూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేసి వడ్లను తీసుకోవాలని విజ్ఞప్తులు చేస్తున్న, అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఎవరైన రైతులు అధికారులకు ఫోన్ చేసి అడిగిన, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కోసం పైనుంచి తమకు ఆదేశాలు రాలేదని తప్పించుకు తిరుగుతున్నారని రైతులు చెప్పారు. ఎన్ని రోజులు ధాన్యపు రాశుల వద్ద, కల్లాల వద్ద కొనుగోళ్ల కోసం ఎదురు చూడాలని అన్నదాతల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి, కిందిస్థాయి అధికారులకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు.

# ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ రియల్ ఎస్టేట్ దందాపై గవర్నర్‌కు ఫిర్యాదు

- గవర్నర్ ఆదేశాలతో విచారణ హాజరైన డివిజనల్ పంచాయతీ అధికారి కనకదుర్గ

మహబూబాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 16 (జనంసాక్షి) : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గిరిజన ఏజెన్సీ గ్రామమైన గూడూరులో 1/70 చట్టం పరిధిలో గల గతకొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రియల్ ఎస్టేట్ మరియు బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టారని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, బానోతు చందు నాయక్ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కు గత సంవత్సరం(2024) నవంబర్ లో పిర్యాదు చేయగా ఏజెన్సీ ప్రాంతా చట్టాల రక్షణ కొరకు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ సింగ్ కుమార్ ను విచారణకు ఆదేశాలు జరిచేయగా, జిల్లా కలెక్టర్ డివిజనల్ పంచాయతీ అధికారి (డిఎల్పిఒ) కనకదుర్గ ను విచారణకు ఆదేశించారు. గూడూరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో బుధవారం డిఎల్పిఒ విచారణ చేపట్టగా గూడూరు మండల కేంద్రంలో గిరిజనేతరులు ఎలాంటి పర్మిషన్లు లేకుండా ఏజెన్సీ 1/70 పేసా చట్టాలను ఉల్లంఘించి బహుళ అంతస్తులు, గృహ నిర్మాణాలు చేయుచున్నారని అసైన్డ్ ల్యాండ్ కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ దందాలు చేస్తున్నారని షెడ్యూల్ ఏరియాస్ లో భూమి మార్పిడి నిబంధన, ల్యాండ్ ట్రాన్స్ఫర్ రెగ్యులేషన్ 1/59 చట్టం మరియు ఏజెన్సీ 1/70 పేసా చట్టన్ని కాలరాస్తూ ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ



ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించి ఏజెన్సీ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ గిరిజనేతరుల అక్రమ కట్టడాలు, బహుళ అంతస్తులు, ఇలాంటి ప్రభుత్వ అనుమతులు లేని ఫంక్షన్ హాల్ నిర్మాణాలు, చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్న సందర్భంగా మహబూబాద్ జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారి (డిఎల్పిఒ) విచారణకు హాజరై బహుళ అంతస్తుల నిర్మాణం, భూ అక్రమణా దారులతో గూడూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారుడు ఎల్.హెచ్.పి.ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, బానోత్ చందు నాయక్ మాట్లాడుతూ కొంత మంది గిరిజన గిరిజనేతర వ్యక్తులు గ్రామపంచాయతీ నుండి గృహ నిర్మాణలకు ఏలాంటి పర్మిషన్ లేకుండా నకిలీ ధ్రువపత్రాలు, నకిలీ సర్టిఫికెట్స్ సృష్టించి అక్రమ నిర్మాణలు గావించినారు, నకిలీ ధ్రువపత్రంతో ప్రభుత్వ మరియు ప్రైవేటు బ్యాంకులను మోసం చేసి లోన్ల కొరకు తప్పుడు సర్టిఫికెట్ పెట్టినారని వారు అన్నారు. గూడూరు మండల కేంద్రంలో ఏజెన్సీ ప్రాంతంలో పట్ట భూమి పేరుతో ప్రభుత్వ అసైన్డ్ భూములను గ్రామపంచాయతీ నాలా పర్మిషన్ లేకుండా గ్రామపంచాయతీలకు గ్రీన్ ల్యాండ్ ఇవ్వకుండా భూ కబ్జా కురులు కోట్లాది రూపాయల భూములను అమ్ముకుంటూ వాటిలో తమపట్టా భూములని ఇండ్ల నిర్మాణాల కొరకు వెంచర్లు ఏర్పాటు చేసి భూములను అమ్ముకొనుటకు కొత్త ఉపాయాలు చేపడుతున్నారని వారు ఆరోపించారు. గూడూరు ఏజెన్సీ ప్రాంతంలో వన్ బై సెవెంటీ పైసా చట్టాన్ని ఉల్లంఘించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది గిరిజన చట్టాలను తుంగలోతొక్కి గ్రామపంచాయతీ పర్మిషన్ లేకుండా బహుళ అంతస్తులు ప్రభుత్వ అసైన్ భూములలో అక్రమ రియల్ ఎస్టేట్ చేస్తూ భూ అక్రమాలకు పాల్పడుతున్నారని వారిపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో రాష్ట్ర గవర్నర్ కు పిర్యాదు చేయడం జరిగిందని గిరిజనేతరుల కబంధహస్తాల్లో నలుగుతున్న గిరిజన చట్టాలను పరిరక్షించాలని రాష్ట్ర గవర్నర్‌ను కొరనని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ భూదందాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని గిరిజన చట్టాలను కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి, ఎం.సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శులు అశోక్ దివాకర్ భీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కులాంతర వివాహ ప్రోత్సాహక బహుమతిని అందజేసిన జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్



గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 16 (జనం సాక్షి) : కులాంతర వివాహం చేసుకున్న జంటకు బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని తన ఛాంబర్ నందు ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతిని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ మంజూరు చేయడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. గద్వాల పట్టణానికి చెందిన టి.యం. మౌనిక వైఫ్ ఆఫ్ కె.రమేష్ ఎస్సీ కులాంతర వివాహం చేసుకున్నందుకు, ప్రభుత్వ కల్పించిన పథకం ద్వారా 2,50,000 ప్రోత్సాహక బహుమతిని మంజూరైనట్టు తెలిపారు. ఈ మొత్తాన్ని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో జంటకు బాండ్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సరోజ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎంల దగ్గర భద్రత పటిష్టంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్



గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 16 (జనం సాక్షి) : ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఈవీఎం లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ను జిల్లా కలెక్టర్ సంతోష్ బుధవారం సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనఖిలో భాగంగా కలెక్టర్ ఈ తనిఖీ నిర్వహించారు.గద్వాల జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తో పాటు భద్రత నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, సురేష్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి




కోదాడ, ఏప్రిల్ 16 (జనంసాక్షి) : ప్రజలను చైతన్యం చేసేందుకే పోలీస్ ప్రజా భరోసా లక్ష్యమని కోదాడ రూరల్ సీఐ రజిత రెడ్డి అన్నారు.సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రంలో బుధవారం రాత్రి స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమానికి సీఐ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు అన్నారు.నేరాల్లో చిక్కుకుంటే యువత భవిష్యత్తులో ఉద్యోగాలు పొందడంలో, విదేశాలకు వెళ్లడం, పైచదువుల విషయంలో సమస్యలు వస్తాయని చెప్పారు...సామాజిక అంశాలు చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో నష్టపోతే తక్షణం 1930లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అనంతగిరి ఎస్సై నవీన్ కుమార్, కోదాడ రూరల్ ఎస్సై అనిల్ రెడ్డి, ఏఎస్ఐ లింగారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భూభారతి చట్టంపై మండల కేంద్రాల్లో సదస్సులు

- విద్యకు బడ్జెట్లో పెద్ద మొత్తంలో నిధుల కేటాయింపు
- ప్రభుత్వ పాఠశాల సందర్శనలో ఎమ్మెల్యే జారె



చంద్రుగొండ, ఏప్రిల్ 16 (జనం సాక్షి) : భూభారతి చట్టంతో రైతులకు మేలు కలుగుతుందని అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆది నారాయణ పేర్కొన్నారు. బుధవారం చంద్రుగొండ మండలంలో ఇందిరా బడిబాట కార్యక్రమంలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలలను కలియ చుట్టి పనులను పరిశీలించారు. మండల పరిధిలోని 16 ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి 83 లక్షల 55 వేల రూపాయలతో మౌలిక వసతుల కల్పన చేపట్టగా వాటిని పరిశీలించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు బడ్జెట్లో అధిక మొత్తంలో నిధులు కేటాయించి విద్యార్థులను ఉన్నత స్థితిలోకి తీసుకురావాలనే ప్రధాన లక్ష్యంతో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టిందన్నారు. అశ్వరావుపేట నియోజకవర్గంలోని ఐదు మండలాలను అమ్మ ఆదర్శ పాఠశాలలో నిధులు కేటాయించి పనులు నిర్వహించగా వాటిని పరిశీలించి ఇంకా అవసరమైన చోట మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. భూభారతి చట్టంతో రైతులకు మేలు కలుగుతుందని ఆ చట్టాన్ని అందరికీ తెలియజేయాలనే ఉద్దేశంతో మండల కేంద్రాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కార్యక్రమం అన్ని గ్రామాలలో ప్రారంభమైందని అర్హులైన పేదలను గుర్తించి వారి పేర్లను పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శిస్తామన్నారు. సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా అందిస్తుండడంతో దళారులకు ఆట కట్టించినట్టైందని సన్న బియ్యం పంపిణీ వరంగా మారిందన్నారు. ఈ కార్యక్రమాలలో తహసిల్దార్ సంధ్యారాణి ఎంపీడీవో బయ్యారపు అశోక్ ఎంఈఓ ఎం.సత్యనారాయణ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దారం గోవిందరెడ్డి భోజ్య నాయక్ పొన్నెబోయిన బిక్షమయ్య నల్లమోతు వెంకటరమణ బొర్రా సురేష్ ఫజల్ భక్ష్ సారేపల్లి శేఖర్ బడుగు కృష్ణవేణి బోయిన భోగి కోటేశ్వరరావు సయ్యద్ రసూల్ కిరణ్ రెడ్డి మహేష్ సుంద్రు విజయ్ ధరావత్ రామారావు రెడ్డి పోగు సురేష్ ఆలకుంట రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# పాతూర్ గ్రామపంచాయతీ రహదరిపై ప్రమాదకర మూలములపు

- ఏపుగా ఎదిగిన పిచ్చి మొక్కలు
- ప్రమాదాలు జరుగుతే అధికారి బాధ్యులు.?
- పట్టించుకోని సంబంధిత అధికారి



ఆళ్లపల్లి, ఏప్రిల్ 16 (జనంసాక్షి) : మండల పరిధిలోని పాతూర్ గ్రామపంచాయతీ శివారులోని ప్రధాన రహదారిపై పిచ్చి మొక్కలు ఎపుగా ఎదిగాయి. అవెన్యూ ప్లాంటేషన్ లో భాగంగా నాటిన మొక్కలు కనీసం 3 నుండి 5 మీటర్ల దూరంలో ఉన్నాయి. ఖాళీ భాగంలో పిచ్చి మొక్కలు ఎపుగా ఎదగడంతో మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనపడకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. మండల కేంద్రానికి ,జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి కాబట్టి నిత్యం వాహనదారులు నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. కానీ అధికారులు నిమ్మకు నేరెత్తినట్లు వ్యవహరించడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా ఎదగడం వల్ల రహదారి వెంట చెత్తాచెదారం ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారి స్పందించి సమస్య పరిష్కరించే విధంగా చూడాలని కోరుతున్నారు.

# వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

కౌడిపల్లి, ఏప్రిల్ 16 (జనంసాక్షి) : మండల కేంద్రమైన కౌడిపల్లిలో సంక్షేమ పాఠశాలలు వసతి గృహాలు పరిశుభ్రతకు నిలయాలుగా మారాలని క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన, పరిశుభ్రతతో కూడిన నూతన మెనూ పగడ్బందీగా అమలు కావాలని దీనికి విరుద్ధంగా ఎవరు ప్రవర్తించిన ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మెదక్ జిల్లా కౌడిపల్లిలోని సమీకృత బాలికల వసతిగృహాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో ఉన్న 105 ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలు వసతి గృహాల్లో శుభ్రతలో రాజీ పడకుండా నాణ్యతతో కూడిన నూతన మెనూ పగడ్బందీగా అమలవుతుందని, కౌడిపల్లి బాలికల వసతి గృహంలో మొన్న జరిగిన సంఘటన పై స్పందించడం జరిగిందన్నారు.



అస్వస్థతకు గురైన బాలికలను వసతి గృహంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు చికిత్సలు అందించడం జరిగిందని వివరించారు. ఎవరికి ఎటువంటి అపాయం లేదని అన్నారు.ఈ సంఘటనపై కలెక్టర్ స్వయంగా వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడటం జరిగింది ప్రస్తుత సౌకర్యాల పట్ల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ స్వయంగా మొబైల్ నెంబర్ విద్యార్థినిలకు అందించి ఎటువంటి సమస్య ఉన్న తనకు కాల్ చేయాలని చెప్పడం జరిగింది. జిల్లాలో ఇకముందు సంక్షేమ పాఠశాలలు వసతిగృహాల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేటట్లు వార్డెన్లకు ఆదేశించడం జరిగిందన్నారు విద్యార్థినిలు అస్వస్థత సంఘటనపై దర్యాప్తు ముమ్మరం చేయడం జరిగిందని నివేదికల ఆధారంగా బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజాసేవ కర్తవ్యంగా ఉద్యోగులు తమ విధుల పట్ల చిత్తశుద్ధితో పనిచేసి పిల్లలకు ఉన్నత విలువలతో కూడిన విద్యా బోధన, అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# బోయింగ్‌పై చైనా నిర్ణయం భారత్‌కు లాభమేనా..?

బోయింగ్ విమానాల డెలివరీలను స్వీకరించకూడదంటూ తమ దేశ సంస్థలను చైనా ఆదేశించడం భారత్‌కు కలిసొచ్చేలా ఉంది. ఇప్పటికే పంపిణీ వ్యవస్థల్లోని ఇబ్బందుల వల్ల భారత్‌లోని వైమానిక రంగ సంస్థలు విమానాల కొరతతో ఇబ్బందిపడుతున్న వేళ.. బీజింగ్ నిర్ణయం సరికొత్త ఆశలు రేపుతోంది. ప్రస్తుతం చైనా సంస్థలు 100 బోయింగ్ బీ737 మ్యాక్స్ విమానాల డెలివరీల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇదే మోడల్‌ను భారత్‌కు చెందిన ఎయిర్ ఇండియా, ఆకాశ్ ఎయిర్ సంస్థలు ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చాయి. వీటితోపాటు 11 బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్లను కూడా ఎయిర్ ఇండియా ఇప్పటికే ఆర్డర్ పెట్టింది. ఈనేపథ్యంలో చైనాకు డెలివరీకి సిద్ధమైన వాటిల్లో కొన్ని విమానాలు భారత్‌లోని కస్టమర్లకు మళ్లించవచ్చని వైమానిక రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతేడాది కూడా బోయింగ్ విషయంలో ఇలానే జరిగింది. ఒకరికని తయారుచేసిన రెండు విమానాలను చివరికి ఎయిర్ ఇండియా, ఆకాశ్‌లకు డెలివరీ చేయాల్సి వచ్చిందన్నారు.ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ మొత్తం గతేడాది 25 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలను కొనుగోలు చేసింది. మరో 25 విమానాల కోసం షెడ్యూల్ చేసింది. తాజాగా అమెరికా–చైనా ట్రేడ్ వార్ నేపథ్యంలో అదనపు డెలివరీలను భారతీయ సంస్థలు పొందే అవకాశం ఉంది. ఇక ఇప్పటికే చైనా కోసం మ్యాక్స్ విమానాలను ఉత్పత్తి చేసేందుకు సియాటెల్‌లో అసెంబ్లీ యూనిట్‌లో ఏర్పాటుచేసిన అదనపు సామర్థ్యం మొత్తం నిరుపయోగంగా మిగిలిపోనుంది. ఈనేపథ్యంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ్ సంస్థలు చైనా కోసం తయారుచేసిన విమానాలను లేదా.. ఈ సంస్థలు ప్రత్యేకంగా ఆర్డర్ చేసిన లోహవిహంగాలను అందుకోనున్నాయి.మరోవైపు బోయింగ్‌కు ప్రత్యర్థి అయిన ఎయిర్‌బస్ సంస్థ రెండు అసెంబ్లింగ్ లైన్లను నిర్వహిస్తోంది. వీటిల్లో ఏ320 రకాలను నిర్మిస్తోంది. ఈ నేపథ్యంలో తమకు విమానాల డెలివరీలను పెంచాలని బీజింగ్ ఈ సంస్థను కోరనుంది. ఇంతకాలం బోయింగ్ విమానాల డెలివరీల్లో జాప్యం ఆకాశ్ ఎయిర్‌పై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. ఆ సంస్థ ప్రస్తుతం, తమ సమీప భవిష్యత్తు అవసరాలకు మించి పైలట్లను నియమించుకొంది. దీంతో కొంతమేరకు సిబ్బందికి పని లేకుండా పోతోంది. ఇక ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ్ సంస్థలకు అదనపు విమానాలను కొనుగోలు చేయగల ఆర్థిక సామర్థ్యం ఉంది.





# కృత్రిమ మేధను నియంత్రించగలమా?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టెక్నాలజీలు వేగంగా అభివృద్ధి చెందుతున్నందున ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు వీటి నైతికత, భద్రత, సృజనాత్మక పరిధి, ఆర్థిక వృద్ధిని ఎలా సమతుల్యం చేయాలో తర్జనభర్జన పడుతున్నాయి. ఇప్పటివరకు కొన్ని దేశాల్లోనే ఏఐ గవర్నెన్స్‌కు సంబంధించిన స్పష్టమైన విధానాలున్నాయి. సామాజిక భద్రత, మానవ హక్కులు, ఆర్థిక శ్రేయస్సుకు ప్రాధాన్యమిస్తూ కృత్రిమ మేధను నియంత్రించడానికి ఖచ్చితమైన చట్టాలను అమలు చేస్తున్నాయి. ఇంకొన్ని దేశాలు వ్యూహాత్మక విధాన ఫ్రేమ్‌వర్క్‌లతో ముసాయిదా చట్టాన్ని అభివృద్ధి చేస్తున్నాయి. చైనా ఏఐ అల్గారిథమ్‌ల్లో పారదర్శకత, డేటా గోప్యత, ఎథికల్ ఏఐ విధానాలను అమలు చేయడంపై దృష్టి సారించే నిబంధనలను ప్రవేశపెడుతుంది. ముఖ్యంగా జనరేటివ్ ఏఐ, అటానమస్ సిస్టమ్స్ వంటి రంగాల్లో ఈమేరకు చర్యలు తీసుకుంటోంది. యూరోపియన్ యూనియన్(ఈయూ) ఇప్పటికే ఏఐ చట్టాన్ని అమలు చేస్తుంది. సామాజిక భద్రత, పారదర్శకత, జవాబుదారీతనాన్ని నిర్ధారించే లక్ష్యంతో హైరిస్క్ అప్లికేషన్లపై కఠినమైన నిబంధనలను విధిస్తుంది. కెనడాకు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా యాక్ట్ (ఏఐడీఏ) బాధ్యతాయుతమైన ఏఐ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తుంది. దక్షిణ కొరియా నైతిక కృత్రిమ మేధ కోసం మార్గదర్శకాలను అమలు చేస్తుంది. కృత్రిమ మేధ భద్రత, జవాబుదారీతనాన్ని నియంత్రించడానికి చట్టాన్ని అభివృద్ధి చేస్తోంది. పెరూ ప్రభుత్వ సేవల్లో నైతిక ఏఐ వినియోగాన్ని ప్రోత్సహించడానికి, పౌరుల హక్కులను పరిరక్షించడానికి నిబంధనలు ప్రవేశపెట్టింది. అమెరికా కృత్రిమ మేధ విధానంలో మాత్రం మార్పు వచ్చింది. బాధ్యతాయుతమైన ఏఐ అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చేలా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2025లో రద్దు చేశారు. యునైటెడ్ కింగ్‌డమ్, జపాన్, బ్రెజిల్, కోస్టారికా, కొలంబియాతో సహా అనేక దేశాలు తమ చట్టసభలలో ఆమోదం కోసం కృత్రిమ మేధ బిల్లులను రూపొందించాయి. సమ్మిళిత, సుస్థిర వృద్ధిని నిర్ధారించేందుకు, సామాజిక ఆర్థిక ప్రగతిని నడిపించడానికి ఏఐ వినియోగంపట్ల దేశాల ధోరణి ఎలా ఉందనేది నేషనల్ ఏఐ స్ట్రాటజీ డాక్యుమెంట్లు తెలియజేస్తాయి. ప్రస్తుతానికి అధికారిక చట్టాలు పరిమితంగా ఉన్నప్పటికీ ఏఐ పాలనకు మరింత విస్తృతమైన విధానాలు తీసుకువచ్చేందుకు ఈ డాక్యుమెంట్లు తోడ్పడుతాయి. ఆఫ్రికన్ యూనియన్‌తో పాటు సుమారు 85 దేశాలు ఇలాంటి వ్యూహాలను ప్రచురించాయని నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ పత్రాల్లో ప్రధానంగా కింది విషయాలు పొందుపరిచారని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్, డెవలప్‌మెంట్, మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించడం. హెల్త్ కేర్, ఎడ్యుకేషన్, ట్రాన్స్‌పోర్ట్ వంటి రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఏకీకృతం చేయడానికి కాలపరిమితి, ప్రాధాన్యాలను నిర్దేశించడం. నిష్పాక్షికత, పారదర్శకత, జవాబుదారీతనం వంటి బాధ్యతాయుతమైన ఏఐ అభివృద్ధికి మార్గనిర్దేశం చేయడానికి సూత్రాలను ఏర్పాటు చేయడం. ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు పౌరులను సిద్ధం చేయడానికి కావాల్సిన విద్యను ప్రోత్సహించడం. ఏఐ భద్రత, ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి భాగస్వామ్యాలు తోడ్పాటు అందించడం.

## ప్రతి నెలా కొత్త బీమా ప్లాన్

చెన్నై: కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతి నెలా ఒక కొత్త బీమా ఉత్పత్తిని ఆవిష్కరించే ప్రణాళికతో ఉన్నట్టు 'గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్' ఎండీ, సీఈవో జి.శ్రీనివాసన్ తెలిపారు. కస్టమర్ల భిన్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని వీటిని తీసుకురానున్నట్టు చెప్పారు. అదే మాదిరి ఎస్ఎంఈ, ఎంఎస్ఎంఈ ఉద్యోగులకు ప్రత్యేక ప్లాన్లపైనా దృష్టి సారించినట్టు ప్రకటించారు. స్టాండలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ అయిన గెలాక్సీకి ఫ్యామిలీ టీవీఎస్ వేణు శ్రీనివాసన్‌తోపాటు, హెల్త్ ఇన్సూరెన్స్ రంగం వెటరన్, స్టార్ హెల్త్ వ్యవస్థాపకుడు వి.జగన్నాథన్ సహ ప్రమోటర్లుగా ఉన్నారు. 'ఏదైనా భిన్నంగా చేయాలన్న లక్ష్యంతో ఈ రెండు కుటుంబాలు కలసి గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్‌ను ఏర్పాటు చేశాయి. కస్టమర్లకు కచ్చితంగా వినూత్నమైన, సమగ్రమైన పరిష్కారాలతో ఉత్పత్తులను తీసుకొస్తాం' అని జి.శ్రీనివాసన్ తెలిపారు. కస్టమర్ క్లెయిమ్ దరఖాస్తును వేగంగా పరిష్కరించడంతోపాటు పూర్తి మొత్తాన్ని చెల్లించే విధంగా మెరుగైన సేవలు అందిస్తామన్నారు. రానున్న సంవత్సరాల్లో పెద్ద కంపెనీగా అవతరిస్తామని ప్రకటించారు. ఆరంభంలో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కువ దృష్టి పెడతామని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్ల ప్రీమియం ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్టు శ్రీనివాసన్ తెలిపారు. ప్రస్తుతం 60 ప్రాంతాల్లో కంపెనీకి కార్యాలయాలు ఉంటే, వీటిని 100కు పెంచుకోనున్నట్టు చెప్పారు. 90 శాతం వ్యాపారం రిటైల్ కస్టమర్ల నుంచి, మిగిలిన 10 శాతం కార్పొరేట్ క్లయింట్ల నుంచి ఉంటుందన్నారు. రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామన్నారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.00 | ₹ 4.02 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 88,150 (22 క్యారెట్లు) | ₹ 96,170 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,10,000

## రైలులో ఏటీఎం.. కొత్త సర్వీసు

రైల్లో ప్రయాణికులకు లిక్విడ్ క్యాష్ అవసరాలు తీర్చేందుకు, బ్యాంకింగ్ సర్వీసులు మరింత చేరువ చేసేందుకు వీలుగా ప్రముఖ బ్యాంకులు కొత్త సేవలు ప్రారంభిస్తున్నాయి. వైవిధ్యంగా ఆలోచించి రైలు ప్రయాణికులకు నేరుగా రైల్లోనే ఏటీఎం సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నాయి. నాసిక్‌లోని మన్మాడ్–ముంబై మధ్య నడిచే పంచవటి ఎక్స్‌ప్రెస్ ఏసీ బోగీలో ఇటీవల దేశంలోని మొదటి ఏటీఎం ట్రయల్‌రన్ నిర్వహించారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర భుసావల్ డివిజన్ సహకారంతో ఈ ఏటీఎంను ఏర్పాటు చేశారు.రైలు ప్రయాణంలో కొన్నిసార్లు సిగ్నల్ లేకపోవడం సహజం. దాంతో మన్మాడ్–ముంబై మధ్య ఇగత్పురి, కసారా సమీపంలోని కొన్ని సొరంగాల కారణంగా సిగ్నల్‌లో అవాంతరం చోటుచేసుకుందని ట్రయల్‌రన్‌లో గమనించినట్లు అధికారులు తెలిపారు. అది మినహా ట్రెయిల్ పరీక్ష సజావుగా సాగిందని రైల్వే సిబ్బంది పేర్కొన్నారు. ఈ సందర్భంగా భుసావల్ డీఆర్ఎం పాండే మాట్లాడుతూ..'ప్రజలు ఇప్పుడు కదిలే రైలులో నగదు ఉపసంహరించుకోవచ్చు. ఏటీఎం పనితీరును పర్యవేక్షిస్తున్నాం. రైలులోని మొత్తం 22 బోగీలను వెస్టిబుల్స్(రెండు బోగీల మధ్య ప్రయాణించేందుకు వీలైన మార్గం) ద్వారా అనుసంధానం చేశాం. దాంతో ప్రయాణికులు ఏటీఎంను సులభంగా చేరుకోవచ్చు' అని చెప్పారు. ప్రయాణికుడు సంజయ్ ఝా మాట్లాడుతూ 'ఈ ఏటీఎం ద్వారా అన్ని సేవలు నిర్వహించుకోవచ్చు. డబ్బును ఉపసంహరించుకోవచ్చు. చెక్ బుక్‌లను ఆర్డర్ చేయవచ్చు. స్టేట్‌మెంట్లను పొందవచ్చు. ప్రయాణ సమయంలో ఈ సర్వీసు చాలా తోడ్పడుతుంది' అన్నారు.



## పసిడి 'మోత'

### భారీగా పెరిగిన బంగారం ధరలు

### 10 గ్రాములకు రూ.98,100కు చేరిక

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రపంచవ్యాప్తంగాచోటు–చేసుకుంటున్న వాణిజ్య మార్పులు భారత మార్కెట్‌పై భారీ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఈ క్రమంలోనే దేశ రాజ ధాని ఢిల్లీలో బుధవారం 24 క్యారెట్ల బంగారం ధరలు రూ.1,650 పెరిగి 10 గ్రాములకు రూ.98,100కు చేరాయి. ఇదే సమయంలో 99.5 శాతం స్వచ్ఛత కలి గిన బంగారం ధర కూడా రూ.1,650 పెరిగి రూ. 97,650 స్థాయికి చేరుకుంది. ఈ ధరలు ప్రస్తుతం ఆల్ –టైం గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. అమెరికా–చైనా వాణిజ్య సంబంధాల్లో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అనేక మంది కూడా సురక్షితమైన బంగారం పెట్టు–బడులపైన ఫోకస్ చేస్తున్నారు.



# అమెరికా సుంకాల దెబ్బకు చైనా దీటుగా..

### తొలి త్రైమాసికంలో చైనా ఆర్థిక వృద్ధి 5.4 శాతం నమోదు

**జనంసాక్షి:** అమెరికా–చైనాల మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రమవుతోంది. ఇరుపక్షాలు టారిఫ్‌లతో విరుచుకుపడుతున్నాయి. అయితే.. అమెరికా కొత్త సుంకాల వేళ తమ ఆర్థికవృద్ధి మెరుగ్గానే ఉందని చైనా ప్రకటించింది. మొదటి త్రైమాసికంలో తమ ఆర్థిక వ్యవస్థ అంచనా వేసిన 5.4 శాతం వృద్ధిని నమోదు చేసిందని వెల్లడించింది. అగ్రరాజ్యం కొత్త సుంకాలను విధించకముందే ఎగుమతిదారులు వస్తు సరఫరాలను పెంచడంతో ఇది సాధ్యమైందని పేర్కొంది. ''ప్రాథమిక అంచనాల ప్రకారం.. మొదటి త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి స్థిర ధరల వద్ద 5.4 శాతం పెరిగింది'' అని బీజింగ్ నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ వెల్లడించింది. అంతకుముందు ఏఎఫ్‌పీ అంచనా వేసిన 5.1 శాతం కంటే ఇది ఎక్కువకావడం గమనార్హం. పారిశ్రామిక ఉత్పత్తి కూడా తొలి త్రైమాసికంలో 6.5 శాతం పెరిగింది. ఇది 2024 చివరి మూడు నెలల్లో 5.7 శాతంగా ఉంది. ఇక కీలకమైన రిటైల్ అమ్మకాలు గత ఏడా దితో పోల్చితే 4.5 శాతం పెరిగినట్లు ఎన్‌బీఎస్ వెల్లడించింది. అయితే.. ప్రపంచ ఆర్థిక వాతావరణం మరింత సంక్లిష్టంగా, తీవ్రంగా మారుతోందని.. వృద్ధిని పెంచడం అవసరమని బీజింగ్ పేర్కొంది. అమెరికా–చైనాల మధ్య టారిఫ్‌ల యుద్ధం తీవ్రమ వుతున్న విషయం తెలిసిందే. ట్రంప్ ఇటీవల పలు దేశాలపై పరస్పర సుంకాలు ప్రకటించారు. ఈ ప్రకటన అనంతరం యూఎస్‌తో వాణిజ్యఒప్పందం కుదుర్చుకునేందుకు కొన్ని దేశాలు సిద్ధమయ్యాయి. దీంతో ప్రతిఘటించని దేశాలకు టారిఫ్‌ల నుంచి 90 రోజుల విరామం కల్పించారు. అయితే, చైనా మాత్రం అందుకు విరుద్ధంగా అమెరికా వస్తువులపై సుంకాల శాతాన్ని పెంచుకుంటూ వచ్చింది. దీంతో చైనా వస్తువులపై ట్రంప్ 145 శాతం సుంకం విధించగా.. డ్రాగన్ కూడా అగ్రరాజ్యం వస్తువులపై 125 శాతం సుంకాలు విధించింది. దీంతో ఇరుదేశాల మధ్య ట్రేడ్ వార్ మొదలైంది. మరోవైపు ఇరు దేశాలు భారీగా పరస్పర సుంకాలు ప్రకటించుకున్న నేపథ్యంలో తమ దేశంలోని అరుదైన ఖనిజాలు కీలకమైన లోహాలు, అయస్కాంతాలను యూఎస్‌కు ఎగుమతి చేయడం కూడా చైనా నిలిపివేసింది. ఈక్రమంలో వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలకు రావాల్సింది చైనానే అని, తమకు ఆ అవసరం లేదని ఆమె పేర్కొన్నారు.



### అమెరికా వీసా రద్దు కేసు..

## భారత విద్యార్థికి తప్పిన బహిష్కరణ ముప్పు

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తోన్న కఠిన వలస విధానాలు అమెరికాలో నివసిస్తోన్న విదేశీయుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. కొన్నిసార్లు తమ వీసాలు రద్దయిన సంగతి కూడా విద్యార్థులకు తెలియని పరిస్థితి నెలకొంది. ఈతరహాలో ఒక భారతీయ విద్యార్థి వీసా రద్దు కాగా.. అతడికి ఫెడరల్ కోర్టు నుంచి ఊరట లభించింది. 21 ఏళ్ల భారతీయ విద్యార్థి క్రిష్‌లాల్ ఐసరదాసానీ.. విస్కాన్సిన్–మాడిసన్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. వచ్చే నెలలో తన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకోనున్నాడు. ఇలాంటి సమయంలో ఏప్రిల్ 4న అతడి ఎఫ్–1 విద్యార్థి వీసా రద్దయింది. స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్స్ ప్రోగ్రామ్ డేటాబేస్‌లో వివరాలు తొలగించారు. దాంతో క్రిష్‌లాల్ స్థానిక న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ''ఈ తొలగింపునకు ముందు అతడికి ఎలాంటి హెచ్చరిక చేయలేదు. వివరణ ఇవ్వడానికి కానీ, ఒకవేళ తప్పు చేసి ఉంటే దానిని సరిదిద్దుకోవడానికి కానీ ఎలాంటి అవకాశం ఇవ్వలేదు'' అని విచారణ సందర్భంగా బాధితుడి న్యాయవాది కోర్టుకు వివరించారు.




### రామగిరి హెలిప్యాడ్ ఘటన..

## విచారణకు హాజరైన పైలట్, కోపైలట్



**చెన్నేకొత్తపల్లి:** ఈ నెల 8న శ్రీసత్య సాయి జిల్లా రామగిరి మండలం పాపి రెడ్డిపల్లిలో జగన్ పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ వద్ద జరిగిన పరిణామాలపై పోలీసుల విచా రణకు పైలట్, కోపైల ట్‌లు హాజరయ్యారు. ఆ పర్యటనకు చిప్సాన్ ఏవియేషన్‌కు చెందిన హెలికాప్టర్‌ను జగన్ విని యోగించారు. దీంతో ఆ సంస్థ పైలట్ అనిల్‌కుమార్, కోపై లట్ శ్రేయజ్ జైన్‌ను విచారణకు రావాల్సిందిగా పోలీసులు మంగళవారం నోటీసులు ఇచ్చారు. దీంతో నేడు వారు విచా రణకు హాజరయ్యారు. చెన్నేకొత్తపల్లి సీఐ కార్యాలయంలో పోలీసులు వారిని విచారిస్తున్నారు. ఆరోజు జరిగిన పరిణామాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.శ్రీసత్యసాయి జిల్లా పాపిరెడ్డిపల్లిలో హత్యకు గురైన వైకాపా కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ ఇటీవల గ్రామానికి వచ్చారు. వైకాపా ఆధ్వర్యంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడ దిగిన వెంటనే వైకాపా శ్రేణులు బారికేడ్లను తోసుకుని జగన్‌ను చుట్టుముట్టాయి. ఈ సందర్భంగా హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతిందని, ప్రభుత్వం, పోలీసుల భద్రతా వైఫల్యంతోనే జరిగిందని వైకాపా నాయకులు ఆరోపించారు. తమ అధినేత హెలికాప్టర్‌లో వెళ్లే పరిస్థితి లేక రోడ్డుమార్గాన వెళ్లారని చెప్పారు. దీంతో హెలిప్యాడ్ వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై నిగ్గు తేల్చేందుకు పోలీసులు పైలట్, కో పైలట్లకు కర్ణాటక రాష్ట్రం జక్కూరులోని నిర్వహణ సంస్థకు నోటీసులు అందజేశారు. వ్యక్తిగతంగా చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు రావాలని వాటిలో పేర్కొన్నారు.

## ఖర్చులు భర్తిస్తాం.. వెంటనే వెళ్లిపోండి..

### స్వీయబహిష్కరణ చేసుకోవాలనుకునే శరణార్థులకు ట్రంప్ ఆఫర్


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినదగ్గరి నుంచి వలసల విషయంలో దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో అక్రమంగా ఉంటూ స్వీయబహిష్కరణ చేసుకోవాలనుకునే వారికి ట్రంప్ ఒక ప్రత్యేకమైన ఆఫర్‌ను ప్రకటించారు. అలాంటివారికి విమాన ఖర్చులతో పాటు కొంత నగదు అందిస్తామని పేర్కొన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.ప్రస్తుతం దేశంలో చట్టవిరుద్ధంగా ఉంటూ నేరాలకు పాల్పడుతున్నవారిపై ఇమిగ్రేషన్ అధికారులు దృష్టిసారించారన్నారు. అయితే, చట్టవిరుద్ధంగా ఉంటున్న సాధారణ పౌరుల కోసం స్వీయబహిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలా వెళ్లాలనుకునేవారికి తాము విమాన ఖర్చులతో పాటు కొంత నగదును అందిస్తామని ప్రకటించారు. వెళ్లిపోయినవారిలో మంచివారు ఉంటే వారిని వెనక్కి తీసుకోవడం పైనా ట్రంప్ మాట్లాడారు. దేశం నుంచి అక్రమ వలసదారులను వెళ్లగొట్టడమే తమ ప్రథమ లక్ష్యమని ఆయన ఈసందర్భంగా స్పష్టంచేశారు. అయితే, సముచితమని భావిస్తే వారు చట్టపద్ధతిలో వెనక్కి తిరిగిరావడానికి అనుమతిస్తామన్నారు. అధికారం చేపట్టినప్పటి నుంచి అక్రమ వలసదారులపై ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తున్నారు. కఠిన నిర్ణయాలతో వారిని దేశం నుంచి సాగనంపే ప్రక్రియను వేగవంతం చేశారు. దీంతో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది.

### టిక్‌టాక్ వల్లే యుద్ధంలో

## పాల్గొన్న చైనా పౌరుడు

### చైనా దేశస్థుడిని మీడియా ముందుకు తీసుకొస్తున్న దృశ్యం

**జనంసాక్షి:** రష్యా సైనికులతో కలిసి పోరాటం చేస్తున్న ఇద్దరు చైనా పౌరులను తమ దళాలు అదుపులోకి తీసుకున్నాయని ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా మాస్కో సైన్యంలోకి తాను ఎలా వచ్చాననే విషయాన్ని చైనా పౌరుడు వాంగ్ గ్వాంగ్జున్ వెల్లడించాడు. తనకు సులభమైన ఉద్యోగంతో పాటు మంచి జీతం ఇస్తానని ఆశ చూపించి సైన్యంలోకి తీసుకున్నట్లు తెలిపాడు. విలేకరుల సమావేశంలో అతడు ఈ విషయాలను వెల్లడించాడు. 'చైనాకు చెందిన నేను అక్కడి పునరావాస కేంద్రంలో థెరపిస్ట్‌గా పనిచేశా. ఉద్యోగం కోల్పోయిన తర్వాత సామాజిక మాధ్యమాల్లో ఎక్కువగా గడిపా. ఆ సమయంలో ఉక్రెయిన్‌తో పోరాడుతున్న రష్యా సైనికుల గురించి వీడియోలు ఎక్కువగా టిక్‌టాక్‌లో ప్రత్యక్షమయ్యేవి. మాస్కో సైనికులు కనిపించిన తీరు చూసి మోసపోయాను. ఆ దేశానికి చెందిన రిక్రూటర్ సైన్యంలో మంచి ఉద్యోగంతో పాటు నెలకు 2వేల నుంచి 3వేల డాలర్ల వరకు (భారత కరెన్సీలో రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పైగా) జీతం ఇస్తానని ఆశ చూపించాడు. అది నిజమేనని నమ్మి మాస్కోకు వెళ్లగా.. మొత్తం తలకిందులైంది. నా బ్యాంకు కార్డు, ఫోన్‌ను వారు స్వాధీనం చేసుకొని సైనిక శిక్షణా శిబిరానికి పంపారు. శిక్షణ తర్వాత సరిహద్దుకు తరలించారు. ఫిబ్రవరి చివరిలో ఉక్రెయిన్‌లోని దొనెట్స్క్ ప్రాంతానికి మార్చారు' అని వాంగ్ పేర్కొన్నాడు. ఇక, వాంగ్‌తో పాటు కీవ్ దళాలు బంధించిన మరో వ్యక్తి జాంగ్ రెన్బో. తాను సైతం ఇలాగే మోసపోయి సైన్యంలోకి వచ్చినట్లు తెలిపాడు.



రష్యాకు మద్దతుగా ఉత్తరకొరియా సైనికులు పోరాడుతున్నారని గతంలో కీవ్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే దొనెట్స్క్ ప్రాంతంలో రష్యా సైనికులతో కలిసి పోరాటం చేస్తున్న ఇద్దరు చైనీయులను తమ దళాలు అదుపులోకి తీసుకున్నాయని ఇటీవల జెలెన్‌స్కీ పేర్కొన్నారు. వారి వ్యక్తిగత డేటా, బ్యాంకు కార్డులు సహా ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తమ దళాలు మొత్తం ఆరుగురు చైనీయులతో పోరాడగా.. ఇద్దరిని బంధించారన్నారు. రష్యా సైన్యంలో చైనీయులు మరింతమంది ఉన్నారనే సమాచారం తమవద్ద ఉందన్నారు. అయితే, ఈ ఆరోపణలను చైనా అప్పుడే ఖండించింది. ఉక్రెయిన్ సంక్షోభాన్ని రాజకీయంగా పరిష్కరించడానికి తాము నిర్మాణాత్మక పాత్రను పోషిస్తున్నామని ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ తెలిపారు. ఘర్షణాత్మక ప్రాంతాలకు దూరంగా ఉండాలని, సాయుధ ఘర్షణల్లో ఏ రూపంలోనూ జోక్యం చేసుకూడదని.. సైనిక ఆపరేషన్లలో పాల్గొనవద్దని ఈసందర్భంగా చైనీయులను కోరారు.

## సింగపూర్‌లో వచ్చే నెలలో ఎన్నికలు

సింగపూర్: సింగపూర్ పార్లమెంటుకు మే 3న ఎన్నికలు జరగనున్నాయి. ప్రపంచం అస్థిరంగా, అనిశ్చితంగా తయారవుతున్న వేళ పార్లమెంటు ఎన్నికలు జరపబోతున్నామని సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్ మంగళవారం పేర్కొన్నారు. ఆయన పార్టీ పీపుల్స్ యాక్షన్ పార్టీ సింగపూర్‌కు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఆ ద్వీపదేశాన్ని పాలిస్తోంది. ఈసారి వాంగ్ పార్టీ 30 మంది కొత్త అభ్యర్థులను ప్రకటించవచ్చు. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతున్న వేళ సింగపూర్‌కు భవిష్యత్తుపై ఆందోళన పట్టుకుంది. సింగపూర్ జనాభాలో అత్యధికులు చైనా సంతతివారే.

## సోవియట్ సైనికులపై గ్రహాంతరవాసుల దాడి

### అమెరికా సీఐఏ ఫైల్ వైరల్



సోవియట్ సైనికులపై ఉక్రెయిన్‌లో గ్రహాంతరవాసులు దాడి చేశారట..! ఈ విషయాన్ని అమెరికా నిఘా సంస్థ సీఐఏ బహిర్గతం చేసిన ఫైల్స్‌లో ప్రస్తావించారు. ప్రస్తుతం ఈ విషయం వైరల్‌గా మారింది. ఈ పత్రాలను వాస్తవానికి 2000 సంవత్సరంలోనే డీ క్లాసిఫైడ్ చేశారు. దీనిని కెనడా వార పత్రిక వీక్లీ న్యూస్, ఉక్రెయిన్ పేపర్ హోలోస్ ఉక్రెయినీ రిపోర్ట్ చేశాయి. నాటినుంచి ఈ కథనం గుర్తుతెలియని ఎగిరే వస్తువులను(యూఎఫ్‌వో) వెతికే వారి మధ్య ఓ పాపులర్ విషయంగా మిగిలిపోయింది. 'జోరోగన్ ఎక్స్‌పీరియన్స్' పాడ్ కాస్ట్‌లో కూడా దీనిని ప్రస్తావించారు. సోవియట్‌కు చెందిన ఓ ప్లాటూన్ దళం సాసర్ ఆకారంలో ఎగురుతున్న వస్తువుపై కాల్పులు జరిపింది. దీంతో అందులోని గ్రహాంతరవాసులు ఎదురుదాడి చేసినట్లు సీఐఏ పేపర్‌లో పేర్కొంది. ఈ దాడిలో 23 మంది సైనికులు అక్కడినుంచి పారిపోవడానికి ముందే బిగుసుకుపోయారట. కొందరి రక్తం గడ్డ కట్టుకుపోయినట్లు కూడా గుర్తించినట్లు ఆ పత్రాల్లో ఉంది. 1991లో సోవియట్ కుప్పకూలిన తర్వాత దీనికి సంబంధించిన 250 పేజీల కేజీబీ రిపోర్టును సీఐఏ సంపాదించింది. దీనికి సంబంధించిన ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, చిత్రాలు అందులో ఉన్నట్లు 'న్యూయార్క్ పోస్ట్ పత్రిక' కథనం ప్రచురించింది. సీఐఏ వద్ద ఉన్న భారీ కలెక్షన్ ఫ్రీడమ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ యాక్ట్ ఎలక్ట్రానిక్ రీడింగ్ రూమ్‌లో అందుబాటులో ఉన్నట్లు ఆ పత్రిక పేర్కొంది. ''సోవియట్ సైనిక బృందం ఉక్రెయిన్‌లో శిక్షణ కార్యక్రమంలో ఉండగా.. చాలా తక్కువ ఎత్తులో ఎగురుతున్న సాసర్ వంటి భారీ వాహనాన్ని చూసింది. ఆ సమయంలో ఓ సైనికుడు క్షిపణిని ప్రయోగించగా.. అది దానిని తాకడంతో క్రాష్‌ల్యాండ్ అయింది. అందులో నుంచి పొట్టిగా ఉన్న ఆకారాలు బయటకు దిగాయి.. వాటికి పెద్ద కళ్లు, పొడవైన చేతులు ఉన్నాయి'' అని ఆ రిపోర్టు పేర్కొంది. వారు తీవ్రమైన కాంతి, వెలుగుతో ఉన్న పరికరంతో ఎదురుదాడి చేసినట్లు ఆ నివేదిక తెలిపింది. ఇక అక్కడ దొరికిన శకలాలను కేజీబీ ఏజెంట్లు ఓ రహస్య ప్రదేశానికి తరలించారు. వారికి గుర్తుతెలియని వెలుగు ఒకటి అక్కడి సైనికులను బిగుసుకుపోయేలా చేసినట్లు గుర్తించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
17 ఏప్రిల్ 2025

# అత్తాకోడళ్లం కలిసే ఉన్నాం

**పాలకుర్తిని విడిచిపెట్టి ఎక్కడి వెళ్లం**

**ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి**

పాలకుర్తి, ఏప్రిల్ 16(జనంసాక్షి)



నిత్యం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో తలమునకలై ఉన్నామని, ఇద్దరం ఎలాంటి గొడవలు లేకుండా కలిసే ఉన్నామని, కాంగ్రెస్ పార్టీ జోలికి వస్తే బీఆర్ఎస్ నాయకులను తరిమికొడుతామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఘాటుగా విమర్శించారు. బుధవారం మండల కేంద్రం లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ హాయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయలను సంపాదించిన మాజీ మంత్రి దయాకర్ రావు అమెరికాలో పెట్టుబడి పెట్టారని పేర్కొన్నారు. దయాకర్ రావు అనుచరులు కొంత మంది అత్త, కోడళ్ల మద్య గొడవలు వచ్చాయని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఇక నుంచి సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్లో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కోవర్టులు ఎవరో వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడవాళ్లమే కానీ అడ పులులమని ఇక నుంచి మా కుటుంబం జోలికి వస్తే ఉరికిస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచింది ఇక్కడి నుంచి పారిపోవడానికి కాదని, అభివృద్ధి చేయడానికేనని వచ్చామని స్పష్టం చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలిపించి అడపులుల తడఖా చూపిస్తామని అన్నారు. తాము పాలకుర్తిని విడిచి పోయే ప్రసక్తిలేదని ప్రతిపక్ష పార్టీలను వేటాడుతామని అన్నారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల అభివృద్ధికి రీ ఎస్టిమేషన్ చేసి రూ. 1015 కోట్లు నిధులు మంజూరి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు రిజార్వయర్లను నిర్మించి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గం లో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేస్తామన్నారు. నిరంతర విద్యుత్ అందించేందుకు తొర్రూరు, ముత్తారం, మల్లంపల్లి, చిన్నమడూరు గ్రామంలో రూ.130 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరి చేసినట్లు తెలిపారు. తొర్రూరులో వంద పడకలకు, పాలకుర్తిలో ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకలకు అప్గ్రేడ్ చేసి టెండర్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్పర్సన్ లావుడ్య మంజుల, నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, నెమురుగొమ్ముల ప్రవీణ్ రావు, ఎర్రబెల్లి రాఘవరావు, వీరమనేని యాకాంతరావు, బిల్లా సుధీర్రెడ్డి, చిలువేరు కృష్ణమూర్తి, హమ్య నాయక్, ముత్తినేని సోమేశ్వర్రావు, అందే యాకయ్య, సురేష్ నాయక్, రాజేష్ నాయక్, బొమ్మగాని భాస్కర్, గాదపాక భాస్కర్, ఎండి, మదర్, గుగ్గిళ్ళ ఆదినారాయణ, ఉన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి



**సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):

యువతకు చాలా భవిష్యత్ ఉందని, మత్తుకు బానిస కావద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ నందు నార్కోటిక్ కో ఆర్డినేషన్ సెంటర్ పై జిల్లా ఎస్పి నరసింహాతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను విద్యాసంస్థలు ఎక్కువగా ఉన్న సూర్యాపేట, కోదాడలో యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అనుమానం ఉన్న ప్రదేశాలలో సిసి కెమెరాలు, లైట్స్, పెట్రోలింగ్ జరపాలని తెలిపారు. డ్రగ్స్ నుండి బయట పడేందుకు డి అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకి ప్రతిపాదనలు పంపటం జరిగిందని తెలిపారు. ఇండస్ట్రీయల్ ఉన్న ప్రదేశాలలో వేరే రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికుల ఉన్న చోట కమ్యూనిటీ మీటింగ్ లను నిర్వహించాలని అధికారులకి సూచించారు. విద్యాశాఖ, పోలీస్ శాఖ వారు యువత డ్రగ్స్ నుండి దూరంగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలు అమలు చేయాలని, అలాగే జిల్లా యువత చెడు వ్యసనాలకి, డ్రగ్స్ కి బానిస అవ్వకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు.

జిల్లా ఎస్పి నరసింహ మాట్లాడుతూ 2024లో 139 మందిని, 2025లో 23 మందిని గంజాయి తరలిస్తుండగా అరెస్ట్ చేయటం జరిగిందని తెలిపారు. గంజాయి నేడు గ్రామాలకు విస్తరించి యువత చెడిపోతున్నారని, చివరికి చిన్న పిల్లలకి చాక్లెట్ రూపంలో మత్తు పదార్థాలు అలవాటు చేస్తున్నారని అన్నారు. జిల్లాలో ప్రహరీ క్లబ్స్, యాంటీ డ్రగ్స్ కమిటీలు డ్రగ్స్ నుండి జిల్లాకి విముక్తి కల్పించేందుకు కృషి చేయాలని తెలిపారు. ప్రతి బుధవారం అధికారులు డ్రగ్ నిర్మూలనకు సంబందించిన పోస్ట్ లను వాట్సాప్ స్టేటస్, డిపిలుగా పెట్టుకోవాలని తెలిపారు. తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో వారిచే రూపొందిన పోస్టర్ ని విడుదల చేశారు. ఈ సమావేశంలో యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ డిఎస్పి బిక్షపతి రావు, డిటిఓ సురేష్ కుమార్, డిఈఓ అశోక్, డిఐఈఓ భాను నాయక్, డ్రగ్స్ ఇన్స్ పెక్టర్ సురేందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస రాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధరణి పోర్టల్‌కు భూమాత పోర్టల్‌కు చాలా తేడా

**నూతన చట్టంలో మరో 14 అంశాలను చేర్చిన ప్రభుత్వం**

**పూర్తి వివరాలను సేకరించిన అనంతరమే రిజిస్ట్రేషన్లు**

ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 16(జనంసాక్షి) :

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన భూమాత పోర్టల్ కు గతంలోని ధరణి పోర్టల్ కు చాలా తేడా ఉందని, భూముల విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలగవద్దని ఉద్దేశంతో ప్రభుత్వం మరో 14 అంశాలను పొందుపరిచిందని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టం, దాని పద్ధతులు అనే రెండు అంశాలను ప్రభుత్వం ఆధారంగా తీసుకొని భూమాతను ఏర్పాటు చేయడం జరిగిందని, భూముల విషయంలో ఎలాంటి సమస్యలు ఏర్పడిన సంవత్సర కాలంలో పరిష్కరించుకోవడానికి అవకాశం కల్పించిందని వివరించారు. భూ సమస్యలపై గతంలో కోర్టులను ఆశ్రయించే వారని నేడు కోర్టులను ఆశ్రయించకుండానే షెడ్యూల్ (ఏ) ను ఏర్పాటు చేసి భూమి విలువ 5 లక్షల లోపు ఉన్నపక్షంలో ఆర్డీవో స్థాయి, 5 లక్షలకు పైగా ఉన్న పక్షంలో కలెక్టర్ స్థాయి అధికారులు సమస్యను పరిష్కరించడానికి అవకాశం కల్పించారని తెలిపారు. భూమి విషయంలో దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఆరోజు నుండి సంవత్సరకాలం లోపు సమస్యను పరిష్కరించడం జరుగుతుందని, కలెక్టర్ స్థాయిలో సమస్య పరిష్కారం కాని పక్షంలో సీసీఎల్ఏ కు ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్ బోర్డు భూములను ఎవరైనా ఆక్రమించి పట్టాలు చేసుకున్న పక్షంలో కేసులను నమోదు చేయడం జరుగుతుందని, గుడ్డిగా రిజిస్ట్రేషన్ చేసే అవకాశాలు ఏ మాత్రం ఉండవని అన్నారు. ప్రస్తుతం మండల తహసీల్దార్లు, సబ్ రిజిస్టర్ అధికారులు రిజిస్ట్రేషన్



ప్రక్రియను కొనసాగిస్తు న్నారని, ఇకనుండి చేసే రిజిస్ట్రేషన్ లను అన్ని పరిశీలించిన అనంతరమే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముగిస్తారని తెలిపారు. జిల్లాలో వెంకటాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని ఆ మండలంలోని అన్ని గ్రామాలలో రెవిన్యూ సదస్సులు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని, మే ఒకటి నుండి 31 వరకు పరిశీలన చేసిన అనంతరం జూన్ 2వ తేదీన పట్టాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా లోని మిగతా మండల కేంద్రాల్లో అవగహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఒక గ్రామ పరిధిలోని భూముల వివరాలు పూర్తిగా తహసిల్దార్, ఆర్డీఓ, కలెక్టరేట్, ఖజానా కార్యాలయంలో పొందుపరచడం జరుగుతుందని, జమాబంధు తరహాలో భూమాత పోర్టల్ కొనసాగుతుందని అన్నారు. అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ తెలిపారు.

# భూమి కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తాం

**వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**

వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 16(జనంసాక్షి):



జిల్లా కలెక్టర్ లో సంగెం మండలం తిమ్మాపూర్ , గీసుకొండ మండలం మచ్చాపూర్ గ్రామాల్లో నేషనల్ గ్రీన్ హై వే నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులతో ఏర్పాటు చేసిన ఆర్బిటేషన్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని భూమి కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా రియల్ చేపడతామని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ హైవే నిర్మాణం వలన వరంగల్ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని భవిషత్ లో హైద్రాబాదు రాజధాని తర్వాత రెండో రాజధానిలా వరంగల్లు ను చూడవచ్చని జిల్లా కలెక్టర్ అన్నారు. నేషనల్ హైవే ఆక్ట్ అనుసరించి రైతులకు న్యాయం చేయుటకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సత్యపాల్ రెడ్డి, సంగెం తాసిల్దార్ రాజ్ కుమార్, గీసుకొండ తహసిల్దార్ రియాజ్ ఉద్దీన్ లు, సంబంధిత గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పేదవాడి కడుపు నింపేందుకు సన్నబియ్యం

**శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి**

వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 16 (జనంసాక్షి)



: వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలో దౌడు సంపత్ రాజకుమారి, సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో జిల్లా కలెక్టర్ సత్య శారద అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి భోజనం చేశారు. బుధవారం ఇంటి యజమానులు వీరి ఆతిథ్యానికి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టి సాధారణ కుటుంబం కూడా సన్న బియ్యని రోజువారీ ఆహారంగా తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోగలుగుతున్నామని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ అని దీవిస్తూదంపతులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా చీర ను బహుమానంగా సమర్పించగా, ఎమ్మెల్యే ఇంటి ఆడపడుచులకు కట్నం పెడుతూ పెద్దన్నల వారి కష్ట సుఖాలలో పాలుపంచు కుంటానని వారు అన్నారు.

అనంతరం లబ్ధిదారులకు ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ

ఈ కార్యక్రమంలో గీసుకొండ తహసిల్దార్ రియాజుద్దీన్ డిఎం సివిల్ సప్లై సంధ్యారాణి ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమ కార్మికుడి ఆత్మహత్య

చౌటుప్పల్, ఏప్రిల్ 16(జనం సాక్షి):



దివీస్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గన్నవరం మండలం బుద్దవరం గ్రామానికి చెందిన పందేటి చలపతిరావు (38) దివీస్ పరిశ్రమలో హెల్పర్‌గా పనిచేస్తూ గత 20 సంవత్సరాల నుండి చౌటుప్పల్ లో తన భార్య పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. గత కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్థాపానికి గురైన చలపతిరావు మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ఉరివేసుకొని చనిపోయినాడు. మృతుడి తండ్రి వీరరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# సీఎం సహాయ నిధి-పేదలకు పెన్నిధి



కడ్తాల్ ఏప్రిల్ 16(జనంసాక్షి):

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు పెన్నిదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్,33 మంది లబ్ధిదారులకు రూ,14.5 లక్షల విలువైన చెక్కులను బుధవారం మైసిగండి ఎంఆర్ జి గార్డెన్ లో కడ్తాల్ మండల నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హత ఆధారంగా సీఎం సహాయ నిధులను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు ఆయిల్ శ్రీనివాస్ గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ యాటగీత నరసింహ్మా ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిచ్య నాయక్,తాజా మాజీ ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు అభిమానులు,పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యంపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

బోధన్, ఏప్రిల్ 16 ( జనంసాక్షి )

వరి ధాన్యం కొనుగోలు విషయంలో బోధన్ సొసైటీ అధికారుల నిర్లక్ష్యం పై బుధవారం బోధన్ తహసీల్దారు కు సిపిఐ (ఎం-ఎల్ )న్యూడెమోక్రసీ బోధన్ డివిజన్ కార్యదర్శి పి వరదయ్య ఆధ్వర్యంలో రైతులు వినతిపత్రం అందించారు. బోధన్ సొసైటీ పరిధిలో వరి ధాన్యం కొనుగోలులో సొసైటీ అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిపిఐ (ఎం-ఎల్ )న్యూడెమోక్రసీ పార్టీ బోధన్ డివిజన్ కార్యదర్శి పుట్ట వరదయ్య అన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు నెలరోజులు నుంచి వరి కోతలు కోసి ధాన్యాన్ని పంట పొలాల్లో ఆరబెట్టిన కొనుగోలు చేయడం లేదని ఆయన విమర్శించారు. సొసైటీ అధికారుల చుట్టూ రైతులు తిరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు.

ఆకాల వర్షాలకు పంట ఎక్కడ దెబ్బతింటోదనని రైతులు దిగులు చెందుతున్నారని వరదయ్య అన్నారు. లారీల కొరత, హమాలీల కోరత తీవ్రంగా ఉందని సొసైటీ అధికారులు సమస్య పరిష్కరించడంలో తగిన శ్రద్ధ చూపడంలేదన్నారు.

# గాంధీ కుటుంబంపై బిజెపి ప్రతీకార చర్య



**సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :

నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో చార్జ్ షీట్ లో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ల పేర్లు నమోదు చేసి బీజేపీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ.. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఇన్కమ్ టాక్స్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి లతో పాటు ఇతర ముఖ్య నేతలు హాజరై బిజెపి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ... ఈ దేశం కోసం దేశ స్వాతంత్రం కోసం తమ ఆస్తులను ప్రాణాలను త్యాగం చేసిన గాంధీ కుటుంబం పై బీజేపీ ప్రతికార చర్యలకు పాల్పడుతోందన్నారు. ఇప్పటికైనా తప్పును సరిదిద్దుకొని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లపై

బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని చార్జ్ షీట్ విషయంలో పున పరిశీలన చేసుకుని ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నా మని, బిజెపి తమ బుద్ధి మార్చుకోకపోతే మా నిరసన లను దేశవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ శాసనస భ్యులు ఆరేపల్లి మోహన్, వైద్యుల అంజన్ కుమార్, గడ్డం విలాస్ రెడ్డి, బానోతు శ్రవణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, సమద్ నవాబ్, మల్యాల సుజిత్ కుమార్, ఆకారపు భాస్కర్ రెడ్డి,పాల్గొన్నారు.

# దేవాలయాల్లో పారదర్శక సేవలు ఎలా అందిద్దాం



**దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష**

హైదరాబాద్ బ్యూరో (జనంసాక్షి)

: ఎండోమెంట్ డిపార్టుమెంట్ ఉన్నతాధికారులతో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం సెక్రటేరియట్ లోని తన ఛాంబర్ లో రివ్యూ సమావేశం నిర్వహించారు. దేవాదాయ శాఖలో దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న అంశాలపై సుదీర్ఘంగా చర్చ చేశారు. పలు కీలక అంశాలపై మంత్రి సమగ్ర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. దేవాదాయ శాఖ భూములు న్యాయ సంబంధిత వివాదాల్లో ఉన్న వాటి వివరాలు మంత్రి అడగ్గా... ఎండోమెంట్ శాఖ ఉన్నతాధికారులు వివరాలు అందజేశారు. కోర్టు కేసుల్లో ఉన్నవాటికి పరిష్కారం దిశగా ముందుకు వెళ్ళాలని మంత్రి ఆదేశించారు. ఇందుకు సంబంధించిన అంశంపై ఒక దఫా మీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లోని సేవలను డిజిటలైజ్ చేసేందుకు సంబంధించిన అంశాలపై అధికారుల నుంచి మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాంకేతికత ఉపయోగించుకోని దేవాలయాల్లో సేవలను పారదర్శకంగా

ఎలా చేయాలన్న దానిపై సుదీర్ఘంగా మంత్రి అధికారులను కసరత్తు చేయాలని ఆదేశం ఇచ్చారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, కమిషనర్ శ్రీధర్, అడిషనల్ కృష్ణవేణి తదితర ఉన్నాధికారులు పాల్గొన్నారు.

# షకీల్‌ను పరామర్శించిన కేటీఆర్

బోధన్, ఏప్రిల్ 16 ( జనంసాక్షి ) :



బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్, ఆయన సతీమణి ఆయేషా ఫాతీమాను బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. షకీల్ తల్లి షగుప్తా ఆదీబ్ మరణించిన విషయం తెలిసిందే. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ షకీల్ ఆమెర్ స్వగృహంలో షకీల్ ఆమెర్ దంపతులను పరామర్శించారు. కేటీఆర్ వెంట ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఉన్నారు.

# ఉద్యోగాలను ప్రకటించిన భారతీయ క్రికెట్ కంట్రోల్ బోర్డ్

న్యూఢిల్లీ (జనంసాక్షి) : భారతీయ క్రికెట్ కంట్రోల్ బోర్డ్ ఉద్యోగాలను ప్రకటించింది. బోర్డు బుధవారం ఖాళీల గురించి సమాచారం ఇచ్చింది. మహిళల టీమ్ ఇండియాకు ప్రధాన ఫిజియోథెరపిస్ట్, కోచ్ అవసరం. బిసిసిఐ ఖాళీలతోపాటు అర్హతలు, అనుభవం ఎంత ఉండాలి అనే వివరాలను కూడా స్పష్టంగా తెలిపింది. ఈ పదవుల్లో పని చేసే వ్యక్తులు ఆటగాళ్ల ప్రదర్శనను మెరుగుపరచడంలో సహాయపడతారు. అలాగే గాయాల తర్వాత వేగంగా కోలుకోవడానికి పనిచేస్తారు.భారతీయ క్రికెట్ కంట్రోల్ బోర్డ్ సీనియర్ మహిళల టీమ్ ఇండియా కోసం రెండు ప్రధాన పోస్టులు ఖాళీగా ఉన్నట్టు నోటిఫికేషన్ విడుదల చేసింది. మొదటి పదవి ప్రధాన ఫిజియోథెరపిస్ట్ కోసం అయితే, రెండోది కండిషనింగ్ కోచ్ కోసం. ఈ రెండు పదవుల్లో పనిచేసే వ్యక్తులు బెంగళూరులో ఉన్న బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పని చేస్తారు. ఫిజియో బాధ్యత ఆటగాళ్లు గాయపడిన తర్వాత ఎక్కువగా ఉంటుంది. ఆటగాళ్ల త్వరగా కోలుకొని మళ్లీ మ్యాచ్‌లు ఆడేలా సహాయపడాలి. దీని కోసం ప్రతిరోజూ సెషన్లు ఉంటాయి. స్పోర్ట్స్ లేదా మస్కులోస్కెలిటల్ ఫిజియోథెరపీ/స్పోర్ట్స్ అండ్ ఎక్సర్‌సైజ్ మెడిసిన్/స్పోర్ట్స్ రీహాబిలిటేషన్‌లో స్పెషలైజేషన్ ఉంటాలి. దీంతోపాటు ఈ ఫిజియో థెరపీ విభాగంలో పీజీ చేసి ఉండాలి. అలాగే ఫిజియోథెరపీలో కనీసం 10 సంవత్సరాల అనుభవం కూడా అవసరం అని బీసీసీఐ నోటిఫికేషన్‌లో పేర్కొంది. దరఖాస్తు చేసే ఫిజియోకు ఏదైనా జట్టు లేదా అథ్లెట్‌తో పనిచేసిన అనుభవం కూడా ఉండాలి అని చెప్పింది. స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ ఆటగాళ్ల కోసం వార్మ్‌అప్ షెడ్యూల్ చేస్తారు. అలాగే మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ చేయిస్తారు. వారు ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను కూడా చూసుకుంటారు. దీని కోసం ప్రత్యేక ప్రోగ్రామ్‌లను రూపొందించే బాధ్యత ఉంటుంది. ఈ పదవికి దరఖాస్తు చేసుకోవడానికి కనీసం 7 సంవత్సరాల అనుభవం అవసరం ఉంటుందని బీసీసీఐ తన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. అలాగే ఏదైనా జట్టు లేదా అథ్లెట్‌తో పనిచేసిన అనుభవం కూడా ఉండాలి. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఉన్న అనుభవం బట్టి జీతం ఇస్తారు. సాధారణంగా ఫిజియోథెరపిస్టులకు పది నుంచి 50 లక్షల వరకు జీతం ఉంటే ఛాన్స్ ఉంది. పురుషుల జట్టులో పని చేసేవాళ్లకు కోట్లలో ఇస్తారు. మహిళా జట్టుతో పని చేసే స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్‌కు కూడా పది నుంచి 30 లక్షల వరకు ఇస్తారని తెలుస్తోంది. పురుషుల జట్టు నుంచి లాభాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి అక్కడ పని చేసే స్టాఫ్‌కు ఎక్కువ జీతాలు చెల్లిస్తారు. మహిళా క్రికెట్ జట్టు ఇప్పుడిప్పుడో వృద్ధిలోకి వస్తున్నందున జీతాలు చెల్లింపు కూడా యావరేజ్‌గా ఉంటుంది. ఈ జీతాల గురించి మాత్రం తన నోటిఫికేషన్‌లో ఎలాంటి వివరాలు బీసీసీఐ ఇవ్వలేదు.

# సింగరేణి మెడికల్ అటెండెన్స్ రూల్స్ సవరించాలి

కోల్ ఇండియాలో సవరించిన మెడికల్ అటెండెన్స్ రూల్స్ సింగరేణిలో అమలు పరచాలని సింగరేణి ఉద్యోగులు మాజీ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గత సంవత్సరం డిసెంబర్ లో ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని రాయ్ పూర్ లో జరిగిన వేజ్ బోర్డ్ స్టాండర్డ్ డైజేషన్ కమిటీ లో జరిగిన ఒప్పందం మేరకు ప్రస్తుతం గుర్తించిన గుండె జబ్బు, క్షయ,క్యాన్సర్,కుష్టు,పక్షవాతం,మూత్ర పిండ జబ్బులు, ఎయిడ్స్, మెదడు సంబంధించిన వ్యాధులతో పాటు లివర్ సిర్రోసిస్ వ్యాధిని కూడా దీర్ఘకాలిక వ్యాధిగా గుర్తించారు. దీని వలన మెడికల్ బోర్డ్ నిర్ధారణ చేసేవరకు కార్మికుని మూల వేతనం,మారేడి కరువు భత్యం, ప్రత్యేక కరువు భత్యం లో యాభై శాతం చెల్లిస్తున్నారో లివర్ సిర్రోసిస్ వ్యాధికి కూడా ప్రత్యేక సెలవు తో కూడిన వేతనం చెల్లించవలసి వస్తుంది. సింగరేణి గనుల్లో పని చేసే కార్మికుల ఆహార అలవాట్లు, అధిక శ్రమ,ప్రకృతి విరుద్ధ పని స్థలాలు,అవిశ్రాంతి, నిద్ర, అలసట వలన ఈ లివర్ సిర్రోసిస్ వ్యాధి బారిన పడుతున్నారు. కావున సింగరేణి యాజమాన్యం లివర్ సిర్రోసిస్ వ్యాధిని దీర్ఘకాలిక వ్యాధిగా గుర్తించాలి. కార్మికులు,వారి కుటుంబ సభ్యులతో పాటు రిటైర్డ్ కార్మికుల సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డులో కూడా లివర్ సిర్రోసిస్ వ్యాధిని దీర్ఘకాలిక వ్యాధి జాబితాలో చేర్చి అపరిమిత వైద్య సౌకర్యం అందించాలని పని చేసే కార్మికులతో పాటు విశ్రాంత కార్మికులు వేడుకుంటున్నారు కావున సింగరేణి యాజమాన్యం వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలి.

**ఆళవందార్ వేణు మాధవ్,**
**ఉప ప్రధాన కార్యదర్శి,**
**సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్.**
**8686051752**

# లీగ్ చరిత్రలో పంజాబ్ రికార్డుల మోత



హైదరాబాద్ (జనంసాక్షి) : ఐపీఎల్లో పంజాబ్ కింగ్స్ మంగళవారం కమాల్ చేసింది. 111 పరుగులు చేసినా కూడా విజయం దక్కించుకుని ఔరా అనిపించింది. బంతికో పరుగు చేసిన ఇంకా 8 బంతులు మిగిలి ఉండే అతి చిన్న టార్గెట్ ను కూడా కాపాడుకుంది. ముఖ్యంగా చిన్న పాటి టార్గెట్ ను కాపాడుకోడానికి తన బౌలర్లను కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వాడుకున్న తీరు, వారిలో ఉత్సాహాన్ని నింపిన తీరు మాటలకందనిది. ఇదే జట్టు అంతకముందు సన్ రైజర్స్ తో జరిగిన మ్యాచ్ లో 245 పరుగుల టార్గెట్ ను కాపాడుకోలేక 8 వికెట్లతో ఓడిపోయింది. అయితే కోల్ కతా నైట్ రైడర్స్ పై మాత్రం తమ జూలు విదిల్చింది. కేవలం 111 పరుగులను డిఫెండ్ చేసుకుని లీగ్ చరిత్రలో ఈ ఘనత సాధించిన జట్టుగా నిలిచింది. అయితే ఆశ్చర్యకరంగా కేకేఆర్ పైనే మరో రికార్డును కూడా పంజాబ్ కలిగి ఉంది. ఐపీఎల్లోనే కాకుండా టీ20 చరిత్రలోనే అత్యధిక పరుగుల ఛేదన రికార్డు కూడా పంజాబ్ పేరిటే ఉంది. గతేడాది కేకేఆర్ పై 262 పరుగులను ఛేజ్ చేసి రికార్డుల్లోకి ఎక్కింది. ఈ మ్యాచ్ ను తలుచుకుంటే క్రికెట్ అభిమానులకు ఇప్పటికీ ఒళ్లు పులకరిస్తుంది. ఈ మ్యాచ్ కు ముందు కేవలం 8 మ్యాచ్ ల్లో రెండు విజయాలతో ఉన్న పంజాబ్.. కేకేఆర్ పై తన జూలు విదిల్చింది. ఈడెన్ గార్డెన్స్ లో జరిగిన ఈ మ్యాచ్ లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కేకేఆర్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 261 పరుగుల భారీ స్కోరు చేసింది. ఫిల్ సాల్ట్ (75), సునీల్ నరైన్ (71) ఆకాశమే హద్దుగా చెలరేగారు. మరొక జట్టైతే ఈ భారీ స్కోరును చూసి బెంబేలెత్తిపోయేది. అయిత విజయమో, వీర స్వర్గమో అన్నట్లుగా చెలరేగిన పంజాబ్.. మరో ఎనిమిది బంతులు మిగిలి ఉండగానే, 8 వికెట్లతో ఈ టార్గెట్ ను ఛేజ్ చేసింది. ముఖ్యంగా జానీ బెయిర్ స్టో (108) సెంచరీతో కదం తొక్కగా, ప్రభు సిమ్రాన్ (54), శశాంక్ సింగ్ (68) విరోచిత ఫిఫ్టీలతో జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు. ఇక తాజా సీజన్ కు వచ్చే సరికి మరో రకంగా కేకేఆర్ కు పంజాబ్ చుక్కలు చూపించింది. ఈ సీజన్ లో అంతంతమాత్రంగానే రాణించిన యుజ్వేంద్ర చాహల్.. ఈ మ్యాచ్ లో తన మాయను ప్రదర్శించాడు. గింగరాలు తిరిగే బంతులు వేసి, కేకేఆర్ కు చుక్కలు చూపించాడు. న్యూ చండీగఢ్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ కేవలం 15.3 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌటయ్యింది. ఓపెనర్ ప్రభు సిమ్రాన్ సింగ్ (15 బంతుల్లో 30, 2 ఫోర్లు, 3 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో హర్షిత్ రాణా మూడు వికెట్లతో రాణించాడు. ఇక ఛేజింగ్ లో డిఫెండింగ్ చాంపియన్ కేకేఆర్ 15.1 ఓవర్లలో 95 పరుగులకు కుప్పకూలింది. మిడిలార్డర్ బ్యాటర్ అంగ్ క్రిష్ రఘువంశీ (37) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. యజ్వేంద్ చాహల్ నాలుగు, మార్కో యన్సెన్ మూడు వికెట్లతో రాణించారు. ఇక గతేడాది పంజాబ్ చేతిలో ఓడిన కేకేఆర్ కి కెప్టెన్ గా శ్రేయస్ అయ్యర్ ఉండగా.. ఈ ఏడాది పంజాబ్ కెప్టెన్ గా శ్రేయస్ పగ్గాలు చేపట్టి, కేకేఆర్ పైనే మరుపురాని విక్టరీని సాధించడం కొసమెరుపు.

# పునరావాస కేంద్రాలకు 2 రోజుల్లో స్థలాన్ని కేటాయించాలి



మర్రిగూడ, ఏప్రిల్ 16(జనంసాక్షి) : మర్రిగూడ మండలంలోని శివన్నగూడ గ్రామంలో నిర్మిస్తున్న రిజర్వాయర్ కింద ముంపునకు గురయ్యే గ్రామాల స్థానంలో ఏర్పాటు చేయనున్న పునరావాస కేంద్రాలకు 2 రోజుల్లో స్థలాన్ని గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.బుధవారం చండూరు ఆర్డీవో కార్యాలయంలో చండూరు ఆర్డీవో శ్రీదేవి, దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి ,ఇతర అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా శివన్న గూడెం రిజర్వాయర్ కింద భూసేకరణ ,తదితర అంశాలను జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా శివన్నగూడెం రిజర్వాయర్ లో ముంపునకు గురవుతున్న చర్లగూడెం, వెంకేపల్లి ,వెంకేపల్లి తండాలు ముంపునకు గురవుతుండగా, వీటి స్థానంలో పునరావస కేంద్రాల నిర్మాణానికి సుమారు 80 ఎకరాల స్థలం అవసరం ఉన్నట్లుగా గుర్తించినట్లు రెవెన్యూ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ 2 రోజుల్లో స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు.తాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చండూర్ ఆర్డీవో కార్యాలయానికి ఇన్వర్టర్ ను మంజూరు చేశారు.

# మిషన్ భగీరథ నిర్వహణ వైఫల్యం

- నల్లాల ద్వారా నీళ్ళు సరఫరా చేయని ప్రభుత్వం
- మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం



హైదరాబాద్ (జనంసాక్షి) : ముందుచూపు లేమి, నిర్లక్ష్యంతో ప్రాజెక్టులో నీళ్ల ఒడిసిపట్టలేదని, చెరువులు నింపలేదని, భూగర్భ జలాలు పెంచలేదని, మిషన్ భగీరథ ద్వారా నీళ్ళు సరఫరా చేయడం లేదని ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఇంటింటికి నల్లాలు ఏర్పాటు చేసి తాగు నీళ్ళిస్తే, రేవంత్ కనీసం ఆ పథకాన్ని కొనసాగించలేక పోతున్నాడని ఆరోపించారు. ఉమ్మడి పాలన నాటి బిందెలు, డ్రమ్ములు మళ్ళా రోడ్లపై కనిపిస్తున్నాయని, తెలంగాణ ఆత్మగల్ల పాలకుడికి, తెలంగాణ ప్రయోజనాలు పట్టని పాపాత్ముడికి ఉన్న తేడా ఇది అని స్పష్టం చేశారు. 'ఇది కాలం తెచ్చిన కరువు కాదు, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కృత్రిమ కరువు, రేవంత్ పాలనా ఫైఫల్యం తెచ్చిన ప్రజల క‌న్నీటి' కరువు.ఇకనైనా, ముఖ్యమంత్రి, మంత్రులు అబద్దాల ప్రవాహాన్ని పారించడం మానేసి, ప్రజల ఇళ్లకు తాగు నీటిని పారించాలని సూచిస్తున్నాం' అని పేర్కొన్నారు.

# పూనకాలు లోడింగ్..

- సంచలనం రేపిన జనంసాక్షి కథనం
- సోషల్ మీడియాలో వైరల్
- మేయర్ తీరుపై సర్వత్రా విమర్శలు





ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి, (జనం సాక్షి) : ఖమ్మం కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ మార్క్ పాలన కార్పొరేషన్ లో కనిపించడం లేదంటూ జనం సాక్షి లో ప్రచురితమైన కథనం ఖమ్మంలో సంచలనం రేపింది. బుధవారం సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో రాజకీయ, పరిజ్ఞానం ఉన్న ఏ ఇద్దరు కలిసిన జనం సాక్షి కథనంపైనే చర్చ సాగింది. ఖమ్మంలో రాజకీయంగా మేయర్ కు ప్రత్యర్థి వర్గంగా ఉన్నవారు జనం సాక్షి రాసిన ప్రతి అక్షరం సత్యం అంటూ సన్నిహితుల దగ్గర వ్యాఖ్యానించారు. కథనం రాసిన ప్రతినిధికి ఫోన్ చేసి అభినందించారు. ఇంకా లోతుగా పరిశీలిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి అంటూ సలహాలు ఇచ్చారు. ఏకంగా ఒక కార్పొరేటర్ ఫోన్ చేసి మేము నాటి మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు అనేక విధాలుగా చెప్పి చూశామని, ఎట్టి పరిస్థితుల్లో నీరజకు మేయర్ పదవి ఇవ్వద్దంటూ ఒత్తిడి చేశామని నాటి పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. అజయ్ కుమార్ నమ్మి ఆమెకు పదవి అప్పగిస్తే ఆయననే మోసం చేసిన అపఖ్యాతి ఆమె మూటగట్టుకున్నారని వ్యాఖ్యానించారు.

### మేయర్‌పై విమర్శలు

ఖమ్మం మేయర్ నీరజకు అధికారమే అంతిమ లక్ష్యమని ఆమెతో బిఆర్ఎస్ లో రాజకీయ ప్రయాణం సాగించిన నేతలు వ్యాఖ్యానించడం ఆలోచింపజేసింది. నాడు తెలుగుదేశం పార్టీలో ఉన్న, అనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీలో చేరినా, మొన్న అధికారంలోకి వచ్చినా ,కాంగ్రెస్ లోకి చేరినా అంతిమ లక్ష్యం అధికారమే ధ్యేయంగా రాజకీయ ప్రయాణం సాగించిందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. తమను కాదని ఆమెకు నగర ప్రథమ పౌరురాలుగా బాధ్యతలు అప్పగిస్తే నమ్మిన నాయకుడిని, అందలం ఎక్కించిన పార్టీని వెన్నుపోటు పొడిచిన ఘనఖ్యాతి ఆమె సంపాదించుకున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇక ప్రస్తుతం ఆమె ఉన్న కాంగ్రెస్ శిబిరంలో ఆమె పట్ల ఎలాంటి సానుభూతి వ్యక్తం కాకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వివాద రహితుడిగా, రాజకీయ వ్యూహకర్తగా పేరుగాంచిన తుమ్మల నాగేశ్వరరావును మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆమె తులనాడిన విధానాన్ని, చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటికీ మరిచిపోలేకపోతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలోని ఓ నాయకుడు ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరేపుడే తాము వ్యతిరేకించామని గుర్తు చేశారు. ఆమె చేరిక పార్టీకి బలం కావాలి కానీ, దురదృష్టవశాత్తు పార్టీకి తీరని నష్టం చేకూర్చిందని, సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ పరువు బజారుకీడ్చిందని ఆవేదన చెందారు. ఆమెకు ఇప్పటికీ గులాబీ వాసన పోలేదని, కాంగ్రెస్ కార్యకర్తల కంటే గులాబీ పార్టీ కార్యకర్తలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### నెపం నెట్టివేసే ప్రయత్నం..!

జనం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనాల విషయంలో మేయర్ నీరజ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ వార్తలు కావాలనే కొంతమంది కార్పొరేటర్లు రాయించారు అంటూ పలువురు దగ్గర వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఎంతకు వార్తలు ఎందుకొస్తున్నాయి?.. ఎవరు రాయించారు?.. అని నెపం మరొకరిపైకి నెట్టివేసే ప్రయత్నం చేయడమే తప్ప జరిగిన పొరపాట్లు సరిదిద్దుకోవాలని ఆలోచన చేయటం లేదనేది ఆమె సన్నిహితుల వాదన. ఇప్పటికైనా కాంగ్రెస్ కార్యకర్తల మనసు గెలిచే ప్రయత్నాలు చేయని పక్షంలో రాజకీయ భవిష్యత్తు అంధకారం అయ్యే పరిస్థితులు ఉత్పన్నమయ్యే ప్రమాదం

# విశ్వవ్యాప్త విస్తరణకు తొలిమెట్టు నైనీ

- ప్రజా పాలనలో ఇతర రాష్ట్రాలకు సింగరేణి విస్తరణ
- ఒడిశా లో సింగరేణి గని ఏర్పాటు యావత్తు తెలంగాణకే గర్వకారణం
- 13 దశాబ్దాల సింగరేణి చరిత్రలో నైనీ గని ప్రారంభం ఒక సువర్ణాధ్యాయం
- ఒడిశాలో నైనీ గనిని వర్చువల్‌గా ప్రారంభించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖామంత్రి భట్టి విక్రమార్క మల్లు





(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి)

సింగరేణి సంస్థ తన 136 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు గని ప్రారంభించుకోవడం ఒక సువర్ణ అధ్యాయమని, ఒడిశా రాష్ట్రంలో నైనీ గని ప్రారంభంతో సింగరేణి తన విశ్వవ్యాప్త విస్తరణకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కమల్లు పేర్కొన్నారు. బుధవారం మహాత్మా జ్యోతి రావ్ పూలే ప్రజా భవన్ నుంచి ఆయన ఒడిశా రాష్ట్రంలో సింగరేణి చేపట్టిన నైనీ బొగ్గు బ్లాక్ ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశాలో గని ప్రారంభించడం సింగరేణి సంస్థకే కాకుండా యావత్తు తెలంగాణ రాష్ట్రానికి ఒక ఆనందకరమైన సందర్భమని అన్నారు. ఈ బొగ్గు బ్లాకును సింగరేణికి కేటాయించి 9 ఏళ్ళు అయినప్పటికీ వివిధ రకాల అనుమతులు అందడంలో జాప్యం వల్ల ప్రారంభానికి నోచుకోలేదన్నారు.

ఏడాది క్రితం ప్రజా ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, తాను కేంద్ర బొగ్గు శాఖ మంత్రిని పలుమార్లు కలిసి పూర్తి అనుమతులకు సానుకూలత సాధించామన్నారు. ప్రభుత్వం చూపిన ప్రత్యేక చొరవ వల్లే ఏడాదిలోనే దీనిని ప్రారంభించుకోవడం ప్రజా ప్రభుత్వానికి సింగరేణి అభివృద్ధిపై ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. బుధవారం ఒడిశాలో ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకు సింగరేణి విస్తరణలో ఒక తొలి అడుగు గా ఆయన అభివర్ణించారు. ఇక్కడి నుండి ఇతర రాష్ట్రాలకు ఇతర దేశాలకు కూడా సింగరేణి విస్తరిస్తుం దన్నారు. త్వరలో సింగరేణి గ్లోబల్ కంపెనీగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నైనీ గని ప్రారంభానికి సహకరించిన కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డికి, ఒడిశా ప్రాంతానికి చెందిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝికి, స్థానిక ఎమ్మెల్యే అగస్థీ బెహరా, ఇతర ప్రజాప్రతినిధులకు తన ధన్యవాదాలు తెలిపారు.

### అంగూల్ అభివృద్ధికి పూర్తి కృషి

గత ఏడాది జులైలో తన ఒడిశా పర్యటన సందర్భంగా అంగూల్ ప్రాంత అభివృద్ధికి తాను ఇచ్చిన ప్రతీ హామీని త్వరలోనే సింగరేణి సంస్థ అమలు జరుపుతుందని, ఆ ప్రాంత సర్వతో ముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ అని, కేవలం వాణిజ్యం కోసం పనిచేసే కంపెనీ కాదని, సామాజిక స్పృహతో ఇక్కడ కార్యక్రమాలు చేపడతామని భరోసా ఇచ్చారు. అంగూల్ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలు మరింతగా మెరుగుపరచడం కోసం 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కూడా నైనీ కి సమీపంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి సంబంధించిన స్థల సేకరణకు ఒడిశా ప్రభుత్వం సహకరించాల్సిందిగా కోరారు. ఇతర రాష్ట్రంలో తొలిసారిగా బొగ్గు తవ్వకం ప్రారంభించిన సింగరేణి, ఈ గనిని ఆదర్శప్రాయంగా నిర్వహించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ ఒడిశాలో సింగరేణి బొగ్గు గని ప్రారంభించడం ఒక చరిత్రాత్మక సందర్భమని, ఇది సింగరేణి అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.

నైనీ బొగ్గు గని వద్ద జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అగస్తి బెహరా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ తమ ప్రాంతంలో సింగరేణి బొగ్గు గని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ గనికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అంగూల్ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తమ రాష్ట్రంలో బొగ్గు గని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి, సింగరేణి సీఎండీకి తన శుభాకాంక్షలు తెలియజేశారు. నైనీ నుంచి ప్రారంభోత్సవ సభకు అధ్యక్షత వహించిన సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చూపిన ప్రత్యేక చొరవ, సహకారం వలన నైనీ బొగ్గు బ్లాక్‌ను ప్రారంభించుకో గలిగామన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ మార్గ నిర్దేశంలో థర్మల్ పవర్ ప్లాంట్ను కూడా ప్రారంభిస్తామని, మరిన్ని అభివృద్ధి, విస్తరణ కార్యక్రమాలను విజయవంతంగా చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రజా భవన్ నుంచి ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఓఎస్డీ సురేందర్ రెడ్డి, సింగరేణి ఈడీ(కోల్ మూమెంట్) ఎస్డి.ఎం.సుభానీ పాల్గొనగా.. నైనీ నుంచిసంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, నైనీ జీఎం టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీ, ఈసీల నియామకంపై విచారణ

### మే 14న విచారణ వాయిదా

న్యూఢిల్లీ, ఏప్రిల్16 (జనంసాక్షి) : సీఈసీ, ఈసీల నియామక చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మే 14వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు- సుప్రీంకోర్టు బుధవారం వెల్లడించింది. ఓ పిటిషన్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్.. ఈ విషయంలో త్వరగా విచారణ జరపాలని సర్వోన్నత న్యాయస్థానానికి ఆయన విజ్ఞప్తి చేశారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై వచ్చే నెలలో విచారణ జరపనుంది. అదేరోజు భూసేకరణతో పాటు- అనేక ఇతర కీలకమైన కేసులను ఈ రోజు ధర్మాసనం విచారిస్తుందని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. కాగా, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ- నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగిస్తూ 2023లో కేంద్రం చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
17 ఏప్రిల్ 2025

# రాజీవ్ యువ వికాసం గేమ్ చేంజర్

- యువకుల జీవితాలు మారుతాయి, బ్యాంకర్లకు మంచి పేరు వస్తుంది
- జిల్లాస్థాయిలో కలెక్టర్లు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాలి
- రాజీవ్ యువ వికాసం పథకంపై బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశంలో
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు




హైదరాబాద్, ఏప్రిల్ 16 (జనంసాక్షి) : రాజీవ్ యువ వికాసం పథకంతో నిరుద్యోగుల జీవితాలు మారుతాయి, వారి జీవన ప్రమాణాలు పెరుగుతాయి రాష్ట్రంలో ఈ పథకం ఒక గేమ్ చేంజర్ గా మిగులుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం జ్యోతిరావు పూలే ప్రజా భవన్లో యువ వికాసం పథకం అమలుపై బ్యాంకులతో ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం ఒక సాధారణ సంక్షేమ పథకం గా చూడవద్దని బ్యాంకర్లను కోరారు. మానవీయ కోణంలో రాష్ట్ర ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు సుదీర్ఘ సమావేశాలు నిర్వహించి పథకానికి రూపకల్పన చేసినట్టు వివరించారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు ఇంత పెద్ద మొత్తంలో స్వయం ఉపాధి పథకాలకు ఏనాడు ఏ ప్రభుత్వం కేటాయింపులు చేయలేదని తెలిపారు. కొలువుల కోసం కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత 10 సంవత్సరాలపాటు నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదని అన్నారు. ఓవైపు ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూనే మిగిలిపోయిన నిరుద్యోగుల కోసం స్వయం ఉపాధి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా ఆర్థికంగా సామాజికంగా రాష్ట్రంలోని యువతకు సహాయపడేందుకు బ్యాంకర్లు తోడ్పాటును అందించాలన్నారు. రాజీవ్ వికాసం ద్వారా రాష్ట్రంలో సంపద సృష్టించబడుతుంది అన్నారు. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ మొదలు కమిషనర్ల వరకు ఈ పథకం రూపకల్పన, ఎంపికైన వారికి శిక్షణ పై తీవ్ర కసరత్తు చేసినట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం 6,000 కోట్లు ఖర్చు పెడుతుంది బ్యాంకర్లు 1,600 కోట్లు లింకేజీ ఇచ్చేందుకు ముందుకు రావాలి అన్నారు. ఈ పథకంలో బ్యాంకర్లు ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా మీకు మంచి పేరు దక్కుతుందని, యువ వికాసం పథకం కింద లబ్ధి పొందే యువకులకు వ్యాపారం చేసుకోవడం, లాభాలు సాధించడం పైన అధికారులు కనీసం మూడు రోజుల నుంచి 15 రోజుల వరకు శిక్షణ ఇస్తారని, వ్యాపారంలో ఇబ్బందులు ఏర్పడితే శిక్షణ సంస్థలు మద్దతు ఇస్తాయని బ్యాంకర్లకు వివరించారు. కొన్ని ప్రాంతాల్లో కమర్షియల్ బ్యాంకులు మాత్రమే ఉంటాయి మరికొన్ని ప్రాంతాల్లో రూరల్ బ్యాంకులు ఉంటాయి. ఈ పథకం విజయవంతం చేసేందుకు బ్యాంకర్లు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్లు బ్యాంకర్లతో త్వరలో సమావేశంలో నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అర్హులకు సాంక్షన్ లెటర్లు అందజేసిన తర్వాత రాష్ట్రస్థాయిలో మరోసారి ఎస్ఎల్బీసీ సమావేశం నిర్వహిస్తాం అన్నారు. రాజీవ్ యువ వికాసంలో లబ్ధిదారులకు ప్రభుత్వ వాటా విడుదల చేయగానే, బ్యాంకర్లు లింకేజీ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, ఎస్టి సంక్షేమ శాఖ సెక్రెటరీ శరత్, బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీ శ్రీధర్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, అన్ని శాఖల బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

### ఇందిరా గిరి సోలార్ జల వికాసం వేగవంతం చేయండి

ఇందిరా గిరి సోలార్ జల వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తుంది, ఈ పథకానికి సంబంధించిన విధి విధానాల ఖరారులో వేగం పెంచాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మహాత్మ జ్యోతి రావు పూలే ప్రజాభవన్లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అడవులను పెంచుతూనే, గిరిజనులకు ఆదాయం సమకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ పథకానికి 12,500 కోట్లు వెచ్చించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు డిప్యూటీ సీఎం అధికారులకు వివరించారు. గతంలో ఏ ప్రభుత్వము గిరిజనుల వ్యవసాయ అభివృద్ధికి ఇంత పెద్ద మొత్తంలో ఏకకాలంలో నిధులు కేటాయించలేదు అన్నారు. గిరిజనులకు ఆర్ వో ఎఫ్ ఆర్ చట్టం కింద కేటాయించిన భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇందిరా సోలార్ జల వికాసం ఉపయోగపడుతుంది అన్నారు. పట్టాలు పొందిన గిరిజనుల భూముల్లో జల వనరుల లభ్యత కోసం జియాలజికల్ సర్వే, తదుపరి బోర్లు వేయడం, సోలార్ పంపు సెట్లు బిగించడం అన్ని పనులు ఒకే ఏజెన్సీకి కేటాయించాలని తద్వారా జాప్యం జరగకుండా, గిరిజన రైతులు ఇబ్బందులు పడకుండా పథకం అమలు సులభతరం అవుతుంది అన్నారు. ఇ0దుకోసం అధికారులు సమావేశమై టెండర్ల ఖరారు కు విధి విధానాలు రూపొందించాలన్నారు. ఈ పథకం అమలులో ఉద్యాన వన శాఖ పాత్ర కీలకమైందని విషయం తెలిపారు. అవకాడో, వెదురు వంటి పంటలు గిరిజనులు సాగు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈ పంటల సాగు జరుగుతున్న తీరుపై గిరిజన రైతులకు అవగాహన కల్పించేందుకు స్టడీ టూర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పామాయిల్, వెదురు వంటి పంటలు చేతికి రావాలంటే కనీసం మూడు సంవత్సరాల సమయం పడుతుంది ఈలోపు గిరిజనులకు ఆదాయం సమకూరేందుకు అవసరమైన అంతర పంటల సాగును గుర్తించాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. మొదట ఈ పథకాన్ని ఆదిలాబాద్, భద్రాద్రి- కొత్తగూడెం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు ఆయా జిల్లా అధికారులతో సంప్రదింపులు జరపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. మే రెండో వారంలోగా పథకం అమలుకు అవసరమైన అన్ని పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, అటవీశాఖ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, గిరిజన శాఖ కమిషనర్ శరత్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకి, ఉద్యాన శాఖ కమిషనర్ యాస్మిన్ భాష తదితరులు పాల్గొన్నారు.



## లావణ్య ఇంటిముందు రాజ్‌తరుణ్ పేరెంట్స్ ఆందోళన

- తమ కుమారుడి ఇల్లు తమకు ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్16 (జనంసాక్షి) : రాజ్ తరుణ్ లావణ్య వివాదం మళ్లీ మొదలైంది. బుధవారం రాజ్ తరుణ్ తల్లిదండ్రులు కోకాపేటలోని లావణ్య ఇంటి ముందు ఆందోళనకు దిగారు. లావణ్య ఉంటున్న ఇల్లు రాజ్ తరుణ్ ది అని.. తన కొడుకు కష్టపడి కట్టుకున్న ఇల్లు అని అన్నారు. లావణ్య తమ ఇంట్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సొంత ఇల్లు ఉండి తాము బయట ఎందుకు ఉండాలని నిలదీశారు. తాము నడవలేని స్థితిలో ఉన్నామని.. తమ ఇల్లు తమకు కావాలని న్యాయం చేయాలని కోరుతున్నారు. అయితే ఇది తన ఇల్లు అని..ఈ ఇంట్లో 15 ఏళ్లుగా ఉంటున్నానని లావణ్య చెబుతున్నారు. రాజ్ తరుణ్ తల్లిదండ్రులు 15 మందిని తీసుకొచ్చి తనపై దాడి చేయించారని లావణ్య ఆరోపిస్తున్నారు. తన ఇంటి ముందు సీసీ కెమెరాలు ధ్వంసం చేశారని చెప్పారు. ఈ విషయం కోర్టులో ఉందని..అక్కడే తేల్చుకుంటానని లావణ్య అన్నారు. ఒక్క చాన్స్ ఇస్తే కాళ్లు పట్టుకొని రాజ్ తరుణ్ ను క్షమించమని అడుగుతానని చెప్పింది. రాజ్ తరుణ్ పేరెంట్స్ కి కూడా క్షమాపణలు చెప్తానంది. మస్తాన్ సాయి తనను డ్రగ్స్ కేసులో ఇరికించాడని, చెప్పుడు మాటలు విని ఆవేశంలో రాజ్ తరుణ్ పై కేసు పెట్టానని పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. మస్తాన్ రాయి తనతోపాటు- పలువురు యువ తులతో అసభ్యంగా ప్రవర్తించాడని, న్యూడ్ వీడియోలు, ఫొటోలు తీసి బెదిరించాడని ఆరోపించింది. వివాదాలకు ఇక ఫుల్ స్టాప్ పెట్టాలని అనుకుంటున్నానని, తన పోరాటం ఇకపై మస్తాన్ సాయిపైనే ఉంటుందని చెప్పింది. తనను చంపేందుకు చాలా మంది కుట్రలు చేస్తున్నారని, తాను బతికి ఉంటానో.. లేదో.. కూడా తెలియదని, బతికి ఉండగానే రాజ్ తరుణ్ తనకు సారీ చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని కోరింది.మళ్లీ ఇవాళ రాజ్ తరుణ్ పేరెంట్స్ తో గొడవకు దిగడం ఆసక్తికరంగా మారింది.

## సిఎం విజయన్, ఆయన కుమార్తె వీణలకు నోటీసులు

తిరువనంతపురం, ఏప్రిల్16 (జనంసాక్షి) : ఎక్సోలాజిక్ మంత్లీ పేమెంట్ కేసుకు సంబంధించి కేరళ సీఎం విజయన్, అతని కుమార్తె వీణా విజయన్ కు కేరళ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్ట్ అజయన్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం ఆధారంగా నోటీసులిచ్చింది. ఈ పిటిషన్ ను ఇంకా కోర్టు ఫైల్ లోకి స్వీకరించనప్పటికీ అంతకుముందే కేసులో ప్రమేయం ఉన్న అన్ని పార్టీలకు నోటీసులు పంపాలని హైకోర్టు ఆదేశించింది. ఇతర ప్రతివాదులుగా అధికారులను చేర్చింది. ఆదాయపు పన్ను శాఖ నివేదిక ఆధారంగా ఈ విషయంపై సీబీఐ దర్యాప్తు జరపాలని అజయన్ పిటిషన్‌లో డిమాండ్ చేశారు. ఈ కేసులో విజిలెన్స్ దర్యాప్తు కోరుతూ గతంలో దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ఇప్పటికే కొట్టివేసింది. ఆదాయపు పన్ను పరిష్కార బోర్డు నివేదికలో పేర్కొన్న పేర్లను సమర్పించాలని కూడా కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.ఈ కేసు వేసవి సెలవుల తర్వాత మే 27న మళ్లీ హైకోర్టు విచారించనుంది.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఉద్రిక్తత

- స్టేజీపైనే పరస్పరం విమర్శలు చేసుకున్న మంత్రి, వేముల




నిజామాబాద్, ఏప్రిల్16 (జనంసాక్షి) : నిజామాబాద్ జిల్లా భీంగల్ లో కల్యాణలక్ష్మిా చెక్కుల పంపిణిలో ఉద్రిక్తత నెలకొంది. స్టేజ్ పైనే మంత్రి జూపల్లి కృష్ణారావు,బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఒకరినొకరు వాగ్వాదానికి దిగారు. జూపల్లి మాట్లాడుతుండగా డౌన్ డౌన్ అంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్,బీఆర్ఎస్ కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. మంత్రి జూపల్లి స్టేజ్ పై కల్యాణలక్ష్మిా చెక్కుల పంపిణీ చేస్తుండగా తులం బంగారం ఏమైందని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. వెంటనే మంత్రి జూపల్లి కల్గజేసుకుని 10 ఏళ్లలో మీరు మూడెకరాల భూమి ఇచ్చారా?. నిరుద్యోగ భృతి ఇచ్చారా? గతంలో చేసిన ముఖ్యమంత్రుల అప్పు,10 ఎళ్లలో కేసీఆర్ చేసిన అప్పు సమానం. మేము వచ్చి 16 నెలలే అయింది ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తాం అని మంత్రి జూపల్లి బదులిచ్చారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం తలెత్తడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాలు బాహాబాహికి దిగారు. పోలీసులు కల్గజేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. తోపులాట జరగడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జ్ చేయడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.

## గ్రూప్-1 పరీక్షలో భారీ స్కామ్

- సిబిఐ విచారణ జరిపించాలి
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్



హైదరాబాద్, ఏప్రిల్ 16 (జనంసాక్షి) : గ్రూప్-1 పరీక్షలో భారీ స్కామ్ జరిగిందని బీఆర్ఎస్ నేత, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. మొత్తం 21,093 మంది మెయిన్స్ పరీక్ష రాస్తే.. 21,103 మందికి ఫలితాలు ఎలా ఇచ్చారని అన్నారు. ఆ 10 మంది అదనంగా ఎలా వచ్చారని ప్రశ్నించారు. పరీక్ష రాసిన వాళ్ళకంటే ఎక్కువ మందికి రిజల్ట్ ఇస్తారని నిలదీశారు. ఉర్దూ మీడియంలో మొదటగా 9 మంది అని చెప్పి.. తర్వాత 10 అంటున్నారు.. ఒక్కరు ఎలా పెరిగారని క్వశ్చన్ చేశారు. యూపీఎస్సీలో ప్రిలిమ్స్‌కు, మెయిన్స్ కు ఒకేటే హాట్ టికెట్ ఉంటుందని.. మరీ ఇక్కడ ప్రిలిమ్స్, మెయిన్స్‌కు ఎందుకు వేర్వేరుగా హాల్ టికెట్ నెంబర్లు ఇచ్చారన్నారు. కమిషన్లు తీసుకోని ఫలితాలు ఇచ్చారని ఆరోపించారు. 438 సిరీస్‌లో ఉన్న వారందరికీ ఒకే మార్కులు ఎలా వస్తాయన్నారు. కాంగ్రెస్ నేత రాములు నాయక్ కోడలికి మల్టీ జోన్‌లో ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. తన కోడలు పరీక్షల కోసం 18 గంటలు చదివిందని రాములు నాయక్ చెప్పారు. ఆయన కోడలు మాత్రం రోజు 5 గంటలు చదివానని చెప్పింది. ఇద్దరిలో ఎవరు చెప్పేది నిజమని ప్రశ్నించారు. కోటి ఉమెన్స్ కాలేజ్‌లో అమ్మాయిలు మాత్రమే పరీక్షా రాశారని.. ఈ సెంటర్లో పక్కా స్కామ్ జరిగిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని విభాగాల్లో ఫెయిల్ అయ్యిందని.. స్కాములు చేస్తోందని అన్నారు.



## శ్రీశైలం దారిలో వన్యప్రాణుల రక్షణ

- వాహనాలపై నిషేధంతో సత్ఫలితాలు

శ్రీశైలం, ఏప్రిల్16 (జనంసాక్షి) : నల్లమల అటవీ ప్రాంతమైన హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై రాత్రివేళ ప్రయాణలను నిషేధించిన తరవాత సత్ఫలితాలు ఇస్తున్నాయని స్థానికులు అంటున్నారు. వాహనాల వేగం నిరోధించాలని అన్నారు. ఇక్కడ వాహనాల వేగం కారణంగా అటవీ జంతువులు వాటి కింద పడి చనిపోవడంతో ఈ చర్య తీసుకున్నారు. దీంతోపాటు రాత్రివేళ ఈ మార్గంలో వాహనాల రాకపోకలపై నిషేధం విధించారు. అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై వేగంగా వెళుతున్న వాహనాల వల్ల పలు వన్యప్రాణులు మరణించిన నేపథ్యంలో కొత్తగా వాహనాల వేగనియంత్రణకు చర్యలు తీసుకోవాలని సర్కారు నిర్ణయించింది. ఇటీవల స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, వైద్యులు, ఇంజనీర్లతో జరిపిన వన్యప్రాణుల సర్వేలో వెల్లడైన వాస్తవాలతో ఇకనుంచి వన్యప్రాణుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. దీంతోపాటు రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు నల్లమల అటవీ ప్రాంతం గుండా వెళ్లే జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను నిషేధించాలని నిర్ణయించారు. అభయారణ్యంలో రోడ్డు ప్రమాదాల బారినుంచి వన్యప్రాణుల పరిరక్షణ కోసం హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాలు 40 కిలోమీటర్ల వేగం కంటే ఎక్కువగా నడపరాదని తెలంగాణ సర్కారు ఆదేశాలు జారీ చేసింది.

## ఎటిఎంలాగా నేషనల్ హెరాల్డ్ ఆస్తుల వినియోగం

- కాంగ్రెస్ నేతలపై మండిపడ్డ బిజెపి నేత రవిశంకర్



న్యూఢిల్లీ, ఏప్రిల్16 (జనంసాక్షి) : నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అభియోగపత్రం నమోదు చేసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దేశ వ్యాప్తంగా ఈడీ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టారు. మోడీ కుట్రలతో ఇడి కేసులు నమోదు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఏఐసిసి కార్యాలయంతో పాటు, పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు నిరసనలకు దిగారు. దీనిపై భాజపా స్పందిస్తూ.. చారిత్రక నేపథ్యం గల నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రికను కాంగ్రెస్ అగ్రనేతలు తమ ప్రైవేటు ఏటీఎంగా వాడుకున్నారని ఆరోపించింది. కాంగ్రెస్ పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంది కానీ.. ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేసి నేషనల్ హెరాల్డ్‌కు ఇచ్చే హక్కు లేదని భాజపా సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ అన్నారు. దేశ రాజధానిలోని బహదూర్ షా జాఫర్ మార్గ్ నుంచి ముంబయి, లఖ్‌నవూ, భోపాల్, పట్నా వరకు దేశవ్యాప్తంగా ఉన్న విలువైన ప్రజాఆస్తులను యంగ్ ఇండియా లిమిటెడ్ ద్వారా గాంధీ కుటుంబం చేతుల్లోకి బదిలీ చేయడానికి ఈ కార్పొరేట్ కుట్ర పన్నారని ఆరోపించారు. 'అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్' కు సంబంధించిన 99శాతంషేర్లను కేవలం రూ.50 లక్షలకు బదలాయించుకొని, రూ.రెండు వేల కోట్ల విలువ చేసే ఆస్తుల్ని గాంధీ కుటుంబం తప్పుడు మార్గాన కైవసం చేసుకుందని ఆరోపించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న ప్రజల గొంతును బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన ఈ వార్తా పత్రికను గాంధీ కుటుంబం తమ ప్రైవేట్ ఏటీఎంగా వాడుకున్నారని దుయ్యబట్టారు. ఈ కేసును కొట్టివేయించడానికి సోనియాగాంధీ, రాహుల్ ఎన్ని ప్రయత్నాలు చేసినా అవన్నీ విఫలమయ్యానని..చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. అక్రమాలకు పాల్పడినవారు తప్పించుకోవడానికి ఇది కాంగ్రెస్ పాలన కాదని..ప్రధాని నరేంద్ర మోదీ నడిపిస్తున్న దేశమని అన్నారు. ఇక్కడ రాజ్యాంగానికి ఎవరూ అతీతులు కాదని పేర్కొన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అభియోగపత్రం నమోదు చేసింది. సోనియాను మొదటి నిందితురాలి (ఏ-1)గా, రాహుల్‌ను ఏ-2గా దీనిలో పేర్కొంది. న్యాయరీత్యా విచారణ చేసే హక్కు కోణంలో న్యాయమూర్తి దీనిని పరిశీలించి, తదుపరి విచారణను ఈనెల 25కి వాయిదా వేశారు. కేసు డైరీలను తమ పరిశీలన కోసం సమర్పించాలని ఈడీ తరఫు న్యాయవాదిని ఆదేశించారు. కాంగ్రెస్ నేతలు శ్యాం పిట్రోడా, సుమన్ దుబె తదితరులను కూడా ఈ కేసులో నిందితులుగా ఈడీ పేర్కొంది.

## బెంగాల్ అల్లర్ల మృతులకు ఎక్స్‌గ్రేషియా

- పదిలక్షల చొప్పున సిఎం ప్రకటన

కోల్‌కతా, ఏప్రిల్16 (జనంసాక్షి) : వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా అల్లర్లతో గత కొద్ది రోజులుగా బెంగాల్ అట్టుడుకుతోంది. వక్ఫ్ చట్టాన్ని నిరసిస్తూ పెద్ద ఎత్తున ముస్లింలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. పలు చోట్ల హింస చెలరేగడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయాలయ్యాయి. ఇక పోలీస్ బలగాలు రంగంలోకి దిగి లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టారు. అయినా కూడా అక్కడక్కడ అల్లర్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక నిరసనకారులు వాహనాలను తగలబెట్టారు. ఇదిలా ఉంటే ముర్షిదాబాద్ హింసలో మరణించిన ముగ్గురు వ్యక్తుల కుటుంబానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సాయం ప్రకటించారు. రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను మమత ప్రకటించారు. ఇక అల్లర్లు కారణంగా వందలాది హిందూ కుటుంబాలు ఇళ్లను వదిలి వేరే చోట ఆశ్రయం పొందుతున్నారు. ఇక హింసకు పాల్పడిన 150 మందికి పైగా ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదిలా ఉంటే వక్ఫ్ చట్టాన్ని బెంగాల్‌లో అమలు చేయబోమని ఇప్పటికే సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. కానీ అల్లర్లు ఆగలేదు. తాజాగా బుధవారం నేతాజీ ఇండోర్ స్టేడియంలో ముస్లిం మతాధికారులు, ఇమామ్‌లు, ముజ్జిన్‌లు, ముస్లిం మేధావులతో మమతా బెనర్జీ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల బాధ్యతను కోల్‌కతా మేయర్, ముస్లిం సమాజానికి చెందిన సీనియర్ టీఎంసీ నేత ఫిర్హాద్ హకీమ్‌కు అప్పగించారు. శాంతిని నెలకొల్పేందుకు ముస్లిం పెద్దలతో మమత చర్చించనున్నారు.

## రైతుల ఉచ్చుకు చిక్కుకున్న చిరుత

మదనపల్లె, ఏప్రిల్16 (జనంసాక్షి) : అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం పొన్నేటిపాళ్యం గ్రామం సమీపంలోని అడవిలో ఓ చిరుత ఉచ్చులో చిక్కుకుంది. రైతులు తమ పంట పొలాలను అడవి జంతువుల నుంచి కాపాడుకోవడానికి ఏర్పాటు చేసిన ఉచ్చులో ఈ చిరుత చిక్కుకొని గంటల తరబడి నరకయాతన అనుభవించింది. బుధవారం ఉదయం పొలాలకు వచ్చిన రైతులు చిరుతను కనుక్కొని ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున గుమికూడారు. రాత్రి నుంచి ఉచ్చులో చిక్కుకున్న చిరుతను బయటకు తీసేందుకు ఫారెస్ట్ ప్రయత్నాలు చేసారు.

## మద్యం కేసులో నేడు సిట్ విచారణకు విజయసాయిరెడ్డి

విజయవాడ, ఏప్రిల్16 (జనంసాక్షి) : మద్యం కేసులో విచారణకు హాజరు కావాలంటూ ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ మాజీ ఎంపీ విజయసాయి రెడ్డికి నోటీసులు జారీ చేసింది.. విజయవాడలో ఉన్న సిట్ కార్యాలయానికి ఈనెల 18వ తేదీన విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో విచారణకు రావాలని కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి సిట్ నోటీసులు జారీ చేసినా.. ఆయన విచారణకు హాజరు కాలేదు.. తాజాగా విజయసాయి రెడ్డికి సిట్ నోటీసులు జారీ అయ్యాయి.. అయితే, మద్యం కుంభకోణం లో రేపు ఉదయం 10 గంటలకు విచార ణకు హాజరవుతున్నారు మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి.. అంటే నోటీసుల్లో పేర్కొన్న దానికంటే ఒకరోజు ముందుగానే విచారణకు వెళ్లబోతున్నారు.. ఈ మేరకు సిట్ అధికారులకు సమాచారం ఇచ్చారు సాయిరెడ్డి.. తొలుత ఈ నెల 18న విచారణకు రావాలని నోటీ-సులు ఇచ్చారు సిట్ అధికారులు.. అయితే తనకు ముం దుగా నిర్ణయించిన కార్యక్రమం ఉండ టంతో 17న విచారణకు వస్తున్నానని సమా చారం పంపించారు విజయ సాయిరెడ్డి.. ఇక, 17వ తేదీన విచారణకు రావాలని, తాము రెడీ అని విజయసాయికి సిట్ సమాచారం పంపింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370